చదవండి.. చదివించండి..
నేటి శుభోదయ
ప్రతిక్షణం.. ప్రజల కోసం...
నిజమైన వార్తలు... నమ్మకమైన పత్రిక
నిరపేక్ష వార్తలు | నిజాయితీ జర్నలిజం | ప్రజల గొంతుక
వార్తలు, ప్రకటనల కోసం సంప్రదించండి
మా వెబ్‌సైట్ www.netishubhodaya.com
వాట్సాప్ 96965 71571
మీ నమ్మకం.. మా బాధ్యత.. శుభోదయంతో ప్రతి ఉదయం ప్రగతివైపు!

RNI TELTEL/2024/89620
తెలంగాణ
నేటి
# శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

GK MEDIA
Voice of People
CHANNEL NO. 433
SSLC CABLE NETWORK
SSLC కేబుల్ నెట్‌వర్క్‌లో వస్తుంది

ప్రచురణ : తెలంగాణ | సంపుటి 02 | సంచిక 349 | సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | ఆదివారం 27 - సెప్టెంబర్ - 2026 | వెల రూ. 5 /-



## తెలంగాణ తెగువకు, ధిక్కార స్వరానికి ఐలమ్మ నిలువెత్తు రూపం : కేసీఆర్

**చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా ఘన నివాళి అర్పించిన కేసీఆర్**

**నాటి రాచరిక వ్యవస్థను ధైర్యంగా ఎదిరించిన వీరవనిత అని కేసీఆర్ కితాబు**

**ఐలమ్మ పోరాట పటిమ నేటి యువతకు ఆదర్శనీయమని వ్యాఖ్య**

**నేటి శుభోదయ, హైదరాబాద్ :** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, ఆత్మగౌరవ ప్రతీక చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రత్యేక ప్రకటన విడుదల చేస్తూ... తెలంగాణ తెగువకు, ధిక్కార స్వరానికి ఆమె నిలువెత్తు రూపమని కొనియాడారు. నాటి రాచరిక వ్యవస్థను ధైర్యంగా ఎదిరించి, రైతాంగ హక్కుల కోసం పోరాడిన ధీర వనిత అని ప్రశంసించారు. అణచివేతకు గురవుతున్న బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవాన్ని ఆమె ప్రపంచానికి చాటిచెప్పారని పేర్కొన్నారు.

మిగతా 2వ పేజీ లో..

# మన్మోహన్‌కు 'భారతరత్న' ఇవ్వాలి



## - ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

- హైదరాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహావిష్కరణ
- పీవీ, మన్మోహన్ వల్లే దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉందని వ్యాఖ్య
- మౌనాన్ని భాషగా మార్చి గొప్ప పాలన అందించారని ప్రశంస



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' ప్రకటించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, విప్రో సర్కిల్ వద్ద మన్మోహన్ సింగ్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, మౌనాన్ని తన భాషగా మార్చుకుని, దేశానికి అద్భుతమైన పాలన అందించిన గొప్ప రాజనీతిజ్ఞుడు మన్మోహన్ సింగ్ అని కొనియాడారు. అంతటి మహనీయుడికి భారతరత్న ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వానికి ఉన్న అభ్యంతరం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చొరవ తీసుకుని మన్మోహన్ సింగ్‌ను భారతరత్నతో సత్కరించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీలకు అతీతంగా మేధావులను గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన ......

2

## బ్యాంక్ ఖాతాదారులకు అలర్ట్.. 3 రోజులు సమ్మె..

- సెప్టెంబర్ 28-30 వరకు మూడు రోజుల బ్యాంక్ సమ్మె
- సెప్టెంబర్ 27 ఆదివారం పనిచేయనున్న ప్రభుత్వ బ్యాంకులు
- ఆర్ఆర్‌బీలు సైతం ఆదివారం తెరిచే ఉంటాయి
- ముఖ్యమైన లావాదేవీలు ముందే పూర్తి చేసుకోవాలని బ్యాంకుల సూచన

2



## ఈఎంఐ పద్ధతిలో లంచం..

### రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ మహిళా సీడీపీవో

- జగిత్యాల జిల్లాలో లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సీడీపీవో
- అంగన్వాడీ సూపర్‌వైజర్ల నుంచి నెలవారీ వసూళ్లు
- నెలకు ఒక్కొక్కరి నుంచి రూ.1000 చొప్పున ఒప్పందం
- మూడు నెలలకు కలిపి రూ.63,000 తీసుకుంటుండగా ఏసీబీ దాడి



2

## కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు..

### ప్రభుత్వం కీలక ప్రకటన

- కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు రంగం సిద్ధం
- నవంబర్ రెండో వారం నుంచి పనులు ప్రారంభం
- 2027 వర్షాకాలం నాటికి పూర్తి చేయాలని లక్ష్యం
- అక్టోబర్ 5న సీడబ్ల్యూసీకి డిజైన్లు సమర్పించనున్న అధికారులు

2



## బాలాపూర్ రికార్డు బద్దలు..

### దిల్‌సుఖ్‌నగర్ గణేశుడి లడ్డూకు రూ.51 లక్షలు!



- దక్కించుకున్న స్థానిక భక్తుడు రాజేష్
- ఇక్కడే మరో లడ్డూకు రూ.25 లక్షలు
- వేలం నిర్వహించిన జై గణేశ్ యూత్ అసోసియేషన్
- వేలం నిధులను సేవా కార్యక్రమాలకు ఉపయోగిస్తామన్న నిర్వాహకులు

2

# రేవంత్ 'నిజాయతీ గల మోసగాడు': కేటీఆర్

- హైకోర్టు తీర్పుపై రైతుబంధుపై ప్రభుత్వాన్ని తప్పుబట్టిన కేటీఆర్
- హామీలు అమలు కాలేదని ఆరోపణ
- కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి
- 2028లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని ధీమా
- సెప్టెంబర్ 28 నుంచి పట్టభద్రుల ఓటరు నమోదుకు పిలుపు



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్ 'నిజాయతీ గల మోసగాడు' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజలు పాలిచ్చే బర్రెను వదిలి తన్నే దున్నపోతును తెచ్చుకున్నారని అన్నారు. తెలంగాణ భవన్‌లో శనివారం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. సత్తూరి యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికల కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. కేసీఆర్ ప్రజల తీర్పును గౌరవించి కాంగ్రెస్ ప్రభుత్వానికి అవకాశం ఇచ్చారని కేటీఆర్ అన్నారు. మూడేళ్లుగా కేసీఆర్ ప్రజల్లోకి రాకపోయినా గల్లీ గల్లీలో ఆయన పాటలు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో రైతులు నాట్లు వేసే సమయానికే రైతుబంధు డబ్బులు ఖాతాల్లో పడేవని కేటీఆర్ చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటివరకు మూడుసార్లు రైతుబంధు ఇవ్వలేదని ఆరోపించారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలతో పాటు హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి ఒక్క హామీ కూడా పూర్తిగా నెరవేర్చలేదని విమర్శించారు. ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపిస్తే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని భావించారని కేటీఆర్ అన్నారు. కానీ పరిస్థితి 'అన్న వస్త్రానికి పోతే ఉన్న వస్త్రం పోయినట్లు' తయారైందని వ్యాఖ్యానించారు. మహబూబాబాద్‌లో కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించిన నాయకుడు కనిపించకుండా పోయారని ఎద్దేవా చేశారు. 2028 ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.

## గణేశ్ నిమజ్జనం సక్సెస్..

### పోలీసులతో కలిసి డ్యాన్స్ చేసిన సీపీ సజ్జనార్



- హైదరాబాద్‌లో ప్రశాంతంగా ముగిసిన గణేశ్ నిమజ్జనం
- విజయవంతమైన బందోబస్తుతో పోలీసుల సంబరాలు
- సిబ్బందితో కలిసి డ్యాన్స్ చేసిన హైదరాబాద్ సీపీ సజ్జనార్
- ట్యాంక్‌బండ్, అసెంబ్లీ వైపు ట్రాఫిక్ ఆంక్షల ఎత్తివేత

2

## నకిలీ ఆధార్‌లకు చెక్..

### డూప్లికేట్ ఆధార్ల భరతం పట్టేందుకు దేశీయ టెక్నాలజీ

- నకిలీ ఆధార్ కార్డుల గుర్తింపునకు 'భారత్ ఏబీఐఎస్' అనే కొత్త వ్యవస్థ
- యూఐడీఏఐ పరిశోధకుల ఆధ్వర్యంలో దేశీయంగా అభివృద్ధి
- పరీక్షల్లో నిర్దేశిత లక్ష్యాలను మించి అత్యుత్తమ ఫలితాలు
- భారత పూర్తి డేటాబేస్‌పై ఇంకా విస్తృత పరీక్షలు జరగాల్సి ఉందన్న నిపుణులు




2

## ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలంటూ ప్రచారం..

### ప్రెస్ నోట్, గ్రూప్ ఫొటోతో చెక్ పెట్టిన ఈసీ

- ఈసీలో విభేదాల వార్తలను ఖండించిన పూర్తిస్థాయి కమిషన్
- నిర్ణయాలన్నీ ఏకగ్రీవమేనని స్పష్టం చేసిన ముగ్గురు కమిషనర్లు
- ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై నిర్ణయాన్ని సుప్రీంకోర్టు సమర్థించిందని వెల్లడి
- పనితీరును మెరుగుపర్చేందుకు అంతర్గత విధానాల్లో కీలక మార్పులు

2



# మన్మోహన్‌కు 'భారతరత్న' ఇవ్వాలి

### - ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

మొదటిపేజీ తరువాయి.. అభిప్రాయపడ్డారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు మన్మోహన్ సింగ్ బాధ్యతలు చేపట్టారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. పీవీ నరసింహారావు, మన్మోహన్ సింగ్‌ల దార్శనికత వల్లే దేశంలో ఆర్థిక సంస్కరణలు వచ్చాయని, దాని ఫలితంగానే నేడు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటివి రూపుదిద్దుకున్నాయని పేర్కొన్నారు. భూసేకరణ చట్టాన్ని తీసుకువచ్చి, భూనిర్వాసితుల అంగీకారాన్ని తప్పనిసరి చేసిన ఘనత మన్మోహన్ సింగ్ ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. మన్మోహన్ సింగ్ జీవితం నేటి 'జెన్-జెడ్' సహా అన్ని తరాలకు స్ఫూర్తిదాయకమని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. రమణ, రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ తెగువకు, ధిక్కార స్వరానికి ఐలమ్మ నిలువెత్తు రూపం : కేసీఆర్

మొదటిపేజీ తరువాయి.. కేవలం భూస్వాములను వ్యతిరేకించడమే కాకుండా, అప్పట్లోనే చట్టాల పరిధిలో కోర్టుల ద్వారా న్యాయం పొంది ఆమె ప్రజాస్వామిక నిబద్ధతను చాటుకున్నారని కేసీఆర్ గుర్తుచేశారు. ఐలమ్మ పోరాట పటిమ నేటి యువతకు ఎప్పుడూ ఆదర్శనీయమని, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఆమె స్ఫూర్తి చాలా అవసరమని అభిప్రాయపడ్డారు. తాను చేపట్టిన శాంతియుత మలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ ఆమె పోరాట స్ఫూర్తి అంతర్భాగంగా ఉందన్నారు. చాకలి ఐలమ్మ చరిత్రను భావితరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతోనే తమ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆమె జయంతిని అధికారికంగా నిర్వహించే సంప్రదాయానికి శ్రీకారం చుట్టామని కేసీఆర్ వెల్లడించారు. ఐలమ్మ ఆశయాల సాధనే ధ్యేయంగా తాము అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో మహిళా, శిశు సంక్షేమంతో పాటు రైతాంగం, సబ్బండ కులాల అభ్యున్నతికి ఎన్నో విప్లవాత్మక పథకాలను అమలు చేశామని తెలిపారు. కులవృత్తులకు పునరుజ్జీవం పోసి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా తెలంగాణ ఆత్మగౌరవాన్ని మహోన్నతంగా నిలబెట్టామని, ఆనాడు తాము సాధించిన ప్రగతి నేడు దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని ఆయన పేర్కొన్నారు.

## ఈఎంఐ పద్ధతిలో లంచం..

### రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ మహిళా సీడీపీవో

మొదటిపేజీ తరువాయి.. లంచాన్ని నెలవారీ వాయిదాల రూపంలో వసూలు చేస్తున్న ఓ ప్రభుత్వ అధికారిణి అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఈ ఘటన తెలంగాణలోని జగిత్యాల జిల్లాలో చోటుచేసుకుంది. మెట్‌పల్లి చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ (సీడీపీవో)గా పనిచేస్తున్న దారోజు పద్మ, తన పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలపై నిరంతరం తనిఖీలు నిర్వహిస్తుంటారు. అయితే, ఈ తనిఖీల్లో ప్రతికూల నివేదికలు ఇవ్వకుండా ఉండేందుకు గాను, ఆమె పరిధిలోని 21 మంది అంగన్వాడీ సూపర్‌వైజర్ల నుంచి నెలవారీ మామూళ్లు డిమాండ్ చేశారు. దీని ప్రకారం, ఒక్కో సూపర్‌వైజర్ నెలకు రూ. 1000 చొప్పున ఆమెకు లంచంగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో, మూడు నెలలకు సంబంధించిన మొత్తాన్ని ఆమె ఏకమొత్తంగా వసూలు చేసేందుకు సిద్ధమయ్యారు. 21 మంది నుంచి రూ.63,000 లంచం తీసుకుంటుండగా, పక్కా సమాచారంతో ఏసీబీ అధికారులు వలపన్ని ఆమెను పట్టుకున్నారు. లంచం తీసుకుంటున్న సమయంలో పద్మను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు, ఆమెపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఒక ప్రభుత్వ అధికారిణి ఇలా నెలవారీ పద్ధతిలో లంచం వసూలు చేయడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు..

### ప్రభుత్వం కీలక ప్రకటన

మొదటిపేజీ తరువాయి.. కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులు నవంబర్ రెండో వారంలో ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. హైదరాబాద్‌లో ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పనుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. బ్యారేజీల పునరుద్ధరణకు సంబంధించిన డిజైన్లను అక్టోబర్ 5న కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) సాంకేతిక పర్యవేక్షణ కమిటీకి సమర్పించనున్నట్లు మంత్రి తెలిపారు. కేంద్రం నుంచి అవసరమైన సాంకేతిక అనుమతులు లభించిన వెంటనే పనులు మొదలుపెడతామని స్పష్టం చేశారు. 2027 వర్షాకాలం నాటికి ఈ మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. బ్యారేజీల భద్రత, నాణ్యత విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) సహా నిపుణుల కమిటీలు లేవనెత్తిన అభ్యంతరాలను, సూచనలను పరిగణనలోకి తీసుకున్నామని, జాతీయ స్థాయి సాంకేతిక సంస్థల సిఫార్సుల మేరకే పనులు చేపడతామని వెల్లడించారు. ఈ మూడు బ్యారేజీల భద్రతను పటిష్ఠం చేసి, వాటి పూర్తి సామర్థ్యాన్ని పునరుద్ధరించడమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని ఆయన ఈ సమావేశంలో నొక్కిచెప్పారు.

# బ్యాంక్ ఖాతాదారులకు అలర్ట్.. 3 రోజులు సమ్మె..

మొదటిపేజీ తరువాయి..
దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగ సంఘాలు సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల సమ్మెకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) ఆధ్వర్యంలో ఈ సమ్మె జరగనుంది. దీంతో పలు ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో (ఆర్ఆర్‌బీలు) బ్రాంచ్ సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉంది. సమ్మెకు ముందు వారాంతపు సెలవులు ఉండటంతో వరుసగా ఐదు రోజుల పాటు బ్యాంకు శాఖల సేవలు ప్రభావితమయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఖాతాదారులు ముఖ్యమైన నగదు లావాదేవీలు, చెక్కులు, ఇతర బ్రాంచ్ పనులను ముందుగానే పూర్తి చేసుకోవాలని బ్యాంకులు సూచిస్తున్నాయి. ఖాతాదారులకు ఇబ్బందులు తగ్గించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ 27న ఆదివారం అయినప్పటికీ ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు సాధారణంగా పనిచేయనున్నాయి. అన్ని బ్యాంకు శాఖలు, కార్యాలయాలు, ఏటీఎం-లింక్ శాఖలు పనిచేసేందుకు ఆర్బీఐ అనుమతి ఇచ్చింది. సమ్మె సమయంలో బ్రాంచ్ సేవలకు అంతరాయం వచ్చినా డిజిటల్ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవచ్చు. ఎస్బీఐ సహా పలు బ్యాంకులు ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ, ఏటీఎంలు, క్యాష్ డిపాజిట్ మెషీన్లను ఉపయోగించుకోవాలని ఖాతాదారులను కోరాయి. వారానికి ఐదు రోజుల బ్యాంకింగ్ విధానాన్ని అమలు చేయడంతో పాటు ఉద్యోగులకు సంబంధించిన ఇతర అంశాలపై యూనియన్లు డిమాండ్లు చేస్తున్నాయి. ప్రభుత్వం సమ్మెను విరమించాలని కోరుతూ చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేసింది. అయితే సెప్టెంబర్ 28-30 సమ్మెకు యూనియన్లు ముందుకు సాగుతున్నట్లు తాజా సమాచారం.

# ఎన్నికల కమిషనర్ల మధ్య విభేదాలంటూ ప్రచారం..

### - ప్రెస్ నోట్, గ్రూప్ ఫొటోతో చెక్ పెట్టిన ఈసీ

మొదటిపేజీ తరువాయి..
భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)లో కమిషనర్ల మధ్య తీవ్ర విభేదాలు తలెత్తాయంటూ గత కొద్ది రోజులుగా వస్తున్న వార్తలను కమిషన్ తీవ్రంగా ఖండించింది. ఈ ఆరోపణలకు తెరదించుతూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి శనివారం న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో సమావేశమయ్యారు. అనంతరం ముగ్గురూ కలిసి ఉన్న గ్రూప్ ఫొటోతో పాటు ఒక సుదీర్ఘమైన ప్రెస్ నోట్‌ను విడుదల చేశారు. కమిషన్ అంతర్గత పనితీరు, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (SIR), ఓటర్ల నమోదు ప్రక్రియ, సాంకేతిక వ్యవస్థలపై వస్తున్న ఆరోపణలపై ఇందులో సమగ్రంగా వివరణ ఇచ్చారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సంబంధించిన పలు నిర్ణయాలపై కమిషనర్లు సంధు, జోషి అభ్యంతరాలు వ్యక్తం చేశారని సెప్టెంబర్ 23న ఓ ఆంగ్ల పత్రికలో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ కథనం దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపింది. ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘం పనితీరుపై సందేహాలు వ్యక్తం చేస్తూ, మరింత పారదర్శకత అవసరమని డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలోనే పూర్తిస్థాయి కమిషన్ సంయుక్తంగా స్పందించింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కోసం 2025 జూన్ 24న జారీ చేసిన ఆదేశాలను ముగ్గురు కమిషనర్లు ఏకగ్రీవంగా ఆమోదించారని ఈసీ తన ప్రకటనలో స్పష్టం చేసింది. ఆ తర్వాత ఈ కార్యక్రమానికి సంబంధించిన షెడ్యూళ్లను కూడా ఏకాభిప్రాయంతోనే విడుదల చేశామని తెలిపింది. ఈ ప్రత్యేక సవరణ ఆదేశాలను సుప్రీంకోర్టు సైతం సమర్థించిందని గుర్తుచేసింది. కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫారం-6లో, దరఖాస్తుదారులు తమ తల్లిదండ్రుల పేర్ల ద్వారా గత సవరణతో తమ సంబంధాన్ని ధ్రువీకరించాలనే నిబంధనపై వస్తున్న విమర్శలపైనా కమిషన్ స్పందించింది. ఈ డిక్లరేషన్‌ను కూడా సుప్రీంకోర్టు సమర్థించిందని తెలిపింది. అయితే, ఈ నిబంధన కేవలం ప్రత్యేక సవరణ ప్రక్రియకు మాత్రమే వర్తిస్తుందని, మిగతా సమయాల్లో ఎలక్టర్ల నమోదు నిబంధనలు, 1960 ప్రకారం నిర్దేశించిన ఫారాలనే వాడతామని స్పష్టం చేసింది. గోవాలో 97 మంది ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోవడంపై కూడా ఈసీ వివరణ ఇచ్చింది. ఇంటింటి సర్వే నిర్వహించి, అవసరమైన ఫారాలను సేకరించాలని గోవా చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ సంబంధిత బూత్ లెవల్ అధికారులను ఆదేశించారని పేర్కొంది. ఇప్పటికే ఆ 97 మంది లో 81 మంది తమ పేర్లను చేర్చాలని కోరుతూ ఫారం-6 సమర్పించారని వెల్లడించింది. ఇక, ఎలక్టోరల్ రోల్ డేటాబేస్‌కు యాక్సెస్ విషయంలో ECINET పోర్టల్‌పై తలెత్తిన ఆందోళనలపైనా కమిషన్ స్పందించింది. క్షేత్రస్థాయి అధికారులకు వారి చట్టబద్ధమైన అధికారాలకు అనుగుణంగానే 'రోల్-బేస్డ్ యాక్సెస్' ఇస్తామని స్పష్టం చేసింది. ఈ పోర్టల్ పనితీరును సమీక్షించేందుకు ఓ సీనియర్ డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు, ఇందులో ఐఐటీ లేదా ట్రిపుల్ ఐటీకి చెందిన స్వతంత్ర నిపుణుడు కూడా ఉంటారని ప్రకటించింది. క్యాబినెట్ సెక్రటరీకి పంపిన లేఖ ఈసీ విధానపరమైన అంశాలకు సంబంధించింది కాదని, డిప్యుటేషన్‌పై ఉన్న ఓ అధికారి పని పునఃపంపిణీకి మాత్రమే సంబంధించిందని కమిషన్ స్పష్టం చేసింది. అంతర్గత పనివిధానాలను మరింత బలోపేతం చేసేందుకు పలు చర్యలు తీసుకుంటున్నట్లు ఈసీ ప్రకటించింది. ఇకపై కమిషన్ సమావేశాల అజెండాలను సభ్యులకు ముందుగానే సర్క్యులేట్ చేయాలని, సమావేశం అనంతరం మినిట్స్ జారీ చేయాలని నిర్ణయించింది.

## నకిలీ ఆధార్‌లకు చెక్.. డూప్లికేట్ ఆధార్ల భరతం పట్టేందుకు దేశీయ టెక్నాలజీ

మొదటిపేజీ తరువాయి.. దేశంలో ఆధార్ వ్యవస్థను మరింత పటిష్ఠం చేసే దిశగా భారత పరిశోధకులు కీలక ముందడుగు వేశారు. నకిలీ ఆధార్ కార్డులను అత్యంత కచ్చితత్వంతో గుర్తించేందుకు 'భారత్ ఏబీఐఎస్' (Bharat ABIS) అనే సరికొత్త ఓపెన్ సోర్స్ బయోమెట్రిక్ వ్యవస్థను అభివృద్ధి చేశారు. యూఐడీఏఐతో సంబంధం ఉన్న పరిశోధకులు, ఐఐటీ హైదరాబాద్, మిచిగాన్ స్టేట్ యూనివర్సిటీ నిపుణుల బృందం సంయుక్తంగా ఈ టెక్నాలజీని రూపొందించింది. ఇది దేశవ్యాప్తంగా ఆధార్ డేటాబేస్‌లో డూప్లికేట్ ఎంట్రీలను ఏరివేయడంలో కీలకంగా మారనుంది. 'భారత్ ఏబీఐఎస్' అనేది వేలిముద్రలు, కనుపాప (ఐరిస్), ముఖ కవళికలను కలిపి బయోమెట్రిక్స్‌ను విశ్లేషించే ఒక మల్టీ-మోడల్ వ్యవస్థ. ఈ మూడు డేటాలను కలిపి ప్రతి వ్యక్తికి కేవలం 13.5 KB పరిమాణంలో ఒక టెంప్లేట్‌ను ఇది సృష్టిస్తుంది. దేశంలోని మొత్తం 155 కోట్ల ఆధార్ ఎంట్రీల నుంచి నమూనాగా సేకరించిన 22 కోట్ల డీ-ఐడెంటిఫైడ్ రికార్డులపై ఈ వ్యవస్థను పరీక్షించారు. ముఖ్యంగా 2 కోట్ల రికార్డుల సబ్‌సెట్‌పై జరిపిన పరీక్షల్లో ఇది అద్భుతమైన ఫలితాలను కనబరిచింది. తప్పుడు గుర్తింపుల రేటు (ఎఫ్‌పీఐఆర్) కేవలం 0.1 శాతంగా, అసలైన వాటిని గుర్తించడంలో వైఫల్యం రేటు (ఎఫ్ఎన్ఐఆర్) 0.05 శాతంగా నమోదైంది. ఈ ఫలితాలు యూఐడీఏఐ నిర్దేశించిన 0.5% ఎఫ్‌పీఐఆర్, 0.1% ఎఫ్ఎన్ఐఆర్ లక్ష్యాల కన్నా చాలా మెరుగ్గా ఉండటం గమనార్హం. ఎఫ్‌పీఐఆర్, ఈ వ్యవస్థ రూపకల్పనలో ఓపెన్ సోర్స్ భాగాలను వినియోగించడం వల్ల ఖర్చు గణనీయంగా తగ్గుతుంది. డేటా ప్రాసెసింగ్, నాణ్యత అంచనా, ఫేక్ బయోమెట్రిక్స్‌ను గుర్తించడం వంటి పనుల కోసం ఓపెన్ సోర్స్ టూల్స్‌నే వాడారు. భారీ డేటాబేస్‌లో శోధన ప్రక్రియ వేగంగా జరిగేందుకు సర్వర్లపై పనిభారాన్ని సమానంగా పంపిణీ చేసే ఒక ప్రత్యేక షెడ్యూలర్‌ను కూడా ఇందులో పొందుపరిచారు. వాణిజ్యపరంగా అందుబాటులో ఉన్న మూడు ప్రముఖ వ్యవస్థలతో పోల్చినప్పుడు 'భారత్ ఏబీఐఎస్' వాటికి సమానమైన లేదా అంతకంటే మెరుగైన కచ్చితత్వాన్ని చూపించింది. 8 ఎన్విడియా H100 జీపీయూలు, 2 టీబీ ర్యామ్‌తో కూడిన ఒక్క సర్వర్‌పై 4 కోట్ల రికార్డుల గ్యాలరీలో సెకనుకు 100 శోధనలు చేయగల సామర్థ్యం దీనికి ఉంది. దేశంలో డూప్లికేట్ ఆధార్ కార్డులు ఇప్పటికీ ఒక సవాలుగానే ఉన్నాయి. 2022లో ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ దాదాపు 6 లక్షల నకిలీ ఆధార్ కార్డులను గుర్తించి రద్దు చేసినట్లు వెల్లడించింది. ఈ నేపథ్యంలో 'భారత్ ఏబీఐఎస్' ప్రాధాన్యం సంతరించుకుంది. ఇందులోని 'డీప్‌ప్రింట్' ఫింగర్‌ప్రింట్ మోడల్.. వృద్ధులు, చేతివేలిముద్రలు అరిగిపోయిన శ్రామికుల బయోమెట్రిక్ ప్రామాణీకరణ వైఫల్యాలను సగానికి తగ్గించగలదని పరిశోధకులు తెలిపారు. అయితే, ఈ వ్యవస్థ అద్భుతమైన సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్నప్పటికీ, దేశంలోని పూర్తి ఆధార్ డేటాబేస్‌పై దీనిని ప్రయోగించడానికి ముందు మరిన్ని విస్తృత స్థాయి పరీక్షలు అవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో 2 కోట్ల లోపు జనాభా ఉన్న దేశాలకు ఇది తక్కువ ఖర్చుతో కూడిన సమర్థవంతమైన ప్రత్యామ్నాయంగా ఉపయోగపడగలదని వారు పేర్కొన్నారు.

## బాలాపూర్ రికార్డు బద్దలు

### దిల్‌సుఖ్‌నగర్ గణేశుడి లడ్డూకు రూ.51 లక్షలు..!

మొదటిపేజీ తరువాయి.. భాగ్యనగరంలో గణేశ్ నిమజ్జనోత్సవాల వేళ లడ్డూ వేలం పాటలు ఆసక్తికరంగా మారాయి. ఈ ఏడాది బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలం రికార్డును దిల్‌సుఖ్‌నగర్ లడ్డూ అధిగమించింది. అక్కడ నిర్వహించిన వేలంలో గణేశుడి ప్రధాన లడ్డూ ఏకంగా రూ.51 లక్షలకు అమ్ముడైంది. దిల్‌సుఖ్‌నగర్‌లోని జై గణేశ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుమారు 2.5 కోట్ల మిర్రర్ గ్లాస్‌లతో ప్రత్యేకంగా అలంకరించిన గణేశుడి మండపంలో శనివారం లడ్డూ వేలం నిర్వహించారు. భక్తులు పోటాపోటీగా వేలంలో పాల్గొన్నారు. చివరకు స్థానిక భక్తుడు రాజేష్ రూ.51 లక్షలు వెచ్చించి ప్రధాన లడ్డూను సొంతం చేసుకున్నారు. దీంతో ఈ ఏడాది బాలాపూర్ గణేశుడి లడ్డూ వేలంలో నమోదైన రూ.39 లక్షల ధరను దిల్‌సుఖ్‌నగర్ లడ్డూ దాటింది. ఇదే మండపంలో మరో లడ్డూకు కూడా భారీ ధర పలికింది. మరో భక్తుడు రూ.25 లక్షలకు దక్కించుకున్నారు. గణేశుడి లడ్డూ ప్రసాదాన్ని ఇంటికి తీసుకెళితే శుభం కలుగుతుందని, వ్యాపారంలో అభివృద్ధి ఉంటుందని భక్తుల్లో విశ్వాసం ఉంది. ఈ నమ్మకంతోనే వేలంలో భక్తులు పెద్ద మొత్తంలో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## గణేశ్ నిమజ్జనం సక్సెస్..

### పోలీసులతో కలిసి డ్యాన్స్ చేసిన సీపీ సజ్జనార్

మొదటిపేజీ తరువాయి.. హైదరాబాద్ నగరంలో గణేశ్ నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తును విజయవంతంగా నిర్వహించడంతో పోలీసు యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. ఈ సందర్భంగా హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తన సిబ్బందితో కలిసి సంబరాలు జరుపుకున్నారు. నిమజ్జన ప్రక్రియ ముగిసిన అనంతరం, తెలంగాణ తల్లి ఫ్లైఓవర్ కింద పోలీసు సిబ్బందితో కలిసి సీపీ సజ్జనార్ నృత్యం చేశారు. 'ది ప్యారడైజ్' చిత్రంలోని 'ఆయా షేర్' పాటకు ఆయన చిందులేశారు. గత కొన్ని రోజులుగా విధుల్లో నిమగ్నమై అప్రమత్తంగా ఉన్న పోలీసులు, నిమజ్జనం ప్రశాంతంగా పూర్తి కావడంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఉన్నతాధికారి స్వయంగా వారితో కలవడంతో సిబ్బందిలో ఉత్సాహం రెట్టింపైంది. మరోవైపు, నగరంలో నిమజ్జన క్రతువు ముగియడంతో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలను ఎత్తివేశారు. సచివాలయం పరిసర ప్రాంతాలైన ట్యాంక్‌బండ్, లిబర్టీ, అసెంబ్లీ మార్గాల్లో వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. దీంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సాధారణ స్థితికి చేరుకుంది.

# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

**షాబాద్, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలను గ్రామపంచాయతీ ఆవరణలో రజక సంఘం అధ్యక్షుడు గడ్డం చంద్రయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా గడ్డం చంద్రయ్య మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ చేసిన పోరాటం, ధైర్యసాహసాలు చిరస్మరణీయమని అన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఐలమ్మ ఆశయాలను కొనసాగిస్తూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుండాల అశోక్, ఉప సర్పంచ్ దండు రాహుల్ గుప్తా, జడల రాజేందర్ గౌడ్, గంధం శ్రీనివాస్ ,గడ్డం



రమేష్, రజక సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ధర్పల్లిలో ఘనంగా గణపతి నిమర్జనోత్సవం.. వైభవంగా శోభాయాత్ర!



**నిజామాబాద్ రూరల్ ధర్పల్లి, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** ధర్పల్లి మండల కేంద్రంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకోవడంతో గణపతి నిమర్జనోత్సవాన్ని ప్రజలు, భక్తులు ఎంతో ఉత్సాహంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ మండపాల్లో కొలువుదీరిన భారీ వినాయక విగ్రహాలను ప్రధాన వీధుల గుండా ఊరేగిస్తూ శోభాయాత్రను వైభవంగా కొనసాగించారు. ఈ శోభాయాత్రలో భారీ వినాయక విగ్రహాలు, రంగురంగుల అలంకరణలు, డప్పు వాయిద్యాలు, భక్తుల జయజయధ్వనుల నడుమ కోలాహలంగా సాగింది. విగ్రహాల ఊరేగింపు వాహనాల వెనుక పెద్ద సంఖ్యలో భక్తులు, యువకులు, మహిళలు, పిల్లలు పాల్గొన్నారు. యువకులు డి జె పాటలకు డాన్సులతో ఉత్సాహంగ పాల్గొన్నారు నిమర్జన శోభాయాత్ర ప్రశాంతంగా, సురక్షితంగా సాగేందుకు పోలీసులు తగిన బందోబస్తు చర్యలు చేపట్టారు. ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా, భక్తులకు ఇబ్బందులు లేకుండా భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రజలందరూ సమన్వయంతో, ఆధ్యాత్మిక వాతావరణంలో శోభాయాత్రను విజయవంతం చేసినందుకు ఉత్సవ నిర్వాహకులు మరియు అధికారులు అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.



# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరాలకు ఆదర్శం

- **సామాజిక న్యాయం కోసం ఆమె చేసిన పోరాటం చిరస్మరణీయం : బండి రమేష్**

**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతిని పురస్కరించుకుని కూకట్‌పల్లి రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు.తూర్పు కమాన్ వద్ద ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె ప్రదర్శించిన ధైర్యసాహసాలు, పోరాట స్ఫూర్తి నేటి తరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా



తీసుకుని సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, గుడెపు నాగరాజు, కూకట్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు కావేటి నాగార్జున, రంగమోహన్, మేకల మహేష్, రమణ, కూకట్‌పల్లి రజక సంఘం అధ్యక్షుడు బాలరాజు, రజక సంఘం



నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

# తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలు

- **ఆమె పోరాట పటిమ నేటి తరానికి స్ఫూర్తిదాయకం**

**నిజామాబాద్ రూరల్ సిరికొండ, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, ఆత్మగౌరవ ప్రతీక వీరనారి చాకలి ఐలమ్మ (చిట్యాల ఐలమ్మ) 131వ జయంతి వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా సిరికొండ మండలం తాళ్ల రామడుగు, మరియు చిన్న వాల్గొట్ గ్రామాల్లో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లా రజక ఐక్య వేదిక ఉపాధ్యక్షులు అల్వాల దేవయ్య మాట్లాడుతూ "భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం" సాగిన ఉద్యమంలో దొరల ఆధిపత్యాన్ని, గడీల అరాచకాలను ఎదిరించి నిలిచిన ధీరోదాత్త మహిళ చాకలి ఐలమ్మ. 1895 సెప్టెంబర్ 26న జన్మించిన ఐలమ్మ, నాటి భూస్వామ్య విధానాలకు వ్యతిరేకంగా రోకలిబండ చేతబూని తన హక్కుల కోసం పోరాడి విజయం సాధించారు. కేవలం ఆయుధంతోనే కాకుండా, ఆ రోజుల్లోనే న్యాయస్థానాల ద్వారా చట్టపరమైన



పోరాటం చేసి తన భూమిని కాపాడుకున్న ప్రజాస్వామికవాది ఆమె. ఐలమ్మ చూపిన ధైర్యం, సాహసం, త్యాగాలు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో నిప్పురవ్వలా పనిచేసి, లక్షలాది మందిలో చైతన్యాన్ని రగిలించాయి. సబ్బండ వర్గాల ఆత్మగౌరవానికి సజీవ సాక్ష్యంగా నిలిచిన ఐలమ్మ స్మృత్యర్థం తెలంగాణ ప్రభుత్వం ఆమె జయంతిని అధికారికంగా నిర్వహిస్తోంది.ఈ సందర్భంగా పలువురు నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు చాకలి ఐలమ్మ నిలువెత్తు విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె చూపిన పోరాట బాటలో నడుస్తూ, మహిళల సాధికారతకు మరియు వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపుని



చ్చారు.ఈ కార్యక్రమం తాళ్ల రామడుగు లో నాయకులు నక్క రాజేశ్వర్, కుందేళ్ల శ్రీనివాస్,బకారం రవి,బకారం సంతోష్,కుమ్మరి నర్సయ్య,రేకులపల్లి గంగాధర్,బూరుగుపల్లి రాజయ్య, తొవిటి ఆనంద్,అసుభ గంగాధర్, ఆరిఫ్,చిన్న వాలాట్ లో పాల్గొన్నవారు సర్పంచ్ దడివే గణేష్, రజక ఐక్య వేదిక జిల్లా యువజన కమిటీ ప్రధాన కార్యదర్శి బండి నరేష్ ,గ్రామ రజక సంఘం అధ్యక్షులు గట్టు కింది రవి,సి హెచ్ రమణ, బి. అంజయ్య,రాము , చిన్న గంగాధర్ , శ్రీకాంత్,నితిన్ ,సాయి,కల్యాణ్ రవి, కరోబార్ సాయి,రమణ సార్, మహిపాల్,బుచన్న, రమేష్, గంగాధర్, గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

# ఘనంగా సాయుధ పోరాటం వీర వనిత ఐలమ్మ జయంతి

- **యాచారం మండలం రజక సంఘం**



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** యాచారం మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ131వ జయంతి సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి యాచారం గ్రామం రజక నాయకులు ఘన నివాళులు అర్పించడం జరిగింది.రజాకార్లు,విసునూరు దేశ్‌ముఖ్ లాంటి భూస్వాముల దౌర్జన్యాలను,వెట్టిచాకిరిని ఎదిరించి నిలిచిన ధైర్యశాలి. తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా ఆమెను కొనియాడుతారు.ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మస్కు అనిత శరణం వార్డు సభ్యులు పాష, వెంకట్ రెడ్డి,సిపిఎం గ్రామ కార్యదర్శి తెల్గమల్ల యాదగిరిరజక నాయకులు దశరథ, భీముడు,యాదయ్య, అబ్బయ్య,లింగం తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో గణనాధునికి పూజలు

- **వక్తలు ఆర్ వాయిస్ జర్నలిస్ట్ నవిత ,బుస్సు శ్రీకాంత్ రెడ్డి.**

**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** ఇబ్రహీంపట్నం మండల పరిధి లోని ఎలిమినేడు గ్రామంలో శంబాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాధునికి శనివారం వక్తలు ఆర్ వాయిస్ జర్నలిస్ట్ నవిత ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భక్తిశ్రద్ధలతో గణనాధునికి పూజలు ఆట పాటలు కోలాటలు ఆడుతూ భజన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా వర్షాలు బాగా పడి పంటలు బాగా పండాలని ప్రజలంతా సుఖ శాంతులతో ఉండాలని అన్నారు. అలాగే శివాజీ మహారాజ్ శంభాజీ మహారాజ్ జీవిత చరిత్ర వారి ధైర్యసహసాలు ప్రజా సంక్షణం కోసం చేసిన కృషి గురించి వివరించడం జరిగింది.అలాగే హిందూ ధర్మం మన సంప్రదాయాలు సంస్కృతి ఆచారాల ప్రాముఖ్యతను వివరంగా తెలియజేయడం జరిగింది.మన చరిత్రను సాంస్కృతిని సంప్రదాయాలను తెలుసుకొని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు గ్రామస్తులు యువకులు తదితరులు పాల్గొన్నారు.





# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శనీయం : ఎంపీడీవో సంకీర్త్

**పినపాక, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** తెలంగాణ సాయుధ పోరాట వీరవనిత, బహుజనుల ఆత్మగౌరవ ప్రతీక చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను పినపాక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఐలమ్మ చిత్రపటానికి ఎంపీడీవో సంకీర్త్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం చాకలి ఐలమ్మ ధైర్యంగా పోరాడారని కొనియాడారు. నాటి దొరల అణచివేతకు ఎదురొడ్డి హక్కుల కోసం ఆమె చేసిన పోరాటం నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. అన్యాయాన్ని ఎదిరించడంలో మహిళా శక్తిని చాటిచెప్పిన మహనీయురాలు ఐలమ్మ అని, ఆమె పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొని ఐలమ్మ సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించారు.



## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

## జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ



**వికారాబాద్, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** వికారాబాద్: వీరనారి చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారి శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ధైర్యసాహసాలు, పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని అన్నారు. అణగారిన వర్గాల హక్కులు, సామాజిక న్యాయం కోసం ఆమె చేసిన పోరాటం భావితరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుటూరు, బీసీ సంక్షేమ అధికారి మాధవ రెడ్డి, విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని, జిల్లా పౌర సంబంధాల అధికారి చెన్నమ్మ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ..

## మొక్కలు నాటిన విద్యార్థులు



**కేశంపేట, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** కేశంపేట మండలంలోని నిర్దవెల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం యూనిఫాంలను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్ పాలకవర్గ సభ్యులతో కలిసి విద్యార్థులకు యూనిఫాంలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. పాఠశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా సదుపాయాలను సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పచ్చదనం పెంపొందించేందుకు అందరూ కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ సపురా అమీర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ రెడ్డి, వార్డు సభ్యులు చంద్రయ్య, చెన్నయ్య, రమేష్ నాయక్, రిజ్వాన బేగం, మోహిజ్, వెంకటమ్మ, మల్లయ్య, నాయకులు ముత్యాలు, ఖాజాపాషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మకు ఘన నివాళి..

## నిర్దవెల్లిలో ఘనంగా విగ్రహావిష్కరణ



**కేశంపేట, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** కేశంపేట మండలంలోని నిర్దవెల్లి గ్రామంలో వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని ఆమె విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.చాకలి ఐలమ్మ భూమి, భుక్తి, ఆత్మగౌరవం కోసం సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె ధైర్యంగా నిలబడి పోరాటం చేసిన తీరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. మహిళా ధైర్యానికి, సామాజిక న్యాయానికి చాకలి ఐలమ్మ ప్రతీకగా నిలిచారని కొనియాడారు.విగ్రహావిష్కరణ అనంతరం రజక సంఘం నాయకులు, గ్రామ పెద్దలు, సర్పంచ్, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఐలమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు.తమ గ్రామంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆవిష్కరించడం పట్ల రజక సంఘం నాయకులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు చాకలి జంగయ్య, రాజు, శ్రీను, అనిల్, రాంబాల నాయక్, శంకర్ నాయక్, చందు నాయక్, హనుమంతు నాయక్, తోట వెంకటేష్, బండ నిరంజన్, రంగయ్య, ఉమాపతి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిదాయకం

- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి
- తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వీరనారి చాకలి ఐలమ్మ పోరాటం గొప్పది







**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :**
శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వీరనారి చాకలి ఐలమ్మ 131వ జయంతి కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై, ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఆమె పోరాట స్ఫూర్తితోనే తెలంగాణ సాయుధ రైతాంగ ఉద్యమం బలోపేతమైందని, తద్వారా లక్షలాది ఎకరాల భూమి పేద ప్రజలకు పంపిణీ అయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ వంటి మహనీయుల సేవలు, త్యాగాలను స్మరించుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తోందన్నారు.కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ ఫ్రంట్ చైర్మన్ జి. మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ.. 1895లో జన్మించి 1985లో మరణించిన వీరనారి చాకలి ఐలమ్మ తన జీవితంలో అనేక కష్టాలను, అణచివేతలను ఎదుర్కొని ప్రజల కోసం పోరాడారని తెలిపారు. పాలకుర్తి ప్రాంతంలో కౌలుకు భూమి తీసుకుని వ్యవసాయం చేస్తూ, తన పంటను దోపిడీ చేసేందుకు ప్రయత్నించిన దొరల ఎదుట ధైర్యంగా నిలబడి తన హక్కుల కోసం పోరాడిన వీరవనితగా ఐలమ్మ చరిత్రలో నిలిచిపోయారని అన్నారు.చాకలి ఐలమ్మ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు మాత్రమే కాకుండా, నేటి తరానికి దిక్సూచిగా నిలిచిన స్ఫూర్తిదాత అని మల్లేష్ యాదవ్ కొనియాడారు. ఆమె పోరాట స్ఫూర్తితో యువత తప్పుడు మార్గాలకు దూరంగా ఉండి, సామాజిక చైతన్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గ్రామ గ్రామాన ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహిస్తూ సామాజిక అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి శివ ఆశిష్ సింగ్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కేసు రామ్, రజక సంఘం నాయకులు అజయ్, దశరథ్, శ్రీరాములు, వడ్డెర సంఘం నాయకులు వరికుప్పల సుధాకర్, బీసీ వెల్ఫేర్ హాస్టల్ వేల్ఫేర్ అధికారులు,బీసీ సంక్షేమ సంఘం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బండ ఆంజనేయులు, బీసీ సంఘం నాయకులు అచ్చన నరసింహ, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

# పోటీ పరీక్షలు విద్యార్థుల ప్రతిభా సామర్థ్యాలను వెలికితీస్తాయి

- గణితంపై ఆసక్తిని పెంపొందించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



**నిజామాబాద్ రూరల్ సిరికొండ , సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :**
విద్యార్థులకు ఒలింపియాడ్ వంటి పోటీ పరీక్షలు ప్రతిభా సామర్థ్యలను వెలికితీస్తాయని విద్యార్థులు పాఠశాల స్థాయిలో విషయ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సిరికొండ మండల విద్యాధికారి పి. రాములు సూచించారు. శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ (ఎస్ ఆర్ ఎఫ్) రాష్ట్ర స్థాయి గణిత ఒలింపియాడ్ లో ప్రతిభ కనబరిచిన సత్యశోధక్ విద్యార్థులకు శనివారం సత్యశోధక్ పాఠశాలలో 6వ తరగతి విద్యార్థులు జి. యశస్వి, బి. భవ్యశ్రీ, యన్. లక్షణ, జి. సుచరిత, టి. రిశ్విక్, టి. భగత్, బి. కరుణాకర్, 5వ తరగతి విద్యార్థులు ఏ. ఆశ్రీత, ఏ. నిత్యశ్రీ, యన్. అనన్య, సి. హెచ్. అభిలాష, జి. చిన్మయి, డి. ఆధ్య, బి. మనోజ్, 4వ తరగతి విద్యార్థులు వై. ప్రజ్వల్,యన్. విష్ణు లకు ప్రత్యక జ్ఞాపికలని అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా విద్యాధికారి పి. రాములు మాట్లాడుతూ తార్కిక ఆలోచన, సమస్య పరిష్కార నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో మరిన్ని విజయాలను సొంతం చేసుకోవాలని ఆకాంక్షించారు. పోటీ పరీక్షల్లో పాల్గొనడం విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచడంతో పాటు తమ ప్రతిభను వెలికితీయడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లను ఇళ్లను ఇవ్వాలి

- డి. జగదీష్ తులేకాలన్ గ్రామ ఉపసర్పంచ్





**ఇబ్రహింపట్నం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :**
ఇబ్రహీంపట్నం మండలం తులేకాలన్ అర్హులైన పేదలకు రెండో విడతలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి,రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈరోజు తులేకాలన్ గ్రామ పంచాయితీ పాలకవర్గం ఆధ్వర్యంలో గ్రామంలో అనేకమంది పేద, నిరుపేద కుటుంబాలు సొంత ఇల్లు లేక ఇబ్బందులుఎదుర్కొంటున్నారు. కాబట్టి ప్రభుత్వం వెంటనే ఇందిరమ్మ ఇళ్ల పథకం రెండో విడతలో అర్హులైన పేద కుటుంబాలను గుర్తించి,సర్వే చేసి వారికి ఇళ్లను మంజూరు చేయాల్సిన అవసరం ఉందన్నారు. L3 ఉన్న అర్హులైన పేదలను L1 లో చేర్చి ఇందిరమ్మ వారికి మంజూరు చేయాలనీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డిని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డిని కలిసి అర్హులైనటువంటి నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ళను వెంటనే ఇవ్వాలని చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో తులకలను గ్రామపంచాయతీ పాలకవర్గం సభ్యులు బోడ స్కైలాబ్, సుర్వి జనార్ధన్ గౌడ్, హనుమండ్ల ఆంజనేయులు,గజ్జల మహేష్, గ్రామస్తులు సామ రవీందర్ రెడ్డి,బోడ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# కానిస్టేబుల్‌పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

- **కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య**




**వికారాబాద్ , సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** వికారాబాద్: పరిగి పట్టణంలో వినాయక నిమజ్జనం సందర్భంగా విధి నిర్వహణలో ఉన్న పోలీసు కానిస్టేబుల్ నర్సింలుపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య డిమాండ్ చేశారు. ఈ ఘటనను ఖండిస్తూ కేవీపీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రకటన విడుదల చేశారు.వినాయక నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా శాంతిభద్రతలను పర్యవేక్షిస్తూ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్‌పై తరుణ్‌తో పాటు మరికొందరు దాడి చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. ప్రజల భద్రత కోసం విధులు నిర్వహిస్తున్న పోలీసులపై దాడులు చేయడం చట్టాన్ని, శాంతిభద్రతలను సవాల్ చేయడమేనని పేర్కొన్నారు.దాడికి పాల్పడిన వారిని వెంటనే గుర్తించి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, గాయపడిన కానిస్టేబుల్ నర్సింలుకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు ఆయన కుటుంబానికి ప్రభుత్వం, పోలీసు శాఖ అండగా నిలవాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖ, జిల్లా యంత్రాంగాన్ని ఉప్పలి మల్కయ్య కోరారు.

# విద్యార్థులకు షీ టీమ్ అవగాహన సదస్సు

## -షీ టీం ఎస్ ఐ లావణ్య





**మంథని / పెద్దపల్లి, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** రామగుండం సి.పి అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు పెద్దపెల్లి షీ టీమ్ వారు స్థానిక క్రీసెంట్ హై స్కూల్ విద్యార్థులకు షీ టీమ్ అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. అందులో భాగంగా షీ టీమ్ ఇంచార్జి ఎస్ఐ లావణ్య మాట్లాడుతూ, గుడ్ టచ్ బాడ్ టచ్, గురించి విద్యార్థులు తెలియని వారి పట్ల ఎలా ఉండాలి, పోక్సో యాక్ట్ గురించి, సోషల్ మీడియా ప్రభావం పిల్లలపై ఎలా ఉంది, విద్యార్థుల ప్రవర్తన నియామవాలి గురించి తెలిపారు. మహిళల భద్రత ఆన్లైన్ మోసాలపై మరియు యాంటీ డ్రగ్స్ గురించి తెలిపారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్, ప్రధాన చౌరస్తాలో,జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిఘా ఉంటుందని , ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు , అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100/112 నంబర్ కు డయల్ చేయాలని, అలాగే ఆన్లైన్ మోసాలకు గురైతే 1930 కి ఫోన్ చేయాలనీ, మహిళలకు ప్రయాణ సమయం లో ట్రావెలింగ్ సేఫ్టీ అప్ టీ – సేఫ్ అప్ వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ విజయ్ , ఉపాధ్యాయులు, షీ టీమ్ సభ్యులు మౌనిక, స్నేహలత పాల్గొన్నారు.

# పెంటన్నగూడెం - బొమ్మరాజు పల్లి పోడు వివాదానికి చరమగీతం పాడేదెప్పుడు?

- **నాడు అరకు పట్టిన పాయం నేడు పోడు రైతులకు సాయం చేసేనా?**





**పినపాక్లి, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** రాజులు మారిన రాజ్యాలు మారనట్లుగా పెంటన్నగూడెం – బొమ్మరాజు పల్లి గ్రామాల పోడు వివాదాన్ని ఎవరు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవట్లేదు. ఎన్నికలు జరగటం ,ప్రభుత్వాలు మారటం ముఖ్యమంత్రులు పోడు భూములకు పట్టాలిస్తాము అధికారికంగా గుర్తిస్తామని వాగ్దానాలు చేస్తూ వారి అధికార దాహాన్ని తీర్చుకుంటున్నారు తప్ప రెండు గ్రామాల పోడు సమస్యలను గుర్తించట్లేదని పోడు రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 20 సంవత్సరాలుగా పెంటన్నగూడెం – బొమ్మరాజు పల్లి గ్రామాల మధ్య పోడు సమస్య అనేక ఉద్రిక్తతల, వివాదాల నడుమ అనేక సంవత్సరాలుగా పోడు రైతుల రక్తంతో నెత్తురోడుతున్న కూడా ప్రజాప్రతినిధులు, ప్రభుత్వం, అధికారులు స్పందించి సమస్యని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

**- ఎమ్మెల్యే పాయం నాడు అరకపట్టి దున్నిన భూమి :**

25 హెక్టార్ల భూమిని పోడు కొట్టుకున్న రైతులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటానని నేటి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆనాడున సిపిఐ పార్టీలో ఎమ్మెల్యేగా ఉండి రైతుల సమక్షంలో అరక పట్టి పోడు భూమిని దున్నడం జరిగింది. 20 సంవత్సరాలుగా వివాదాల నడుమ కొనసాగుతున్న ఈ పోడు భూమి సమస్య ఎమ్మెల్యే పాయం దృష్టిలో ఎప్పటినుంచో ఉంది. ప్రభుత్వం ద్వారా అధికారుల సహకారంతో రెండు గ్రామాల రైతుల పోడు సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

**– గిరిజనులకు వ్యతిరేకం కాదు: పెంటన్నగూడెం గ్రామస్తులు.**

రెండు గ్రామాల మధ్య నలుగుతున్న ఈ పోడు సమస్యను కులాల మధ్య చిచ్చుగా పరిగణించవద్దని... ఎట్టి పరిస్థితుల్లో గిరిజనులకు మేము వ్యతిరేకం కాదన్న పెంటన్నగూడెం గ్రామస్తుల వాదనను పరిగణలోకి తీసుకొని .. పోడు భూమిని చదును చేసుకున్న రైతుల వివరాలు ఆధారంగా గిరిజన రైతులకు, హరిజన రైతులకు ప్రభుత్వం పట్టాలు ఇప్పించి తమ జీవనాధారాన్ని దూరం చేయకుండా పోడు రైతుల సమస్యను తీర్చాలని రెండు గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.

**కార్పొరేషన్ డిపార్ట్ కేసులు... అధికారులకు విన్నపాలు...!**

కార్పొరేషన్ డిపార్ట్ కు సంబదించిన దమ్మక్కపేట బీట్ లో ఉన్న 25 హెక్టార్ల భూమిని పెంటన్నగూడెం –బొమ్మరాజు పల్లి గ్రామాల రైతులు పోడు భూమి నరికి,నాగల్లు దున్నడం, పోడు భూమిలో గుడిసెలు వేయటం అటవీ శాఖ అధికారులు కూలగొట్టడం జరిగింది. వ్యవసాయం చేసే పోడు రైతులకు అధికారుల తీరు సమస్యగా మారింది. ఎంతో కష్టపడి సాగు చేసుకుంటున్నా... పోడు భూమిపై కార్పొరేషన్ అధికారులు పలుమార్లు రైతులపై దాడి చేసి కేసులు పెట్టడం జరిగింది. పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగటం ఆ రెండు గ్రామ ప్రజలకు అలవాటుగా మారింది.పోడు సమస్య పరిష్కారం దిశగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి అధికారుల సహకారంతో పట్టాలి ఇప్పించాలని ముక్తకంఠంతో రెండు గ్రామ ప్రజల పోడు రైతులు వేడుకుంటున్నారు.

# రూ.20 లక్షలు దాటిన బడా గణేష్ లడ్డూ!

- **రూ.20,01,000కు డీఆర్‌కేవీ సిండికేట్ సొంతం**



**షాబాద్, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** షాబాద్ మండల కేంద్రంలో బడా గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో లడ్డూ వేలం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. బడా గణేష్ లడ్డూకు భారీ డిమాండ్ ఏర్పడగా, రూ.20,01,000 (ఇరవై లక్షల ఒక వెయ్యి రూపాయి)లకు డీఆర్‌కేవీ సిండికేట్ లడ్డూను సొంతం చేసుకుంది.లడ్డూ వేలంలో స్థానికులు, భక్తులు, వ్యాపారవేత్తలు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. భారీ ధరకు లడ్డూను దక్కించుకోవడంతో ఉత్సవ ప్రాంగణంలో సందడి నెలకొంది. లడ్డూను సొంతం చేసుకోవడం ఎంతో ఆనందంగా ఉందని డీఆర్‌కేవీ సిండికేట్ ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుండాల అశోక్, ఉప సర్పంచ్ దండు రాహుల్ గుప్త, గ్రామ పెద్దలు, యువత, బడా గణేష్ ఉత్సవ సమితి సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్ జి టి ఉపాధ్యాయ సమస్యలపై

## -జెడ్ పి హెచ్ ఎస్ శివరాంపల్లి కాంప్లెక్స్

- **ప్రధానోపాధ్యాయులు శ్రీను నాయక్ కి వినతిపత్రం**




**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** రాజేంద్రనగర్ పరిధిలోనిది ఎస్ జి టి ఉపాధ్యాయులు క్లాస్ రూమ్ లలో పాఠాలు చెప్పేకన్నా బోధనేతర పనులుఎక్కువగా వున్నాయి అవి తగ్గించాలి.ప్రతి క్లాస్ కు ఒక టీచర్ ను ఇవ్వాలి.ఎఫ్ ఎల్ ఎన్ వల్ల ఉపాధ్యాయులకు మానసికంగా వత్తిడి ఎక్కువ అయ్యింది. జీవో 25 ను సవరించాలి. ప్రతి ప్రాథమిక పాఠశాల కు ఒక పిఎస్ హెచ్ఎం పోస్ట్ ఇవ్వాలి.ఎస్ జి టి ఉపాధ్యాయులకు టీచర్ ఎమ్మెల్సీ ఎలక్షన్స్ లో ఓటు హక్కు ఇవ్వాలి. జేఏసీ చైర్మన్ మారం జగదీశ్ ఎస్ జి టిలపై చేసిన వాక్యలను మేము తీవ్రంగా కండిస్తున్నాం.వెంటనే అయన చేసిన వాక్యాలను వెనక్కి తీసుకోవాలి.తెలంగాణలో దాదాపు 41,000 ఎస్ జి టి లు పని చేస్తున్నారు. వారి మనోభావాలను దెబ్బతీసేవిదంగా మాట్లాడడం సబబు కాదు.మీరు మాట్లాడిన మాటలు వెనక్కి తీసుకోవాలి,వినతిపత్రం ఇచ్చిన వారిలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ( తపస్ ) రాజేంద్రనగర్ మండల అధ్యక్షులు బాలకృష్ణ మదగని, ఎస్ టి యు మండల అధ్యక్షులు కామిశెట్టి వెంకటయ్య, కాంప్లెక్స్ సెక్రటరీ ఎం.షాలిని, ఆర్ పి శ్రీనివాస్ రెడ్డి ఎస్ జి టి ఉపాధ్యాయులు తది తరులు పాల్గొన్నారు

# ఘనంగా నిమజ్జనోత్సవాలు



**షాబాద్, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** షాబాద్ మండల కేంద్రంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వివిధ ఆలయాల లడ్డూ వేలం కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేలంలో భక్తులు, గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొనడంతో ఆలయాల వద్ద సందడి నెలకొంది.శివాలయం లడ్డూ రూ.2,11,111కు జడల వీరస్వామి, చిన్న రామస్వామి సంయుక్తంగా దక్కించుకున్నారు. అలాగే కాళికాదేవి ఆలయ లడ్డూ రూ.2,51,111కు దర్పల్లి విట్టలయ్య, మాచమోని వెంకటయ్య సంయుక్తంగా సొంతం చేసుకున్నారు.రెండు ఆలయాల లడ్డూలు కలిపి రూ.4,62,222కు వేలం కావడం విశేషం. వేలంపాటను భక్తులు ఆసక్తిగా తిలకిస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. లడ్డూలను దక్కించుకున్న భక్తులను ఆలయ నిర్వాహకులు అభినందించారు, భక్తి శ్రద్ధలతో సాగిన శోభాయాత్ర అనంతరం గణేష్ నిమజ్జనం నిర్వహించారుఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత, ఉత్సవ సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇస్తాం.

- వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్.





**ఏన్కూర్, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** ఏన్కూరు మండల పరిధిలోని జన్నారం గ్రామంలో ఇంద్ర మిల్లు నిర్మించుకున్న లబ్ధిదారుల గృహప్రవేశ మహోత్సవానికి వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.వారికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేందుకు కృషి చేస్తానని , ఇందిరమ్మ ఇల్లు వస్తాయని ఎవరు అధైర్య పడవద్దు అని ఆయన హామీ ఇచ్చారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేయట మే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు . కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించారు. ఇంటి యజమాని కుమారుడు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వర్ణ నరేందర్, మేడ ధర్మారావు, నల్లమల శివకుమార్ ఓబీసీ మండల అధ్యక్షుడు మొగిలి నాగరాజు,కొప్పుల ప్రభావతి రెడ్డి ,పంతగాని నరేష్, స్వర్ణ కృష్ణయ్య, స్వర్ణ శ్రీనివాసరావు గుత్తా నాగేశ్వర రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వయోవృద్ధులకు మెరుగైన సేవలు అందించాలి



**శామీర్‌పేట, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** అంత ర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం–2026లో భాగంగా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఆధ్వర్యంలో శామీర్‌పేట ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోని సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్‌లో శనివారం 'వృద్ధాప్యంలో సామర్థ్య నిర్మాణం' కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్య క్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయోవృద్ధులకు 'వృద్ధాప్యంలో సామర్థ్య నిర్మాణం' కార్యక్రమంపై అవగాహన కల్పించారు. డే కేర్ సెంటర్లు వయోవృ ద్ధులకు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా అవసరమైన ప్రమాణాలను తప్పనిస రిగా పాటించాలని సూచించారు. వయోవృద్ధుల సంక్షేమం, వారి అవసరాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శారద, సంక్షేమ శాఖ పర్యవేక్షకులు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు, సంక్షేమ శాఖ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చేబర్తి జడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయుడు రవీందర్ రావు పదవీ విరమణ మహోత్సవం





**మర్కుక్, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం చేబర్తి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యా యుడు టేకుమల్ రవీందర్ రావు పదవీ విరమణ మహోత్సవం శనివారం గ్రామస్తులు, బంధువులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో అత్యంత ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ఆవ రణలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో రవీందర్ రావును ఘనంగా సన్మానిం చారు.ఈ సందర్భంగా రిటైర్డ్ ఉపాధ్యాయుడు రవీందర్ రావు మాట్లాడుతూ తన సుదీర్ఘ ఉపాధ్యాయ వృత్తి జీవితంలో ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం సంతోషంగా ఉందన్నారు. తన విద్యార్థి దశను, ఉపాధ్యాయ వృత్తిలో ఎదురైన మధుర అనుభూతులను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకుంటూ కాస్త భావోద్వేగానికి లోనయ్యారు. తన విధి నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ గాయకుడు రామ్ సాగర్ లక్ష్మణ్ గౌడ్ హాజరయ్యారు. తన గురువు రవీందర్ రావు గురించి ఆయన సభలో మాట్లాడుతుండగా ఒక్కసారిగా భావోద్వేగానికి గురయ్యారు. సార్ కేవలం చదువు మాత్రమే చెప్పలేదని, తమ జీవితాలకు ఒక మార్గాన్ని చూపించా రని కొనియాడారు. తన ఎదుగుదలలో గురువు గారి పాత్ర మరువలేనిదని చెబుతూ ఆయన కన్నీటి పర్యంతమయ్యారు. రవీందర్ రావు సార్ కేవలం చదువు మాత్రమే కాకుండా, క్రమశిక్షణ, నైతిక విలువలను నేర్పించి తన ఎదుగుదలకు కారణమయ్యారని అన్నారు. ఈ వీడ్కోలు మహోత్సవంలో చేబర్తి గ్రామ సర్పంచ్ ర్యాకం యాదగిరి, మాజీ సర్పంచ్ ఎర్రబాగు అశోక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తోటి ఉపాధ్యాయ బృందం, పాఠశాల విద్యార్థులు, రవీందర్ రావు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు.

# 30 లోపు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ కేటాయింపులు పూర్తి చేయాలి : కలెక్టర్ భవేష్ మిశ్రా





**నిజామాబాద్, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** రెండు పడక గదుల ఇళ్ళ కేటాయింపులను ఈ నెల 30వ తేదీలోపు పూర్తి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులకు స్పష్టమైన గడువు విధించారు.నిజామాబాద్ నగరం సహా ఆర్మూర్,బోధన్,రుద్రూర్,మోర్తాడ్,బాల్కొండలలో అర్హులైన లబ్ధిబారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ కేటాయింపుల ప్రక్రియ పూర్తి కావాలన్నారు.సమీకృత జిల్లా కార్యాల యాల సముదాయంలో శనివారం సంబంధిత అధికారులతో కలెక్టర్ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ పంపిణీ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు.ఇప్పటికే నిర్మాణాలు పూర్తయిన చోట లబ్ధిదారులకు కేటాయింపులు జరుపుతున్నామని,ఇదే తరహాలో మిగతా చోట్ల కూడా ఈ నెలాఖరు లోగా కేటాయింపులు పూర్తయ్యేలా చర్యలు తీసు కోవాలని సూచించారు.అర్హులైన లబ్ధిదారుల జాబితాను సమగ్ర పరి శీలన జరపాలని,ఆ జాబితా ఆధారంగా డ్రా పద్ధతిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళను కేటాయించాలన్నారు.జాబితాలో అనర్హులు ఉంటే వారి పేర్లను తొలగిస్తూ,అనర్హతకు గల కారణాలను స్పష్టంగా పేర్కొ నాలని సూచించారు.ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటించాలని,ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ,దివ్యాంగులు తదితర కేటగిరీల వారీగా నిర్దేశించిన రిజర్వేషన్ల మేరకు రెండు పడక గదుల ఇళ్ళ కేటాయింపులు జరిగేలా చూడాలన్నారు.ఎలాంటి తప్పిదాలు,అనుమానాలకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ కేటాయింపులు జరపాలని అన్నారు.క్షేత్ర స్థాయిలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు.ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ నెలాఖరు లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సిం దేననీ కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు,ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ,హౌసింగ్ ఇంచార్జి పీ.డీ గీత,నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్,జెడ్పీ సీఈఓ సాయాగౌడ్,డీఆర్డీఓ సాయన్న,హౌసింగ్ ఏ.ఈ నివర్తి,సంబం ధిత అధికారులు పాల్గొన్నారు.

# 5-95-99 లక్ష్యాల సాధనకు సమన్వయంతో పనిచేయాలి

- మల్కాజిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో టీజీఎస్ఏసీఎస్ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ డా. ఏ. రాజేశం సమీక్ష



**మల్కాజిగిరి, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** హెచ్ఐవీ, క్షయ వ్యాధి నియంత్రణకు అందిస్తున్న సేవలను మరింత బలోపేతం చేసి, 95–95–99 లక్ష్యాల సాధనకు సమ న్వయంతో పనిచేయాలని టీజీఎస్ఏసీఎస్ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్, క్షయ కార్యక్రమ రాష్ట్ర సంయుక్త సంచాలకుడు డా. ఏ. రాజేశం సూచించారు. మానిటరింగ్ అండ్ అసెస్‌మెంట్ ఆఫ్ సర్వీసెస్ కార్యక్రమంలో భాగంగా శనివారం మల్కాజిగిరి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని సందర్శించిన ఆయన హెచ్ఐవీ, క్షయ సేవల అమలుతీరును పరిశీలించారు.ఆసుపత్రిలోని సమగ్ర సలహా, పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన డా. రాజేశం రికార్డులు, రిజిస్టర్లు, పనితీరు సూచికలను పరిశీలించారు. ప్రతి నెల నిర్వహిస్తున్న హెచ్ఐవీ పరీక్షలు, గుర్తిస్తున్న పాజిటివ్ కేసులు, వారిని యాంటీ రిట్రోవైరల్ చికిత్సకు అనుసంధానం చేస్తున్న తీరును సమీక్షించారు. హెచ్ఐవీ–క్షయ వ్యాధి పరస్పర రిఫరల్ విధానాన్ని పరిశీలించి, పరీక్షా కేంద్రం నుంచి క్షయ నిర్ధారణ కేంద్రానికి, అక్కడి నుంచి పరీక్షా కేంద్రానికి జరుగు తున్న రిఫరల్స్, అనుసంధానం, లబ్ధిదారుల అనుసరణ వివరా లను తెలుసుకున్నారు.క్షయ సేవలపై సమీక్షఅనంతరం సీబీనాట్ కేంద్రాన్ని సందర్శించి క్షయ వ్యాధికి సంబంధించిన రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. హెచ్ఐవీ–క్షయ సహవ్యాధి ఉన్న వారికి అందుతున్న చికిత్స, అనుసరణ, చికిత్స స్థితిపై వివరాలు తెలుసుకున్నారు. హెచ్ఐవీతో జీవిస్తున్న అర్హులైన వారికి నిర్వహిస్తున్న వైరల్ లోడ్ పరీక్షలు, వైరల్ లోడ్ అణచివేత స్థితిని సమీక్షించారు.రక్తనిధి కేంద్రం పరిశీలనఆసు పత్రిలోని రక్తనిధి కేంద్రాన్ని సందర్శించిన డా. రాజేశం స్వచ్ఛంద రక్తదానాల సేకరణ, రక్త పరీక్షల వివరాలను పరిశీ లించారు. ముఖ్యంగా హెచ్ఐవీ పరీక్షల పరిస్థితిని సమీక్షిం చారు. రక్త పరీక్షల్లో హెచ్ఐవీ పాజిటివ్‌గా గుర్తించిన వారిని చికిత్సకు అనుసంధానం చేయడం, అనుసరణ కొనసాగిస్తున్న తీరుపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.రెండో 95 లక్ష్యంపై దృష్టిమేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఇప్పటికే మొదటి, మూడో 95 లక్ష్యాలను సాధించిందని డా. రాజేశం తెలిపారు. ప్రస్తుతం రెండో 95 లక్ష్యంలో ఉన్న అంతరాన్ని తగ్గించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గుర్తించిన హెచ్ఐవీ బాధితు లను యాంటీ రిట్రోవైరల్ చికిత్సకు అనుసంధానం చేసి, వారు క్రమం తప్పకుండా చికిత్స పొందుతున్నారో లేదో నిర్ధారించా లని చెప్పారు.జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులు, ప్రైవేటు ఆరోగ్య సంస్థలను జిల్లా బృందం సందర్శించి అక్కడ చికిత్స పొందుతున్న హెచ్ఐవీ బాధితుల వివరాలను సేకరించాలని సూచించారు. అవసరమైన వారిని సంబంధిత కార్యక్రమ సేవలకు అనుసంధానం చేయడంతో పాటు చికిత్స కొనసా గింపు, అనుసరణను పటిష్ఠం చేయాలని అన్నారు. ఖచ్చితమైన నమోదు, సకాలంలో రిఫరల్స్, ఆసుపత్రుల మధ్య సమన్వయం, నిరంతర అనుసరణ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ హెచ్ఐవీ, క్షయ సేవలు అందేలా చూడాలని సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో సంయోజకుడు బాబు రావు, కార్యక్రమ అధికారి డా. వై. శ్రీదేవి, వైద్య పర్యవేక్షణాధికారి డా. రాధ, ఆర్ఎంఓ డా. మాధురి, పీఆర్ఓ డా. పి. వినోద్, డిషా సీపీఎం సంజీవ్, ఐసీటీసీ సలహాదారు రమేష్, ఎస్ఎస్‌కే మేనేజర్ కల్పనతో పాటు క్షయ నియంత్రణ కార్యక్రమ సిబ్బంది పాల్గొన్నారు

# ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన




**ముత్తారం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** ముత్తారం మండలం మచ్చుపేట గ్రామంలో శనివారం జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ పై రైతులకు అవగాహన కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అనూష అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు రసాయన ఎరువులు,పు రుగుమందుల వినియోగాన్ని క్రమంగా తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని సూచించారు.ప్రకృతి వ్యవసాయంలో భాగంగా పచ్చిరొట్ట ఎరువులైన జనుము,జీలుగు,పిల్లిపెసర వంటి పంటలను సాగు చేయడం,పశువుల పేడ,వర్మీకంపోస్ట్ వినియోగం,అంతర పంటల సాగు చేపట్టాలని అన్నారు.అలాగే జీవ ఎరువులైన అజోల్లా,అజోస్పైరిలం,పీఎస్‌బీ,అజటోబాక్టర్,జీవ శిలీంద్ర నాశనులైన ట్రైకోడెర్మా విరిడీ,సూడోమోనాస్, సహజ కీటక నాశనిగా వేపనూనె,వేపపిండి వంటి వాటిని వినియోగించాలని సూచించారు.రై తులు పంటలతో పాటు ఆవులు,గేదెలు,ఎడ్లు,మేకలు,కోళ్లు వంటి పశుపక్ష్యాదులను పెంచుకుంటూ సమగ్ర వ్యవసాయం చేపట్టాలని కోరారు.దేశవాళీ జాతులైన గిర్,సహివాల్,ఒంగోలు ఆవుల పెంపకాన్ని ప్రోత్సహించాలని అన్నారు.ఆవు పేడ,ఆవు మూత్రంతో తయారు చేసే జీవామృతం,బీజామృతం వంటి ప్రకృతి వ్యవసాయ ఇన్‌పుట్లను వినియోగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మచ్చ పేట సర్పంచ్ చిలువేరి జ్యోతి లక్ష్మణ్,వార్డ్ మెంబర్ సాగర్,ఏఈఓ శశిధర్,కృషి సఖీలు,సౌఖ్య,విత్తన ధ్రువీకరణ సంస్థ వాలంటీర్ సుమశ్రీ తో పాటు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# మండల అభివృద్ధిపై అధికారుల సమీక్ష

- **ప్రజలకు సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు-MPDO వేజన్న**

**డిండి (గుండ్లపల్లి), సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** డిండి ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండల స్థాయి సమీక్ష సమావేశం (జనరల్ బాడీ) నిర్వహించారు. కమలాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండల పరిధిలో కొన సాగుతున్న వివిధ శాఖల అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, గ్రామ పంచాయతీల అభివృద్ధి, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలపై సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా మండలంలోని ఆయా శాఖల అధికారులు తమ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు అందుతున్న సేవల వివరాలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.అలాగే గ్రామ పంచాయతీల పరిధిలోని సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేందుకు అధికారులు,



సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో ముందుకు సాగాలని సమావేశంలో చర్చించారు. ప్రజలకు అందుతున్న సేవల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో ఎంపీడీవో వేణజ, తహసీల్దార్ శ్రీనివాస్ గౌడ్, ఎంపీపీ జంగయ్య, ఏపీవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# బాలికల సదనంలో మేజిస్ట్రేట్ ఆకస్మిక తనిఖీ

- **చిన్నారుల సంక్షేమం, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి**

**మణుగూరు, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** పినపాక నియోజక వర్గం మణుగూరు మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్, ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కంబపు సూరి రెడ్డి శనివారం మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురం బాలికల సదనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సదనంలోని గదులు, వంటగది, ఆవరణ, పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత, వసతి సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నారులతో మేజిస్ట్రేట్ ముచ్చటించి భోజనం, వైద్యం, విద్య, తాగునీరు, భద్రత తదితర సౌకర్యాలు సక్రమంగా అందుతున్నాయా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పిల్లల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీసి అవసరమైన వైద్య పరీక్షలను సకాలంలో నిర్వహించాలని సదనం నిర్వాహకులకు సూచించారు.చిన్నారులు చదువుపై శ్రద్ధ పెట్టి ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, జీవితంలో ఎదురయ్యే సమస్యలకు భయపడకుండా ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకోవాలని మేజిస్ట్రేట్ సూచించారు. ఏదైనా సమస్య ఎదురైతే సదనం నిర్వాహకులు, సంబంధిత అధికారులు లేదా న్యాయ సేవా సంస్థల దృష్టికి తీసుకురావాలని, బాలల హక్కుల పరిరక్షణకు న్యాయ సేవా సంస్థలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని తెలిపారు.సద



నంలో చిన్నారులకు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పిస్తూ వారి సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం బాలికలకు మేజిస్ట్రేట్ స్వయంగా భోజన పదార్థాలను వడ్డించి, ఆహారం రుచిగా ఉందా అని అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో సదనం చైల్డ్ వెల్ఫేర్ అధికారిణి దీప్తి రాణి, న్యాయవాది అంకం సర్వేశ్, లీగల్ సెల్ కోఆర్డినేటర్ రవీందర్, సదనం అసిస్టెంట్ కుమారి, కోర్టు కానిస్టేబుల్ బుచ్చిబాబు, హోంగార్డు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ దుకాణాల బహిరంగ వేలం

- **21 దుకాణాలకు వేలం పూర్తి.. మిగిలిన 56 దుకాణాలకు త్వరలో మరోసారి వేలం**



**శామీర్ పేట,మూడుచింతలపల్లి, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** మున్సిపాలిటీకి ఆదాయం సమకూర్చడంతో పాటు దుకాణాల కేటాయింపులో పారదర్శకతకు ప్రాధాన్యమిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ జాము రవి తెలిపారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ దుకాణాల సముదాయానికి నిర్వహించిన బహిరంగ వేలం ప్రక్రియలో 21 దుకాణాలకు సంబంధించి దరఖాస్తులు, డీడీలు సమర్పించిన అభ్యర్థుల వేలం ప్రక్రియ పూర్తయిందని తెలిపారు.మొత్తం 77 దుకాణాలకు బహిరంగ వేలం నిర్వహించగా, 21 దుకాణాలకు వేలం పూర్తయిందని, మిగిలిన 56 దుకాణాలకు త్వరలో కొత్తగా వేలం నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.



ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు వేలం ప్రకటనలో పేర్కొన్న నిబంధనలు, షరతులకు అనుగుణంగా దరఖాస్తులు సమర్పించి వేలం ప్రక్రియలో పాల్గొనాలని చైర్‌పర్సన్ జాము రవి సూచించారు.మున్సిపల్ దుకాణాల వేలం ప్రక్రియను నిబంధనల మేరకు పారదర్శకంగా నిర్వహిస్తూ, మున్సిపాలిటీకి ఆదాయం పెరిగేలా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ మోర్సుబాయ్ శశిరేఖ, కౌన్సిలర్లు ర్యాకల నీరజ్ గౌడ్, గిరిపల్లి రమేష్, దోసకాయల లత, పెద్దిరెడ్డి శ్రీలత, కొల్లాస్ రాజు, గిరిపల్లి జ్యోతి, మూడవత్ నవీన్, బొమ్మలపల్లి మల్లేష్ యాదవ్, మెరుపాటి గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఆర్. వెంకట గోపాల్, రెవెన్యూ అధికారి అర్షద్ అహ్మద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గౌతమి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు.

**ఏన్కూర్, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** ఏన్కూర్ మండల కేంద్రంలోనిప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్చార్జి ప్రిన్సిపాల్ సుందర్ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 131 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఇన్చార్జి ప్రిన్సిపల్ మాట్లాడుతూ....చాకలి ఐలమ్మ బడుగు బలహీన వర్గాల హక్కులు కోసం మరియు రైతులు, పేదల హక్కులు కోసం జమీందారీ వర్గాన్ని, భూస్వామ్య వర్గాలతో పోరాటం చేసిన ధీర వనిత అని కొనియాడారు.ఈ కార్యక్రమంలో అధ్యాపక అధ్యాపకేతర బృందం మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు




# పండుగల్లో ప్రజలకు అసౌకర్యం కలగొద్దు

- **మూడుచింతలపల్లి మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో చైర్మన్ జాము రవి**



**శామీర్ పేట,మూడుచింతలపల్లి, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ జాము రవి అధికారులను ఆదేశించారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలో పండుగలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు చైర్మన్ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవస్థ, విద్యుత్ సౌకర్యాలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా అన్ని వార్డుల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను ముందుగానే కల్పించాలని సూచించారు. ఆలయాల పరిసరాల్లో ప్రత్యేక విద్యుత్ సౌకర్యాలు, విద్యుత్ దీపాల ఏర్పాటు, పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.పండుగల సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని చైర్మన్ జాము రవి సూచించారు. సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించడంతో పాటు పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఆర్. వెంకట గోపాల్, వైస్ చైర్మన్ మోర్సుబాయ్ శశిరేఖ, కౌన్సిలర్లు ర్యాకల నీరజ్ గౌడ్, ముద్దం పాపిరెడ్డి, గిరిపల్లి రమేష్, మెరుపాటి గోవర్ధన్ రెడ్డి, పెద్దిరెడ్డి శ్రీలత, ఆది అజయ్ కుమార్, కొంపల్లి మాధవి, దోసకాయల లత, మేడబోయిన మౌనిక, కొల్లాస్ రాజు, గిరిపల్లి జ్యోతి, వంగ ప్రియాంక, మూడవత్ నవీన్, గొంది శ్రావణి, ఇర్రి స్వప్న, బొమ్మలపల్లి మల్లేష్, ఆర్వో హర్షద్, ఆర్ఐలు రాజేశ్వర్ రెడ్డి, గౌతమి, డీఈ స్ఫూర్తి, పారిశుధ్య ఇన్‌స్పెక్టర్ మోహన్ సింగ్, ఏటీపీవో సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ ఆశయాల సాధనకు కృషి చేయాలి

- **ఘనంగా జయంతి ఉత్సవాలు**





**నిజామాబాద్ , సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు,వీరనారి చాకలి ఐలమ్మ ఆశయాల సాధనకు అంకిత భావంతో కృషి చేయాలని ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్,అదనపు కలెక్టర్ భుజంగరావు పిలుపునిచ్చారు.చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని శనివారం వినాయక్ నగర్ హనుమాన్ జంక్షన్ వద్ద గల చాకలి ఐలమ్మ విగ్రహానికి ఎమ్మెల్సీ,అదనపు కలెక్టర్,ఇతర జిల్లా శాఖల అధికారులు,వివిద కుల సంఘాల ప్రతినిధులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన చేసి చాకలి ఐలమ్మ జయంతి సభ జరిపారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ....చాకలి ఐలమ్మ పెత్తందారి వ్యవస్థకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేశారని గుర్తు చేశారు.హక్కుల కోసం రాజీలేని పోరాటం చేసి స్ఫూర్తిని నింపారని కొనియాడారు.చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకుని,ఆమె ఆశయాల సాధనకు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు,జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారులు,వివిధ కుల సంఘాల ప్రతినిధులు,రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు తొమ్మిది రేకుల విద్యార్థి ఎంపిక



**కేశంపేట, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** కేశంపేట మండలం తొమ్మిది రేకుల గ్రామంలోని శ్రీరామకృష్ణ విద్యాలయానికి చెందిన విద్యార్థి లాలామోని సాయి వర్షిత్ అండర్–17 విభాగంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక య్యాడు. పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో సాయి వర్షిత్ తన క్రీడా ప్రతిభను కనబరిచి జిల్లా స్థాయికి అర్హత సాధించాడు. మండల స్థాయిలో జరిగిన పోటీల్లో ప్రతిభావంతమైన ఆటతీరును ప్రదర్శించి ఎంపిక కావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా స్థాయి పోటీల్లోనూ సాయి వర్షిత్ ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎంఇఓ చంద్రశేఖర్, విద్యార్థి తల్లిదండ్రులు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతి, ఉపాధ్యాయులు సాయి వర్షిత్‌ను అభినందించారు. విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహిస్తే వారి ప్రతిభ మరింత వెలుగులోకి వస్తుందని వారు పేర్కొన్నారు. జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల గ్రామస్థులు కూడా సంతోషం వ్యక్తం చేశారు.



# బర్త్‌నగర్‌లో సీసీ రోడ్ల పనులపై పరిశీలన

- ఎమ్మెల్యే మార్రి రాజశేఖర్‌రెడ్డి సూచనల మేరకు అధికారుల పర్యటన



**నేరేడ్ మెట్, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** మల్కాజిగిరి ఎమ్మెల్యే మార్రి రాజశేఖర్‌రెడ్డి సూచనల మేరకు మున్సిపల్ అధికారులు బర్త్‌నగర్, కౌకూర్ ప్రాంతాల్లో పర్యటించి స్థానిక సమస్యలను పరిశీలించారు. మున్సిపల్ వర్క్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ ఆయా ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి పనులపై వివరాలు సేకరించారు.బతుల రాజు యాదవ్ ఇంటి లేన్ నుంచి చర్చి లేన్ ప్రధాన రోడ్డు వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన పనులను పరిశీలించి, ఆమోదానికి అవసరమైన చర్యలను చేపట్టారు. రహదారి నిర్మాణంతో స్థానికులకు రాకపోకల సౌకర్యం మెరుగుపడుతుందని తెలిపారు.అలాగే కాట మైసమ్మ ప్రధాన రహదారి వద్ద నీరు నిలిచిన ప్రాంతాన్ని రెండు హైడ్రా బృందాలు పరిశీలించి, నిల్వ ఉన్న నీటిని తొలగించే పనులు చేపట్టాయి. దీంతో స్థానికులకు ఇబ్బందులు తొలగించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.కార్యక్రమంలో కాలనీ వాసులు సరస్వతి, శోభ, సురేందర్‌తో పాటు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బి. లక్ష్మణ్ యాదవ్, వెంకటేష్ యాదవ్, మల్లేష్ యాదవ్, వెన్న సతీష్, రమేష్ చారి, సందీప్, నరేష్, హనుమాన్ చారి, సత్యనారాయణ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

# విజయదుర్గా మైసమ్మ ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతం

- భక్తిశ్రద్ధలతో పూజలు.. అనంతరం అన్నదానం



**మల్కాజిగిరి, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** విజయదుర్గా మైసమ్మ ఆలయంలో జైశ్రీరామ్ యువజన సంఘం ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ వ్రత పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. పలువురు భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యనారాయణ వ్రతంలో శ్రీనివాస్ యాదవ్, మోహన్ యాదవ్, భాస్కర్ యాదవ్, సతీష్‌రావు, రవి యాదవ్, రమేష్ యాదవ్, తడక జగదీశ్వర్, గుప్తా తదితరులతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేద మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన భక్తులు, నిర్వాహకులకు జైశ్రీరామ్ యువజన సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ




**నిజామాబాద్, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశాల మేరకు శనివారం నిజామాబాద్ కమిషనరేటు కార్యాలయంలో చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకలు అదనపు డి.సి.పి (అడ్మిన్) ఎన్.శుభం ప్రకాష్ ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ముందుగా చాకలి ఐలమ్మ ఫోటోకు పూలమాలలు వేసిన అనంతరం,అదనపు డి.సి.పి మాట్లాడుతూ....తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యసాహసాలు,ప్రజాస్వామిక పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచాయని,భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ప్రదర్శించిన తెగువ,పౌరుషం తెలంగాణ అస్తిత్వాన్ని,ఆత్మ గౌరవాన్ని చాటి చెప్పాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎ.సి.పి(ఎ.ఆర్)కృష్ణ,పరిపాలన అధికారి ఆసియా బేగం,ఆఫీస్ సూపరింటెండెంటులు శంకర్,వనమాల,జగతి,రిజర్వ్ ఇన్స్పెక్టర్స్,పోలీస్ కార్యాలయం సిబ్బంది,సి.సి.ఆర్.బి సిబ్బంది,సి.ఎస్.బి సిబ్బంది,ఐ.టి కోర్ సిబ్బంది,పోలీస్ కంట్రోల్ రూం సిబ్బంది,సెంట్రల్ కాంప్లెంటు సెల్ సిబ్బంది తదితరులు హాజరుకావడం జరిగింది.

# గోదావరి పుష్కర పనులకు అత్యంత ప్రాధాన్యత : కలెక్టర్ భవేష్ మిశ్రా





**నిజామాబాద్, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** గోదావరి పుష్కర పనులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని,ఇప్పటికే కందకుర్తి,యంచ వద్ద భక్తుల సౌకర్యార్థం పుణ్య స్నానాలు ఆచరించేందుకు వీలుగా సదుపాయాల కల్పన కోసం పనులను ప్రారంభించడం జరిగిందని కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు.గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో కలిసి హైదరాబాద్ నుండి శనివారం రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్,కమిషనర్ హనుమంత రావులు ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు.గోదావరి పుష్కరాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ప్రభుత్వం సంకల్పించిన దృష్ట్యా,పుష్కర ఘాట్ల వద్ద విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు.పుష్కరాలకు గడువు సమీపిస్తున్నందున పనులను తక్షణమే చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న సందర్భంగా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ....నిజామాబాద్ జిల్లాలోని కందకుర్తి పుష్కర క్షేత్రంతో పాటు బాసరకు ఆనుకుని అత్యంత చేరువలో ఉన్న యంచ వద్ద ఎండోమెంట్,ఇరిగేషన్,పంచాయతీరాజ్,ఆర్ అండ్ బీ తదితర శాఖల ఆధ్వర్యంలో పనులు చేపట్టేందుకు వీలుగా శంకుస్థాపనలు పూర్తయ్యాయని తెలిపారు.కందకుర్తి వద్ద గోదావరిలో నీటి ప్రవాహం ఉన్నందున కొత్త పుష్కరఘాట్ నిర్మాణానికి మరికొంత సమయం పడుతుందని అన్నారు.ఎస్సారెస్పీ లో ప్రస్తుతం 46 టీ.ఎం.సీల వరకు నీరు నిలువ ఉందని,20 నుండి 25 టీ.ఎం.సీలకు నీటి మట్టం చేరిన మీదట పుష్కర ఘాట్ పనులు చేపట్టేందుకు వీలుంటుందని తెలిపారు.మిగితా పనులను వెంటదివెంట చేపట్టి,మైల్ స్టోన్ ప్రకారం పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నామని,మార్చి నెలాఖరు నాటికి అన్ని పనులు పూర్తయ్యేలా స్పష్టమైన కార్యాచరణతో ముందుకెళ్తున్నామని అన్నారు.కందకుర్తి,యంచతో పాటు జిల్లాలోని గోదావరి పరీవాహక ప్రాంతాలైన తుంగిని,పోచంపాడ్,తడ్ పాకల్ తదితర పుష్కర ప్రదేశాల వద్ద పుణ్య స్నానాలు ఆచరించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు వీ.ఐ.పీలు,వీ.వీ.ఐ.పీలు తరలివచ్చే అవకాశాలు ఉన్నందున వాహనాల పార్కింగ్,సరైన రోడ్డు వసతి,అత్యవసర ఎగ్జిట్ వంటి అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.పుష్కర ఘాట్ల వరకు అప్రోచ్ రోడ్లు,ఘాట్ల మరమ్మతులు వంటి పనులను ప్రాధాన్యతాక్రమంలో చేపట్టేలా అధికారులకు దిశానిర్దేశం చేశామన్నారు.వీడియో కాన్ఫరెన్స్ లో ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ,డీ.ఆర్.ఓ గీత,నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్,జెడ్పీ సీఈఓ సాయాగౌడ్,డీఆర్డీఓ సాయన్న,పంచాయతీరాజ్,ఆర్ అండ్ బీ,ఇరిగేషన్,ఎండోమెంట్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# టీఎన్‌జీవో సంఘంపై అసత్య ప్రచారాన్ని ఖండిస్తున్నాం

- వాస్తవాలు తెలుసుకోకుండా ఉద్యోగుల సంఘ ప్రతిష్ఠను దెబ్బతీసేలా కథనాలు రాయడం సరికాదు: జిల్లా అధ్యక్షుడు బి. రవి ప్రకాష్



**మేడ్చల్ , సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** తెలంగాణ నాన్‌గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్‌జీవో) మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా శాఖపై ఓ దినపత్రికలో ప్రచురితమైన కథనం వాస్తవాలకు విరుద్ధంగా ఉందని, దానిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు బి. రవి ప్రకాష్ తెలిపారు. వాస్తవాలను పూర్తిగా తెలుసుకోకుండా ఒక ఉద్యోగికి సంబంధించిన అంశాన్ని మొత్తం ఉద్యోగుల సంఘానికి ఆపాదిస్తూ వార్తలు ప్రచురించడం బాధ్యతాయుతమైన జర్నలిజం కాదని పేర్కొన్నారు.సంబంధిత అంశంపై పూర్తి వివరాలను తెలుసుకుని, సంఘం ప్రతినిధుల వివరణ తీసుకున్న అనంతరం వార్త ప్రచురించి ఉంటే వాస్తవ పరిస్థితి స్పష్టంగా తెలిసేదని అన్నారు. వైద్య ఆరోగ్యశాఖలోని కొందరు అధికారుల వ్యవహారశైలి కారణంగానే ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయని ఆయన ఆరోపించారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు వారిని భయపెట్టే లేదా ఒత్తిడికి గురిచేసే ధోరణికి స్వస్తి పలికి, నిబంధనల ప్రకారం పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు.టీఎన్‌జీవో సంఘం అధికారులను బెదిరించడం, ఒత్తిడి చేయడం లేదా వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకోవడం వంటి విధానాలను ఎప్పుడూ అనుసరించదని రవి ప్రకాష్ స్పష్టం చేశారు. ఉద్యోగుల సమస్యలపై సంబంధిత అధికారులకు వినతిపత్రాలు సమర్పించి, చర్చల ద్వారా పరిష్కారం సాధించడమే సంఘం అనుసరిస్తున్న ప్రజాస్వామ్య విధానమని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో టీఎన్‌జీవో సంఘానికి ప్రత్యేక పాత్ర ఉందని ఆయన గుర్తుచేశారు. 1969 జై తెలంగాణ ఉద్యమం నుంచి ఉద్యోగుల హక్కులు, స్థానికుల హక్కులు, నిబంధనల అమలు కోసం సంఘం నిరంతరం తన గళాన్ని వినిపించిందన్నారు. జీఓ 610 అమలు విషయంలోనూ ఉద్యోగుల హక్కుల కోసం సంఘం పోరాడిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన మలిదశ ఉద్యమంలో 2011 సకల జనుల సమ్మె సందర్భంగా ఉద్యోగ సంఘాలు కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు.దశాబ్దాలుగా లక్షలాది ప్రభుత్వ ఉద్యోగులకు ప్రాతినిధ్యం వహిస్తూ వారి సమస్యలు, హక్కుల పరిరక్షణ కోసం పనిచేస్తున్న సంఘం ప్రతిష్ఠను దెబ్బతీసేలా వాస్తవ నిర్ధారణ లేకుండా కథనాలు ప్రచురించడం బాధాకరమని రవి ప్రకాష్ అన్నారు. "టీఎన్‌జీవో సంఘం ఎవరికీ వ్యతిరేకం కాదు. అయితే ఉద్యోగులకు అన్యాయం జరిగితే ప్రశ్నించకుండా ఉండదు. ఉద్యోగుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, చట్టబద్ధమైన, ప్రజాస్వామ్య పద్ధతుల్లో పరిష్కరించుకోవడమే మా విధానం" అని స్పష్టం చేశారు.ఒక సంఘంపై కథనం ప్రచురించే ముందు సంబంధిత అంశానికి సంబంధించిన వాస్తవాలు, సంఘం ప్రతినిధుల వివరణ తెలుసుకోవాలని మీడియా సంస్థలకు ఆయన సూచించారు. ప్రచురితమైన కథనంపై పునః పరిశీలన చేసి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని రవి ప్రకాష్ డిమాండ్ చేశారు.

# ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



**వికారాబాద్ , సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల: భూమి, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటిచెప్పిన వీరవనిత చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోత్కూరు వెంకటేష్ పిలుపునిచ్చారు.చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా శనివారం కుల్కచర్లలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహిళా లోకానికి ఐలమ్మ పోరాట స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు, యువజన సంఘాల సభ్యులు, రజక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

# తెలంగాణ ఆత్మగౌరవానికి చాకలి ఐలమ్మ ప్రతీక :జిల్లా కలెక్టర్ మను చౌదరి





**మేడ్చల్ , సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి వీరనారి చాకలి ఐలమ్మ ప్రతీకగా నిలిచారని జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శనివారం అంతాయపల్లిలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి టి. ఝాన్సీరాణి మాట్లాడుతూ సామాజిక అన్యాయం, దోపిడీ, అణచివేతకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ ధైర్యంగా పోరాడారని తెలిపారు. సాధారణ కుటుంబంలో జన్మించినప్పటికీ అసాధారణ ధైర్యసాహసాలను ప్రదర్శించి ప్రజల హక్కుల కోసం నిలబడిన గొప్ప మహిళగా చరిత్రలో నిలిచారని పేర్కొన్నారు.చాకలి ఐలమ్మ జీవితం ధైర్యం, ఆత్మవిశ్వాసం, సామాజిక న్యాయం, సమానత్వం వంటి విలువలను నేర్పుతుందని అన్నారు. ముఖ్యంగా మహిళలు ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ధైర్యంగా ముందుకు సాగేందుకు ఆమె జీవితం స్ఫూర్తినిస్తుందని తెలిపారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. విజయేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్. మాలతి, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి జి. వినోద్ కుమార్, పరిపాలన అధికారి కే.వి.వి. సీతారాం, సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి గంగాధర్, రజక సంఘం నాయకులు పంజా అంజయ్య, సాంబరాజ్ కుమార్, కలెక్టర్ కార్యాలయ, బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.నేడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతికొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి టి. ఝాన్సీరాణి తెలిపారు. జిల్లా ప్రజాప్రతినిధులు, బీసీ సంఘాల నాయకులు, పద్మశాలి కుల సంఘాల నాయకులు, వివిధ కులాల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

# కనీస వేతనాల జీవో నెం.06 ను అమలు చేయాలి.

- **ఈనెల 30న కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాను జయప్రదం చేయండి.**





**నిజామాబాద్, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** రాష్ట్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించిన కనీస వేతనాల జీవో నెం.06 ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని డిచ్ పల్లి కేజీబీవీ,మోడల్ స్కూల్ హాస్టల్స్ లో కరపత్రాల ఆవిష్కరణ జరిగింది.ఈ సందర్భంగా టియుసిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ....రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాలు జీవో 6 ను 2026 జూన్ 1వ తేదీ నుండి అమలు చేయాలని గెజిట్ విడుదల చేసిందన్నారు.కోటి మంది పైగా కార్మికులు లబ్ది పొందుతున్నారని ప్రభుత్వం ప్రకటించిందని,కానీ ఈ ప్రకటన కాగితాలకే పరిమితమైందన్నారు.వాస్తవానికి ఈ జీవో ప్రకారం ప్రకటించిన వేతనాలు కార్మికులకు గౌరవప్రద వేతనాలను అందించవన్నారు.ఈ అతి తక్కువ వేతనాలు కూడా కేజీబీవీ,యుఆర్ఎస్,మోడల్ స్కూల్ హాస్టల్స్ లో అమలు కావడం లేదన్నారు.ఇప్పటికైనా కనీసం జీవో నెంబర్ 6 ను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు.ఈనెల 30న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు ధర్నా నిర్వహించాలని టియుసిఐ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందన్నారు.అందులో భాగంగా ఈనెల 30న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టియుసిఐ జిల్లా సహాయ కార్యదర్శి డి.కిషన్,కేజీబీవీ,మోడల్ స్కూల్ హాస్టల్స్ సిబ్బంది విజయ,సుజాత,పార్వతి,స్వప్న,మంజుల,కమల,పద్మ,రాజమణి,స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# రజక సంఘం ఆధ్వర్యంలో-సాయుధ పోరాట వీరనారి ఐలమ్మ జయంతి

- **మండల అధ్యక్షుడు లొంగరి మల్లేష్**
- **ఇబ్రహీంపట్నం నియోజకవర్గం వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్**



**ఇబ్రహింపట్నం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** మంచాల మండలం మండల తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ 131వ జ యంతి వేడుకల సందర్భంగా మంచాల మండలం రజక సంఘం అధ్యక్షుడు లొంగరి మల్లేష్ ఆ ధ్వర్యంలో మండల కేంద్రంలోని చెరువు కట్టపైన ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలవే సి నివాళులర్పించిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గం వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ మం చాల మండలం వైయస్సార్ యువసేన నాయకుడు లొంగరి యాదగిరి ఈ సందర్భంగా వైయ స్సార్ మాధగోని జంగయ్యగౌడ్ మాట్లాడుతూ, ఆనాడు జరిగిన తెలంగాణ సాయుధ పోరాటలో రజాకార్లకు ఎదురొడ్డి పోరాటం చేసిన గొప్ప పోరాట యోధురాలు తెలంగాణ వీరనారి చాకలిఐ లమ్మ అని అన్నారు. పేదల బలహీన బడుగు వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన మహ నీయురాలు చాకలి ఐలమ్మ అని అన్నారు.సామాజిక న్యాయం ఆత్మగౌరవం సమానత్వం కోసం చాకలి ఐలమ్మ సాగించిన పోరాటంనేటి తరానికి ఆదర్శం అని అన్నారు భూమి భుక్తి కోసంజీవ న హక్కుల కోసం ఆమెచేసిన పోరాటం అణగారిన వర్గాల్లో హక్కులపట్ల ఆమె చైతన్యాన్ని పెంచింది అని అన్నారు ప్రజలకు ఎక్కడ అన్యాయం జరిగిన నేను ఉన్నాను.అంటూ అండగా నిల బడి దొరల గడీలు కులగొట్టి వందలాది ఎకరాల భూములు పేద ప్రజలకు పంచిన గొప్ప పోరాట యోధురాలు చాకలిఐలమ్మ అని గుర్తుచేశారు.ప్రతి తెలంగాణ పౌరుడు చాకలి ఐలమ్మ పో రాటాన్ని సేవలను ఆదర్శంగా తీసుకొని ఆమె అడుగుజాడల్లో నడిచి చాకలిఐలమ్మఆశయసాధ న కోసం కృషి చేయాలని అనిఅన్నారు. ఈకార్యక్రమంలో మంచాల మండలం రజక సంఘం ఉపాధ్యక్షులు మొగిలి శ్రీశైలం మరియు రజక సంఘం రాష్ట్ర నాయకులు అవతాపురంశ్రీరాములు మంచాల మండలం గౌరవ అధ్యక్షులు గాలయ్య మంచాల గ్రామశాఖ రజకసంఘం అధ్యక్షులు వడ్లకొండ యాదయ్య రజకసంఘం నాయకులు మొగిలి గిరిబాబు మొగిలి మహేష్ జపాల బుగ్గరాములు అన్నారం యాదయ్య లక్షణాలు నారాయణ అన్నారం యాదయ్యమంచాల గ్రామం వార్డ్ సభ్యుడు మాల్గ శ్రీశైలం గ్యారశేఖర్.మంచాల మండలం నాయినీ బ్రహ్మ అధ్యక్షుడు అశ్వల బాలరాజ్ మల్ల లింగం గడ్డం ప్రభాకర్ గడ్డం రాజు కడారి లింగం ఏర్పుల నరేష్ మాచర్ల అబ్బయ్య వివిధ పార్టీల నాయకులు రజక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు





**నాగోల్, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** తెలంగాణ మహిళా జన సమితి నాగోల్ కార్యాలయం నందు తెలంగాణ మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీమతి సత్తూరి పుష్పనీల గౌడ్ ఆదర్వ్యంలో చాకలి ఐలమ్మ 131 జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చాకలి ఐలమ్మ బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం మరియు రైతులు పేదల హక్కుల కోసం జమీందారు వర్గాన్ని భూస్వామ్య వర్గాలతో పోరాటం చేసిన దీరవనిత కొనియాడారు. తెలంగాణ మహిళా జనసమితి మహిళ ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీమతి సత్తూరి పుష్పనీల గౌడ్ అనారోగ్యం కారణంగా హాస్పిటల్ నందు ఉండడం వల్ల మేడం గారి ఆదేశాల మేరకు మేడం గారి ఆదర్వ్యం లో చాకలి ఐలమ్మ గారి జయంతి వేడుకలు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో తెలంగాణ మహిళా కార్యకర్తలు ఉషారాణి లక్ష్మమ్మ మంజుల మరియు సూర్య ప్రకాశ్ రెడ్డి, పాల్గొనడం జరిగినది .

# రేబిస్‌పై ప్రజలకు విస్తృత అవగాహన:డాక్టర్ కిరణ్ కుమార్ గౌడ్



**వికారాబాద్, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల: రేబిస్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు, జంతువుల కాటుకు గురైనప్పుడు తీసుకోవాల్సిన తక్షణ జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు మండల వ్యాప్తంగా రేబిస్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కుల్కచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కిరణ్ కుమార్ గౌడ్ తెలిపారు.తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ సూచనల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు రేబిస్ వ్యాధి నివారణ, జంతువుల కాటు అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సకాలంలో వైద్య సేవలు పొందడం వంటి అంశాలపై వైద్య సిబ్బంది విస్తృతంగా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. జంతువుల కాటును నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

# తప్పిపోయిన వ్యక్తి ఆచూకీ కోసం గాలింపు



**ముత్తారం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన ఇల్లందుల సంతోష్ (37) మతి స్థిమితం కోల్పోయి తప్పిపోయాడని తండ్రి సత్తయ్య స్థానిక పోలీస్ స్టేషన్లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సంతోష్ మానసిక ఆరోగ్య సమస్యతో బాధపడుతున్నా ర ని, మ తిస్థిమిత ం కోల్పోయి తప్పిపోయాడని తెలిపారు.ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగిస్తున్నామని సంతోష్‌ను ఎవరైనా చూసినా,ఎక్కడ ఉన్నారనే సమాచారం తెలిసినా వెంటనే 8712656531 (ఎస్సై, ముత్తారం) లేదా 9866789884 నంబర్లకు తెలియజేయాలని కోరుతున్నామని ఎస్సై రవికుమార్ అన్నారు.ఆచూకీ తెలిపిన వారికి తగిన బహుమతి అందజేయబడుతుందన్నారు.

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక
ఆదివారం | హైదరాబాద్
27 - 09 - 2026
www.netisubhodaya.com



## నందిపేట్ లో పోషణమాసం సంబరాలు



**నిజామాబాద్, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** నందిపేట్ లో ఐసిడిఎస్ అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్షంలో బాగంగా ఇంటింటా పోషణ సంబరాలు జరపడం జరిగింది.ఈ కార్యక్రమంలో గర్భిణీలకు ఐరన్,ఐఎఫ్ఏ టాబ్లెట్స్ గురించి వివరించారు.పిల్లలకు అన్నప్రాసన,అక్షరాబ్యాసం జరపడం జరిగింది.గర్భిణీ లకు,బాలింత తల్లులకు,పిల్లల తల్లులకు పోషక విలువలు గలఆహారం గురించి,పిల్లల ఎదుగుదల,బరువు గురించి తల్లులకు చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో నందిపేట్ సర్పంచ్ ఎర్రం లింగం,పంచాయతీ సెక్రటరీ మహేందర్,వార్డ్ మెంబెర్ నరేష్,హెల్త్ సూపర్వైజర్ పద్మవతి,ఐసిడిఎస్ ఏసిడిపిఓ స్వర్ణలత,అంగన్వాడీ సూపర్వైజర్ రేఖ,అన్నపూర్ణ,ఏఎన్ఎం రేణుక,ఆశాలు,అంగన్వాడీ సిబ్బంది పద్మ,మమత,నర్మదా,కవిత,సంగీత,సౌమ్య,రేణుక,కేశవమ్మా,రసజ్ఞ,బాలింతలు,తల్లులు పాల్గొన్నారు.

## వీరనారి చాకలి ఐలమ్మ గారి జయంతి సందర్భంగా ఘన నివాళులు



**ఎల్బీనగర్, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** వీరనారి చాకలి ఐలమ్మ గారి జయంతి సందర్భంగా చింతల కుంటలోని ఆమె విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన ఎల్బీనగర్ శాసనసభ్యులు శ్రీ దేవిరెడ్డి సుధీర్ రెడ్డి.భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ గారి ధైర్యసాహసాలు, పోరాట స్ఫూర్తి నేటి తరాలకు ఎల్లప్పుడూ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, కొప్పుల విట్టల్ రెడ్డి, జిట్టా రాజశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## జెండా జాతర ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ధన్పాల్



**నిజామాబాద్, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** నగరంలోని జెండా బాలాజీ ఆలయంలో శనివారం నిర్వహించిన జెండా జాతరలో అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....ఇందూరులో ఏళ్లుగా జెండా జాతర ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు.భాద్రపద మాసంలో వినాయకచవితికి ముందు జెండా జాతర ప్రారంభం అవుతుందన్నారు.జెండా ఆలయం నుంచి శోభాయాత్రగా పులాంగ్ వరకు కొనసాగి,అక్కడ వారం రోజులపాటు ఉంటుందన్నారు.ప్రతి ఒక్కరు దర్శించుకొని వేంకటేశ్వర స్వామి కృపా కటక్షాలు పొందాలన్నారు.కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ,పసునూరి రాము,మల్కాయి మహేందర్,ప్రసూన శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రైమరీ టీచర్లపై ఒత్తిడి తగ్గించాలి : డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎం. బాలయ్య



**నిజామాబాద్ రూరల్ సిరికొండ, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులపై ఎఫ్ ఎల్ ఎన్ పేరుతో అధికారుల పర్యవేక్షణ టీముల ఒత్తిడి తగ్గించాలని డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎం. బాలయ్య, డిమాండ్ చేశారు తొలిమెట్టు (ఎఫ్ ఎల్ ఎన్) కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కనీస సామర్థ్యాలను బోధించే విధంగా ఉపాధ్యాయులు బోధన కొనసాగించాల్సి ఉందన్నారు. విద్యార్థులు కనీస సామర్థ్యాలుతో సాధించలేక పోవడానికి అనేక కారణాలు ఉంటాయని ఉపాధ్యాయులను మాత్రమే దోషులుగా నిలబెట్టడానికి ప్రయత్నం జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడు ఉండవలసిన ప్రాథమిక పాఠశాలలో 60 మంది విద్యార్థులు ఉన్న ఇద్దరే ఉపాధ్యాయ పనిచేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం జీవో 25 అనుసరించి ఉపాధ్యాయుల సర్దుబాటు చేయడం కారణంగా జిల్లాలో వందలాది ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయుల బోధించవలసిన వస్తుంది ఇద్దరిలో ఒక ఉపాధ్యాయుడు ప్రధానోపాధ్యాయులు బాధ్యతలు నిర్వహించవలసిన రావడం కారణంగా రోజువారి వివిధ రకాల రిపోర్ట్ తయారు చేసే అధికారులకు పంపించే పనిలో నిమగ్నం కావడం పాఠశాలకు సంబంధించిన అనేక బాధ్యతలను పరిష్కరించుకుంటూ విద్యార్థులకు బోధించడానికి సమయం దొరికిన పరిస్థితి ఏర్పడుతుంది ఉన్న ఒక్క ఉపాధ్యాయుడు అయిదు తరగతిలో బోధించడం తలకు మించిన వారం కావడంలో ఉపాధ్యాయులు తీవ్ర మాస్కృతడ్ గురవుతున్నారు. ఇది ఇలా ఉన్నదా అధికారులు నోడల్ అధికారులు ఎఫ్ ఎల్ ఎన్ పర్యవేక్షణ టీంలు పాఠశాలను సందర్శిస్తూ పలు విధాలుగా బోధన నైపుణ్యానికి సంబంధించి విద్యార్థులను ప్రశ్నలు అడిగి ఆశించిన స్పందన విద్యార్థుల్లో లేదని ఉపాధ్యాయులను బాధ్యులుగా చేయడం జరుగుతుంది. విద్యార్థుల సామర్థ్యాలు ఆశించిన స్థాయిలో లేకపోవడానికి వారి తల్లిదండ్రు ల ఆర్థిక సామాజిక న్యాయం విద్యార్థి అభ్యసనం పై కూడా ప్రభావాన్ని గుర్తించకుండా కేవలం ఉపాధ్యాయులను బాధ్యతలు చేసి దోషులుగా నిలబెట్టే విధంగా ప్రభుత్వ చర్యలు ఉన్నాయని ఐదు తరగతులకు ఒకరిద్దరు ఉపాధ్యాయులు ఏ విధంగా న్యాయం చేస్తారో శాస్త్రీయంగా ఆలోచించడం లేదని ఫలితంగా ఉపాధ్యాయుల మీద తీవ్ర మానసిక భక్తులు జరుగుతుంది. ఉపాధ్యాయుల్లో ఒత్తిడి కారణమవుతున్న వివో 25 సవరించి ప్రతి ప్రాథమిక పాఠశాలకు కనీసం మదనంగా మరో ఉపాధ్యాయుడు లేదా విద్యా వాలంటరీ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ నిజామాబాద్ జిల్లా శాఖ పరిషత్ జిల్లా విద్యాశాఖ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నాము.అన్నారు

## జవహర్‌నగర్ ఇళ్లకు హక్కులు కల్పించాలి

- **దశాబ్దాలుగా నివాసముంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాల ఇళ్లను క్రమబద్ధీకరించాలి**
- **కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్**



**మేడ్చల్, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** జవహర్‌నగర్ ప్రాంతంలో దశాబాలుగా ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాల ఇళ్లను క్రమబద్ధీకరించి వారికి పూర్తి హక్కులు కల్పించాలని మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ కోరారు. ఈ మేరకు స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా జవహర్‌నగర్‌లో భూములు, ఇళ్ల క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఏళ్ల తరబడి ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్న కుటుంబాలకు చట్టబద్ధమైన హక్కులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఇళ్లను క్రమబద్ధీకరించి యాజమాన్య హక్కులు కల్పించడం ద్వారా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.వినతిపత్రంపై కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు వజ్రేష్ యాదవ్ తెలిపారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.అనంతరం వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ జవహర్‌నగర్‌లో ఏళ్ల తరబడి నివాసముంటున్న ప్రజలకు ఇళ్లపై పూర్తి హక్కులు కల్పించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రజల న్యాయమైన హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.కార్యక్రమంలో చంద్రపురి కాలనీ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, జవహర్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు శాంతి కోటేష్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ గొడుగు వేణు, ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, బల్లి శ్రీనివాస్, బింగి సతీష్‌గౌడ్, మనోధర్‌రెడ్డి, మాట్ల వినయ్‌కుమార్, యాదగిరి యాదవ్, ఎర్రగుంట్ల వెంకటేష్, వీర్ల బుజ్జి, నాయకం భాస్కర్, నర్ర మహేష్, బబ్లూ ముదిరాజ్, గజ్వేల్ శంకర్, మాధవరెడ్డి, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు

- **ఉద్దమర్రిలో రైతు క్షేత్ర ప్రదర్శన.. సేంద్రియ సాగుపై అవగాహన**





**శామీర్ పేట, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** ప్రకృతి, సేంద్రియ వ్యవసాయ పద్ధతులను రైతులు విస్తృతంగా అవలంబించి తక్కువ పెట్టుబడితో నాణ్యమైన పంటలను సాగు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ సూచించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా నేల సారాన్ని పరిరక్షించడంతో పాటు రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించవచ్చని తెలిపారు.మూడు చింతలపల్లి మండలం ఉద్దమర్రి గ్రామంలో శనివారం రైతు క్షేత్ర ప్రదర్శన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయ విధానాలపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. పంటల సాగులో సహజ వనరులను వినియోగించుకోవడం, నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, నాణ్యమైన దిగుబడులు సాధించడం వంటి అంశాలను అధికారులు రైతులకు వివరించారు.మేడ్చల్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకట్రామరెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రదర్శనల ద్వారా రైతులకు ఆచరణాత్మకంగా అవగాహన కల్పించడం వల్ల సాగు పద్ధతులను సులభంగా అర్థం చేసుకునే అవకాశం ఉంటుందన్నారు.ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంలో అనుభవం ఉన్న రైతు ప్రసాద్‌రెడ్డి తన క్షేత్రంలో అవలంబిస్తున్న సాగు విధానాలను రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో ఎదురైన అనుభవాలు, పంటల సాగులో అనుసరిస్తున్న పద్ధతులు, వాటి ద్వారా పొందుతున్న ప్రయోజనాలను రైతులతో పంచుకున్నారు.ఈ సందర్భంగా మూడు చింతలపల్లి మండల వ్యవసాయ అధికారి వి. ప్రవీణ మాట్లాడుతూ రైతులు ప్రకృతి, సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై ఆసక్తి పెంచుకోవాలని కోరారు. క్షేత్ర ప్రదర్శనల ద్వారా రైతులకు సాగు విధానాలపై ప్రత్యక్ష అవగాహన కల్పించడమే కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. రైతుల సందేహాలను నివృత్తి చేస్తూ అవసరమైన సాంకేతిక సూచనలు, సలహాలను అందించారు.కార్యక్రమంలో ఏపీఎం మునిస్వామి, మహిళా సమాఖ్య సభ్యులు రజిత, నరసమ్మ, ఏఈఓ సురేష్, రైతులు పాల్గొన్నారు.

## గణనాథుని శోభాయాత్రలో పాల్గొన్న టిపిసిసి సభ్యులు దేప భాస్కర్ రెడ్డి

**మహేశ్వరం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :**
మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని గ్రీన్ హిల్స్ కాలనీ, రోడ్ నంబర్ 2 నందు శివాజీ మహారాజ్ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా గణనాథుని శోభాయాత్ర ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, టిపిసిసీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొనడం జరిగింది.ఈ సందర్భంగా వారు.వినాయక స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, శోభాయాత్రను ప్రారంభించారు. భాస్కర్ రెడ్డి, మాట్లాడుతూ..అందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో నియోజకవర్గ ప్రజలందరూ వర్ధిల్లాలని, ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు.ఈ తరహా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలలో ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం చైర్మన్ తలాటి రమేష్ నేత ఎన్టీఆర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పిడి లింగస్వామి గౌడ్, అక్బర్, పెద్దవూర సైదులు, నాగేష్ నేత,నబీ,సుధాకర్ రెడ్డి, నాగరాజు , ఖాలీమ్, వినయ్ పృథ్వీ, జంగారెడ్డి,వల్లీ శర్మ, కిరణ్మయి జంగారెడ్డి మరియు మిత్ర మండలి ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రముఖ నాటు వైద్యుడు మృతి.

- **అప్పారావు పార్థివ దేహానికి ఎమ్మెల్యే రాందాస్ నివాళులర్పించారు.**
- **అప్పారావు మృతితో గార్లఒడ్డు లో విషాదం**

**ఏన్కూరు, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :**
ఏన్కూరు మండల పరిధిలోని గార్లఒడ్డు గ్రామానికి చెందిన సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు సోదరుడు ప్రముఖ నాటు వైద్యుడు శెట్టిపల్లి అప్పారావు( 90)మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ గార్లఒడ్డు గ్రామానికి చేరుకుని అప్పారావు పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.అప్పారావు మృతి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్థులకు తీరని లోటని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయన సేవలను స్మరించుకుంటూ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఎమ్మెల్యేతో పాటు మండల కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్థులు అంతిమయాత్రలో పాల్గొని శెట్టిపల్లి అప్పారావు కు ఘనంగా నివాళులర్పించారు.





## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి

**బోనకల్, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :**
స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల బోనకల్‌లో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ అంతోటి తిరుపతిరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ లింగంనేని నళినిశ్రీ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ లింగంనేని నళినిశ్రీ మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలో చాకలి ఐలమ్మ ధైర్యానికి, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన గొప్ప మహిళా యోధురాలని అన్నారు.నిజాం పాలన కాలంలో గ్రామీణ ప్రజలు భూస్వాముల పెత్తనం, వెట్టిచాకిరి, అధిక పన్నులు, సామాజిక, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్న సమయంలో ఐలమ్మ అన్యాయానికి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడారని తెలిపారు. తన భూమిపై భూస్వామ్య శక్తులు హక్కు సాధించేందుకు ప్రయత్నించినప్పటికీ ఆమె ఏమాత్రం వెనక్కి తగ్గకుండా తన భూమిని కాపాడుకునేందుకు పోరాటం చేశారని పేర్కొన్నారు.చాకలి ఐలమ్మ పోరాటం కేవలం తన కుటుంబం కోసమే కాకుండా అణగారిన ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కోసం సాగిన పోరాటంగా చరిత్రలో నిలిచిపోయిందన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం ఆమె చేసిన పోరాటం ప్రజల్లో చైతన్యాన్ని నింపిందని తెలిపారు. ఆమె స్ఫూర్తితో అనేక మంది మహిళలు సామాజిక ఉద్యమాల్లో భాగస్వాములయ్యారని అన్నారు.చాకలి ఐలమ్మ జీవితం నుంచి ప్రతి ఒక్కరూ ముఖ్యంగా నాలుగు విషయాలను నేర్చుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. అన్యాయాన్ని ప్రశ్నించడం, తమ హక్కులను తెలుసుకోవడం, కష్టాలు ఎదురైనప్పుడు ధైర్యంగా నిలబడటం, సమాజంలో సమానత్వం మరియు ఆత్మగౌరవం కోసం కృషి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.అన్యాయం ముందు తలవంచకుండా హక్కుల కోసం ధైర్యంగా నిలబడిన చాకలి ఐలమ్మ జీవితం నేటి యువతకు, ముఖ్యంగా మహిళలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆమె ఆశయాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొని చాకలి ఐలమ్మకు ఘన నివాళులర్పించారు.





## రైతు రిజిస్ట్రేషన్, డిజిటల్ పంట నమోదు తప్పనిసరి

**శంషాబాద్, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :**
రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవడంతో పాటు, తమ పంటల వివరాలను ఆన్‌లైన్ పంట నమోదు (డిజిటల్ క్రాప్ సర్వే) లో నమోదు చేయించుకోవాలని శంషాబాద్ మండల వ్యవసాయ అధికారి రాచ శ్వేత సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవడం ద్వారా వరి, పత్తి, మొక్కజొన్న, కంది తదితర పంటల కొనుగోళ్లు, ఎరువుల కొనుగోళ్లు, బ్యాంకుల ద్వారా పంట రుణాలు పొందడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ పథకాలు, ముఖ్యంగా పీఎం కిసాన్ తదుపరి విడత ప్రయోజనాలు పొందేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేసే లక్ష్యంలో భాగంగానే రైతు రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. శంషాబాద్ మండలంలోని అన్ని గ్రామాల్లో సెప్టెంబర్ 22 నుంచి 30 వరకు రైతు రిజిస్ట్రేషన్ ప్రత్యేక క్యాంపెయిన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు తమ గ్రామంలోని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) లేదా మీ సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. రిజిస్ట్రేషన్ కోసం ఆధార్ కార్డు, భూమి పాస్‌బుక్, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్ అవసరమని పేర్కొన్నారు. శంషాబాద్ మండలంలో మొత్తం 14,709 మంది పట్టాదారు పాస్‌బుక్ కలిగిన రైతులు ఉండగా, ఇప్పటివరకు 7,575 మంది మాత్రమే ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకున్నారు. అంటే సుమారు 51 శాతం మంది నమోదు పూర్తి చేసుకున్నారు. ఇంకా 7,134 మంది రైతులు నమోదు చేసుకోవాల్సి ఉందని వ్యవసాయ అధికారి శ్వేత తెలిపారు. మండలంలోని 28 రెవెన్యూ గ్రామాల్లో ప్రభుత్వం నియమించిన వాలంటీర్లు, సిబ్బంది రైతులు సాగు చేసిన పంటల వివరాలను క్షేత్రస్థాయిలో సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారని తెలిపారు. డిజిటల్ క్రాప్ సర్వేలో నమోదైన వివరాల ఆధారంగానే పత్తి, మొక్కజొన్న, కందులు, వరి తదితర వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లకు సంబంధించి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. కాబట్టి పంట నమోదు సిబ్బంది గ్రామానికి వచ్చినప్పుడు రైతులు తమ పొలాల వద్ద అందుబాటులో ఉండి, సాగు చేసిన పంటకు సంబంధించిన సరైన వివరాలను తెలియజేసి నమోదు చేయించుకోవాలని రాచ శ్వేత కోరారు.



# జానకంపేట్ సొసైటీలో మహాజన సభ నిర్వహణ

**నిజామాబాద్, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :**
ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం జానకంపేట్ లో మహాజన సభ సమావేశము సొసైటీ చైర్మన్ మిద్దె నరేందర్ అధ్యక్షతన శనివారం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశంలో సంఘ కార్యదర్శి జమ,ఖర్చులు,వ్యాపార ఖాతా, లాభ , నష్టాల ఖాతా,సంఘ లావాదేవీలు చదివి వినిపించడం జరిగింది.అనంతరం మహాజన సభలో పలు విషయాలు చర్చించి ఆమోదించి ఏకగ్రీవంగా తీర్మానించడం జరిగింది.యూరియా యాప్ పూర్తిగా తొలగించుట గురించి,సొసైటీకి గోడౌన్ నిర్మాణం కొరకు ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం అందించాలని ఎమ్మెల్యేని కలవడం గురించి,ఎఫ్ పి ఓ లో రైతులు అందరూ మెంబర్షిప్ కచ్చితంగా చేసుకోవాలి అని,ఋణ మాఫీ కానీ వారికి వెంటనే ప్రభుత్వం స్పందించి ఋణ మాఫీ చేయాలని తీర్మానాలు చేయడం జరిగింది.మహాజన సభకు గ్రామ సర్పంచ్ అనురాధ రాధ కిషన్ గౌడ్,ఉపసర్పంచ్ నీలం కృష్ణ,సొసైటీ వైస్ చైర్మన్,డైరెక్టర్స్,జానకంపేట్ ఏఈఓ శ్రీహరి,సొసైటీ మాజీ చైర్మన్లు,ప్రజాప్రతినిధులు,రైతులు,సంఘ సభ్యులు,గ్రామ పెద్దలు,సంఘ కార్యదర్శి,సిబ్బంది పాల్గొనడం జరిగింది.





# జోనల్ క్రీడల్లో జడ్పీహెచ్ఎస్ కేశంపేట విద్యార్థుల సత్తా

**కేశంపేట, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** కేశంపేట జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఎస్‌జీఎఫ్ఐ జోనల్ స్థాయి అండర్–17 క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి రన్నరప్‌గా నిలిచారు. అండర్–17 బాలుర కబడ్డీ విభాగంలో బి.సాయి తేజ్, కార్తీక్ గౌడ్, మల్లేష్, రాకేష్ ప్రతిభ కనబరిచి జట్టు రన్నరప్‌గా నిలిచింది. అదేవిధంగా అండర్–17 వాలీబాల్‌లో బాలికల విభాగంలో అక్షిత, బాలుర విభాగంలో జి.కార్తీక్ రన్నరప్‌గా నిలిచి పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చారు. విద్యార్థుల ప్రతిభ పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విద్యావతి హర్షం వ్యక్తం చేశారు. క్రీడల్లో మరింతగా రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు విజేతలను అభినందించారు. క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, జట్టుస్ఫూర్తి పెరుగుతాయని పేర్కొన్నారు. విద్యార్థుల విజయానికి సహకరించిన పాఠశాల ఉపాధ్యాయులను అభినందించారు.



## ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు : బీజేపీ నాయకులు



**మంథని, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** తెలంగాణ గడ్డపైన భూమికోసం భుక్తి కోసం బానిస బ్రతుకుల విముక్తి కోసం నిజాం రజాకార్ ఆకృత్యాలకు తొత్తులుగా ఉన్న జమిందార్, దొర గడీల అఘాయిత్యాలను సాయుధ పోరాటం ద్వారా అణిచివేసి పేద ప్రజల కు దొరల ఆధీనంలో ఉన్న లక్షలాది ఎకరాల భూమిని పంచిపెట్టి వారి కన్నీళ్లను తుడిచిన చాకలి ఐలమ్మ 131 జయంతి వేడుకలను భారతీయ జనతా పార్టీ మంథని పట్టణ బృందం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సబ్బని సంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించగా పట్టణ మాజీ అధ్యక్షులు బూడిద తిరుపతి కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడడం జరిగింది. ఈ జయంతి వేడుకల్లో జిల్లా కౌన్సిల్ మెంబర్ బోగోజు శ్రీనివాస్, అసెంబ్లీ కో కన్వీనర్ నాంపల్లి రమేష్, పట్టణ మాజీ అధ్యక్షులు చిలువేర సతీష్, సీనియర్ నాయకులు నారమల్ల కృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శిలు సామల అశోక్,ఎడ్ల సాగర్, పట్టణ కార్యదర్శులు పార్వతి విష్ణు, మాచిడి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

# రాజేష్ మృతిపై తల్లి ఆవేదన.. ఎరుకల సంఘం దర్యాప్తు డిమాండ్



**ఎల్బీనగర్, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** ఎరుకల గిరిజన యువకుడు బూరాకుల రాజేష్ మృతి ఘటనపై తల్లి బూరాకుల జయ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తన కుటుంబానికి, ఈ ఘటనకు ఎలాంటి సంబంధం లేని వారిని ఇందులోకి లాగొద్దని వేడుకున్నారు.సోషల్ మీడియాలో తన కుటుంబ పరువు తీసేలా ప్రచారం చేస్తున్నారని.. "నన్ను బతకనిస్తారా.. చావనిస్తారా?" అంటూ కన్నీటితో ఆవేదన వ్యక్తం చేశారు.మరోవైపు రాజేష్ మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలని భారత ఎరుకల కులవృత్తుల సంఘం జాతీయ అధ్యక్షుడు పుస్కందేల వెంకటేష్ డిమాండ్ చేశారు. వనస్థలిపురం పోలీసులను కలిసి రాజేష్ తల్లి స్టేట్‌మెంట్ విషయాన్ని వివరించినట్లు తెలిపారు.రాజేష్ మృతికి ఎవరైనా కారణమై ఉంటే వారిని గుర్తించి చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సంఘం కోరింది.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై బీఆర్ఎస్ కసరత్తు

- ఎన్‌రోల్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి : కేటీఆర్
- ఆరు జిల్లాల నేతలతో వరుస సమావేశాలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** రాష్ట్రంలో జరగనున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలను బీఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నది. ఎన్నికలకు ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో వరుస సమావేశాలు నిర్వహించారు. ఆరు జిల్లాల నేతలతో దశలవారీగా సమావేశమవుతున్న ఆయన.. ఇందులో భాగంగా వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల నేతలతో విడివిడిగా భేటీ అయ్యారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై వారికి దిశానిర్దేశం చేశారు.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల ఎన్‌రోల్‌మెంట్ అత్యంత కీలకమైన అంశమని కేటీఆర్ పేర్కొన్నారు. అర్హత కలిగిన ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరుగా నమోదు చేసుకునేలా పార్టీ శ్రేణులు విస్తృతంగా కృషి చేయాలని సూచించారు. ఎన్‌రోల్‌మెంట్‌కు సంబంధించి పార్టీ పరంగా అనుసరించాల్సిన వ్యూహంపై నేతలకు పలు సూచనలు చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే సమయానికి పార్టీ యంత్రాంగం పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉండేలా ఇప్పటి నుంచే కార్యాచరణ రూపొందించుకోవాలని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగులు, గ్రాడ్యుయేట్లను మోసం చేసిందన్న ఆగ్రహం వారిలో తీవ్రంగా ఉన్నదని కేటీఆర్ అన్నారు. చదువుకున్నవారు తమ సమస్యలతోపాటు తమ కుటుంబాలు, అన్నదాతలు, మహిళలు, యువత సహా రాష్ట్రంలోని అన్ని వర్గాల సమస్యలను గమనిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు ద్రోహం చేసిందన్న విషయాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటమి తప్పదని అన్నారు. అయితే ఆ వ్యతిరేకత బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఓటుగా మారేలా ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పార్టీ నేతలకు సూచించారు.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా మరో రెండు రోజుల్లో మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నేతలతో కేటీఆర్ సమావేశం కానున్నారు. ఆయా జిల్లాల నేతలతో విడివిడిగా భేటీ అయి ఎన్నికల కార్యాచరణపై చర్చించనున్నారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసేలా బాధ్యతలు, కార్యాచరణపై దిశానిర్దేశం చేయనున్నారు.గత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరంగల్, ఖమ్మం, నల్లగొండ పరిధిలో బీఆర్ఎస్ అభ్యర్థి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలైన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. ఈసారి పార్టీ ఎవరిని అభ్యర్థిగా నిలబెట్టినా విజయం సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. అభ్యర్థి ఎవరైనా ఎన్నిక పార్టీ గుర్తుపైనే జరుగుతుందని, నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో పనిచేసి బీఆర్ఎస్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# సేవే లక్ష్యం.. ప్రజల సంక్షేమమే ధ్యేయం!

- పేదల పాలిట ఆపద్బాంధవుడు జర్పుల భాస్కర్ నాయక్



**జడ్చర్ల, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** పేదరికం కారణంగా చదువు ఆగిపోకూడదు.. ఆర్థిక ఇబ్బందులతో వైద్యం అందక ఎవరూ బాధపడకూడదు.. తాగునీటి కోసం గ్రామీణ ప్రజలు అవస్థలు పడకూడదు.. నిరుపేద కుటుంబాలకు కష్టకాలంలో అండగా నిలవాలనే సంకల్పంతో జర్పుల భాస్కర్ నాయక్ పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. విద్య, వైద్యం, తాగునీరు, నిరుపేదలకు ఆర్థిక సహాయం, ఆలయాల నిర్మాణం వంటి కార్యక్రమాలకు తనవంతు సహకారం అందిస్తూ ప్రజలకు చేరువవుతున్నారు. జేబీఎన్ యువసైన్యం ద్వారా గ్రామాల్లోని సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి స్పందిస్తున్నారు.

**విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా**

ఆర్థిక ఇబ్బందులు విద్యార్థుల ఉన్నత చదువులకు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో భాస్కర్ నాయక్ విద్యారంగానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థుల చదువులకు ఆర్థిక సహాయం అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. గతంలో ఓ విద్యార్థి ప్రవేశ రుసుము కోసం రూ.50 వేల సహాయం అందించడంతోపాటు సివిల్ సర్వీసెస్‌కు సిద్ధమవుతున్న ఇద్దరు విద్యార్థులకు చేయూతనిచ్చారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు అవసరమైన సహకారం అందించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు.

**ఆపదలో ఉన్నవారికి వైద్య సహాయం**

అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేని నిరుపేదలకు అండగా నిలుస్తున్నారు. వైద్య సహాయం కోసం తనను సంప్రదించిన వారికి సాధ్యమైనంత మేర సహకారం అందిస్తున్నారు. గతంలో శ్వాసకోశ సమస్యతో బాధపడుతున్న ఓ వ్యక్తికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. శ్వాసకోశ సంబంధిత వైద్య పరికరం అందించేందుకు జేబీఎన్ యువసైన్యం ద్వారా హామీ ఇచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలవడం ఆయన సేవా కార్యక్రమాల్లో ఒక భాగంగా మారింది.

**గిరిజన తండాల దాహార్తి తీర్చేందుకు కృషి**

గ్రామీణ ప్రాంతాలు, గిరిజన తండాల్లో తాగునీటి సమస్యల పరిష్కారానికి భాస్కర్ నాయక్ ప్రత్యేకంగా చొరవ చూపుతున్నారు. మోతుకులకుంట తండాలో ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యను గుర్తించి సొంత నిధులతో బోరు వేయించారు. స్వయంగా తండాను సందర్శించి బోరు ద్వారా నీటి లభ్యతను పరిశీలించారు. గతంలో ఇతర తండాల్లోనూ తాగునీటి కోసం బోర్ల ఏర్పాటుకు సహకరించారు. తాగునీటి సమస్యల పరిష్కారానికి ఆయన చేస్తున్న కృషిని ఆయా తండాల ప్రజలు అభినందిస్తున్నారు.

**నిరుపేద మహిళకు ఇంటి నిర్మాణంలో చేయూత**

బాలానగర్ మండలం పెద్దాయిపల్లి తండా గ్రామపంచాయతీ పరిధిలోని గోరిగడ్డ తండాకు చెందిన వి.అంజమ్మ ఆర్థిక ఇబ్బందులతో ఇంటి నిర్మాణం చేసుకోలేకపోతున్న విషయాన్ని జేబీఎన్ యువసైన్యం సభ్యులు భాస్కర్ నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె పరిస్థితిని తెలుసుకున్న ఆయన ఇంటి నిర్మాణానికి రూ.50 వేల నగదుతోపాటు 50 బస్తాల సిమెంట్ అందిస్తానని హామీ ఇచ్చారు. కష్టకాలంలో సహాయం చేసేందుకు ముందుకు వచ్చిన ఆయనకు అంజమ్మతోపాటు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

**ఆలయాల అభివృద్ధికి రూ.1.62 లక్షల విరాళం**

ప్రజల సంక్షేమ కార్యక్రమాలతోపాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు భాస్కర్ నాయక్ సహకారం ప్రకటిస్తున్నారు. ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి సహకరించాలని స్వచ్ఛంద సేవకులు కోరగా వెంటనే స్పందించి రూ.51 వేల విరాళం ప్రకటించారు. స్వయంగా ఆలయం వద్దకు వచ్చి నగదు అందజేస్తానని హామీ ఇచ్చారు.అలాగే ఉటకుంట గ్రామపంచాయతీ పరిధిలోని రాంజీ తండాలో హనుమాన్ ఆలయాన్ని సందర్శించిన ఆయన నూతన ఆలయ నిర్మాణానికి రూ.1,11,111 విరాళం అందిస్తానని ప్రకటించారు. రెండు ఆలయాల నిర్మాణానికి కలిపి రూ.1,62,111 సహాయం ప్రకటించడంపై ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

**ప్రజలకు వారధిగా జేబీఎన్ యువసైన్యం**

గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి భాస్కర్ నాయక్ దృష్టికి తీసుకెళ్లడంలో జేబీఎన్ యువసైన్యం సభ్యులు కీలకంగా వ్యవహరిస్తున్నారు. నిరుపేదల ఆర్థిక ఇబ్బందులు, విద్యార్థుల చదువులు, అనారోగ్య సమస్యలు, తాగునీటి అవసరాలను తెలుసుకుని సహాయం అందేలా కృషి చేస్తున్నారు. గ్రామాల్లోని స్వచ్ఛంద సేవకులు, యువకుల సహకారంతో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు.

**ప్రచారం కంటే ప్రజాసేవకే ప్రాధాన్యం**

నిరుపేదలకు ఆర్థిక సహాయం, విద్యార్థులకు ప్రోత్సాహం, వైద్య అవసరాలకు చేయూత, గిరిజన తండాలకు తాగునీటి సౌకర్యం, ఆలయాల అభివృద్ధి వంటి కార్యక్రమాలతో భాస్కర్ నాయక్ తన సేవలను విస్తరిస్తున్నారు. సమస్యను తన దృష్టికి తీసుకువచ్చిన వెంటనే స్పందిస్తూ ప్రజలకు అండగా నిలిచేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆయన సేవా కార్యక్రమాల పట్ల లబ్ధిదారులు, గ్రామస్తులు కృతజ్ఞతలు వ్యక్తం చేస్తున్నారు.

**కష్టాల్లో ఉన్నవారికి అండగా.. సేవలో ముందడుగు!**

విద్యకు ప్రోత్సాహం.. వైద్యానికి చేయూత.. తండాలకు తాగునీరు.. నిరుపేదలకు ఆర్థిక భరోసా.. ఆలయాల నిర్మాణానికి సహకారం.. ఇదే జర్పుల భాస్కర్ నాయక్ చేపడుతున్న సేవా కార్యక్రమాల లక్ష్యం.

# పుట్టినరోజు సందర్భంగా నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ

**మంథని, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** మంథని మండలం ఎక్లాస్ పూర్ గ్రామానికి చెందిన చిన్నారి తాటి సాయి వర్ధన్ 5 వ పుట్టినరోజు వేడుకలను సేవా కార్యక్రమంతో ఘనంగా జరుపుకున్నారు. ఎక్లాస్ పూర్ గ్రామానికి చెందిన పీసీ విజయకుమారస్వామి కుమారుడు చిన్నారి సాయివర్ధన్ పుట్టినరోజు సందర్భంగా నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.శనివారం మంథని సిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంథని సీఐ బుద్దే స్వామి, ఎస్ఐ సందీప్ కుమార్ చేతుల మీదుగా ఎక్లాస్ పూర్ గ్రామానికి చెందిన 5 నిరుపేద కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి 9 రకాల నిత్యవసర వస్తువులతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. బియ్యం, నూనె, పప్పు, కారం, మసాలా, చక్కెర, చాపత్త, సబ్బులు, టూత్ పేస్ట్, తదితర సరుకులను అందజేశారు.ఈ సందర్భంగా సీఐ బుద్దే స్వామి మాట్లాడుతూ.. చిన్న వయసులోనే చిన్నారికి సేవా గుణాన్ని నేర్పించడం అభినందనీయమని, తల్లిదండ్రులను కొనియాడారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. చిన్నారి తండ్రి తాటి విజయకుమారస్వామి (పీసీ విజయ్) మాట్లాడుతూ.. తన కుమారుడు సాయివర్ధన్ 5వ పుట్టినరోజు సందర్భంగా పేదలకు సహాయం చేయాలనే ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. పుట్టినరోజు అంటే కేవలం కేక్ కట్ చేయడం, వేడుకలు చేసుకోవడం మాత్రమే కాకుండా, ఇతరులకు సహాయం చేసే గుణాన్ని చిన్నప్పటి నుండే నేర్పించాలనే ఉద్దేశంతోనే నిత్యవసర సరుకులు పంపిణీ చేశామని అన్నారు. తమ కుమారుడు భవిష్యత్తులో ఉన్నతంగా ఎదగాలని, సమాజ సేవలో ముందుండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## తె.యూ.లో హెచ్ఐవీ, లైంగిక సంక్రమణ వ్యాధులపై అవగాహన

**నిజామాబాద్, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** జిల్లాలో రోగి భద్రత ( పేషంట్ సేఫ్టీ) వారోత్సవాలు 14-09-2026 నుండి 29-09-2026 వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు తెలిపారు.ఈ సందర్భంగా కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ వారి ఆదేశానుసారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రులు, ఇతర ఆరోగ్య సంస్థల్లో రోగుల భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రోగులకు సురక్షితమైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడం, వైద్య సేవల సమయంలో సంభవించే అనుకోని ప్రమాదాలను నివారించడం, భద్రతపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, పారామెడికల్ సిబ్బంది మరియు ఇతర ఆరోగ్య సిబ్బంది రోగి గుర్తింపు, సరైన మందుల వినియోగం, ఇన్ఫెక్షన్ నియంత్రణ, శస్త్రచికిత్స భద్రత, సురక్షితమైన రక్త మార్పిడి, వైద్య పరికరాల సురక్షిత వినియోగం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డాక్టర్ డి. రామారావు సూచించారు.అలాగే, ఆసుపత్రుల్లో చేతుల పరిశుభ్రత పాటించడం, బయోమెడికల్ వ్యర్థాలను నిబంధనల ప్రకారం నిర్వహించడం, మందుల విషయంలో




అప్రమత్తంగా ఉండటం, రోగులకు మరియు వారి సహాయకులకు అవసరమైన సమాచారాన్ని స్పష్టంగా అందించడం ద్వారా రోగి భద్రతను మరింత బలోపేతం చేయవచ్చని తెలిపారు.ప్రతి ఆరోగ్య సంస్థలో పేషంట్ సేఫ్టీకి సంబంధించిన అవగాహన కార్యక్రమాలు, సిబ్బందికి శిక్షణ, పోస్టర్లు/కరపత్రాల ద్వారా ప్రచారం మరియు ఇతర ఐఈసి కార్యక్రమాలు నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు."రోగి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత – సురక్షితమైన వైద్య సేవలే నాణ్యమైన వైద్య సేవలకు పునాది" అని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు పేర్కొన్నారు.

## చాకలి ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకోవాలి

**ఎల్బీనగర్, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఎల్బీనగర్ లోని చింతలకుంట చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మహాజనసోషలిస్ట్ పార్టీ సరూర్ నగర్ మండలం అధ్యక్షులు భీం రాజ్ వడ్డెర ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ నాయకులు పాల్గొని ఐలమ్మ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు బత్తిన సుధాకర్ మాట్లాడుతూ.. తెలంగాణా రైతాంగా సాయుద పోరాటంలో భూస్వామ్య దొరల అరాచకాలకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన వీర వనిత అని అన్నారు.ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు.అమరవీరుల పోరాట త్యాగాలను నేటి తరానికి తెలియచేయలన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి కన్వీనర్ జిల్లా బత్తిన సుధాకర్ మాదిగ, మాజీ ఎల్బీనగర్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి క్రాంతి



కుమార్ మాదిగ,అనంత నరసింహ మాదిగ ఎంఎస్పీ మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షులు, నర్రా శ్రీనివాసు మాదిగ ఎంఎస్పీ డివిజన్ నాయకులు శివ పద్మశాలి,భీంరాజ్. వడ్డెర ఎంఎస్పీ సరూర్ నగర్ మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## తె.యూ.లో చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలు





**నిజామాబాద్, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ** తెలంగాణ విశ్వవిద్యాలయం బి.సి.సెల్ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లో ఘనంగా నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ ప్రిన్సిపాల్ ఆచార్య జి.రాంబాబు హాజరై మాట్లాడుతూ....చాకలి ఐలమ్మ పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు నిత్య జీవితంలో ఆమె ఆశయాలను సాధించేందుకు పోరాడాలని పిలుపునిచ్చారు. యూనివర్సిటీ బి.సి.సెల్ డైరెక్టర్ ఆచా ర్య ఆరతి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని తద్వా రా సమాజ పురోగతికి పాటుపడాలని హితవుపలికారు.ఈ కార్యక్రమంలో బి.ఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ డా.సాయిలు, డా.అతీక్, నీలిమ,కిరణ్ రాథోడ్, గంగాకిషన్, ఆనంద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## మోడీ పాలనను నిరసిస్తూ జైల్ భరో

- **ధరల నియంత్రణలో విఫలం**
- **రేవంత్, హామీలు అమలు చేయకపోతే ఆందోళన**
- **అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి**
- **సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో బాగం**

**ఖమ్మం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :**

మోడీ పాలనను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా విస్తృత పద్ధతుల్లో ఆందోళన నిర్వహించనున్నట్లు సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. అక్టోబర్, నవంబర్ మాసాల్లో మోడీ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరుస్తూ డిసెంబర్ రెండు, మూడు, నాలుగు తేదీలలో జైల్భరో కార్యక్రమాన్ని నిర్వహించి ఐదు లక్షల మంది అరెస్టు కానున్నట్లు ఆయన తెలిపారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం శనివారం ఏనుగు గాంధీ అధ్యక్షతన స్థానిక గిరిప్రసాద్ భవన్లో జరిగింది. సమావేశంలో బాగం మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ రంగ సంస్థలను బిజెపి అనుబంధ సంఘాలుగా మార్చివేశారని సిబిఐ, ఎన్ఫోర్స్మెంట్, ఎన్నికల సంఘం సహా వివిధ సంస్థలు 'స్వతంత్రతను కోల్పోయాయన్నారు. బిజెపి పాలన ప్రజలకు వ్యతిరేకంగా సాగుతుందని ఆయన ఆరోపించారు. కార్పొరేట్ల కోసం సాగుతున్న ఈ పాలనను నిరసిస్తూ ఆందోళన చేపట్టనున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన అందరికి ఇండ్లు ఇవ్వాలని హేమంతరావు డిమాండ్ చేశారు. కేవలం కాంగ్రెస్ పార్టీ సిఫారసు చేసిన వారికి మాత్రమే ఇండ్లు ఇచ్చి అసలైన పేదలకు అన్యాయం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా కొన్ని హామీలకు సంబంధించి కనీసం ఊసెత్తడం లేదన్నారు. హామీల అమలుకు కార్యాచరణ ప్రకటించాలని హేమంతరావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో భూ బాగోతం నడుస్తుందని అధికార, విపక్షాల మధ్య విమర్శ, ప్రతి విమర్శలలో ప్రజా సమస్యలు పక్కదారి పడుతున్నాయన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పరస్పర ఆరోపణల ద్వారా అక్రమ ఆస్తుల వ్యవహారం వెలుగు చూస్తుందని కానీ పేదల




సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. కళ్యాణ లక్ష్మి , షాదీము బారక్ లతో పాటు కాంగ్రెస్ ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటి అమలు కాలేదని ఆయన తెలిపారు. ఎల్నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది రైతులకు తీవ్ర నష్టం వాటిల్లనుందని రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రత్యేక కార్యాచరణను ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. వర్షాల కారణంగా వృథాగా పోతున్న వర్షపు నీటిని చెరువులకు మళ్లించి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నీటిని సంరక్షించాలని ఆయన కోరారు. సాగర్ ఎడమ కాలువ ద్వారా జిల్లాలో చెరువులు, కుంటలు నింపాలని ఇందు కొరకు ఒక ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. అనేక దశాబ్దాలుగా పేదలు, దళితులు సాగు చేసుకుంటున్న భూములపై వారికే హక్కు కల్పించాలని –ఆయన కోరారు. ఐదారు దశాబ్దాలుగా పేదలు సాగు చేసుకుంటున్న భూములను ప్రభుత్వ భూములుగా చూపడం అన్యాయమన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యులను బతకనియని స్తితిని నెట్టివేశాయని ఆయన తెలిపారు. ఒక పక్క సంక్షేమ పథకాలు నిలిచిపోయి మరో పక్క నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆరోపించారు. భారత కమ్యూనిస్టు పార్టీ ప్రజల పక్షాన సమరశీల పోరాటాలకు సిద్ధమైందని ఆయన ప్రకటించారు. ఒక పక్క పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేస్తూ మరో పక్క ప్రజా ఉద్యమ నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు హేమంతరావు తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ కార్యక్రమాల నివేదికను ప్రవేశపెట్టగా ఈ సమావేశంలో సిపిఐ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి పాల్గొన్నారు.

## ప్రకృతి ఆరోగ్యంమే మన ఆరోగ్యం - మంజుల పత్తిపాటి

**నేటి శుభోదయ :** పచ్చని ప్రకృతి – ఆరోగ్య జీవితంపచ్చని ప్రకృతి – ఆరోగ్య జీవితంపచ్చని చెట్లు మనకు ప్రాణం,ప్రకృతే మన జీవన గానం.స్వచ్ఛమైన గాలి, నిర్మల జలం,అవే మన ఆరోగ్యానికి అమృత బలం చెట్టుచెట్లను పెంచుతాం కాలుష్యాన్ని దూరం చేద్దాం, ప ర్యావ ర ణాన్ని కాపాడుదాం..!మొక్కలను నాటుదాం నాట్టిద్దాం భవిత తరాలకు బాటను వేయుదాం..!ప్రకృతి ఆరోగ్యంగా ఉంటేనే,మన ఆరోగ్యంగా ఉంటాం... చెత్తను చెత్త డబ్బాలో వేద్దాం..మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం..!ప్రపంచ పర్యావరణ ఆరోగ్య దినోత్సవ శుభాకాంక్షలురచన : మంజుల పత్తిపాటి మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్. తెలంగాణ రాష్ట్రం.



## 47 ఏళ్ల తర్వాత క్లాస్‌మేట్ ఫోన్

- **భావోద్వేగంలో మునిగిన జర్నలిస్ట్**

**ఖమ్మం, ఇల్లందు, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** 47 ఏళ్ల క్రితం డిగ్రీ చదువుతో విడిపోయిన క్లాస్‌మేట్ నుండి వచ్చిన ఒక ఫోన్ కాల్ ఇల్లందులో స్థిరపడిన సీనియర్ జర్నలిస్ట్ ఎస్.వి.సూర్య నారాయణను భావోద్వేగానికి గురిచేసింది. వివరాల్లోకి వెళితే సూర్యనారాయణ స్వగ్రామం పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు. ఆయన 1976–79 సంవత్సరాల్లో కర్నూల్ లోని సిల్వర్ జూబ్లీ డిగ్రీ కాలేజీలో బీకాం చదివారు. అదే కళాశాలలో, అదే తరగతిలో చదివిన జె. చంద్రశేఖర్ (స్వగ్రామం పత్తికొండ, కర్నూలు జిల్లా) ఆయనకు ప్రాణ స్నేహితుడు.డిగ్రీ పూర్తయ్యాక ఇద్దరి దారులు వేరయ్యాయి. సూర్యనారాయణ ఇల్లందుకు వచ్చి జర్నలిస్టుగా స్థిరపడ్డారు. చంద్రశేఖర్ కర్నూలు జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగంలో చేరి ఇటీవల పదవీ విరమణ చేశారు. డిగ్రీ తరువాత 47 ఏళ్లుగా ఇద్దరి మధ్య ఎలాంటి సంబంధం లేకుండా పోయింది.ఇటీవల చంద్రశేఖర్ తన మిత్రుని ద్వారా సూర్యనారాయణ ఫోన్ నెంబర్ తెలుసుకుని అతనికి ఫోన్ చేయటంతో ఒక్కసారిగా అతను ఆనందాశ్చర్యాలకు లోనయ్యారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్న ఇరువురు చాలాసేపు కళాశాల రోజులు, అధ్యాపకులు, సహ విద్యార్థులను గుర్తు చేసుకున్నారు. స్నేహంలోని మాధుర్యం, గొప్పతనం ఈ సంఘటన రుజువు చేస్తోంది. అందుకే అన్నారు 'బాల్యస్నేహం బంగారం వంటిది. ఎంతకాలమైనా దాని వన్నె తగ్గదు' అని.

## తిరువూరు ఎం వి ఎస్ నర్సింగ్ హోమ్ సీజ్

**ఖమ్మం, కల్లూరు, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** ఈ ఒక్క నెలలోనే వారం రోజుల్లో ఇద్దరు పేషెంట్స్ మృతి. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ట్రీట్మెంట్ చేయొద్దని ఆదేశం. ఎం వి ఎస్ సర్జికల్ అండ్ మెటర్నిటీ నర్సింగ్ హోమ్ లో మహిళ మృతి. డెలివరీ తర్వాత మృతి చెందిన దీప్తి. డెంటల్ డాక్టర్ గా పని చేస్తున్న దీప్తి. వారం క్రితం ఇదే ఆస్పత్రిలో ఆపరేషన్ వికటించి కుమారి మృతి. నర్సింగ్ హోమ్ నడుపుతున్న డాక్టర్ రమేష్ తెలంగాణలోని కల్లూరు ప్రభుత్వ ఆస్పత్రిలో సూపరింటెండెంట్ గా పనిచేస్తున్న రమేష్. గతంలోనూ డాక్టర్ రమేష్ చేసిన ఆపరేషన్లు వికటించి రోగులు మృతి. మృతుల కుటుంబీకులకు డబ్బులు ఇచ్చి సెటిల్మెంట్ చేసుకుంటున్నట్లు ఆరోపణలు. డాక్టర్ రమేష్ మద్యం తాగి ఆపరేషన్లు చేస్తారనే ఆరోపణలు ఉన్నాయి.

## చాకలి ఐలమ్మకు ఘన నివాళులు అర్పించిన ఖమ్మం నగర బీఆర్ఎస్ పార్టీ

**ఖమ్మం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** వీరనారి చాకలి ఐలమ్మ 131 వ జయంతి సందర్భంగా ఖమ్మం నగర బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న పాత ధర్నా చౌక్‌లోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం నగర బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు పగడాల నాగరాజు, మాజీ ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, పార్టీ నాయకులు పాల్గొని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా పగడాల నాగరాజు మాట్లాడుతూ చాకలి ఐలమ్మ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, ధైర్యానికి ప్రతీకగా నిలిచారని అన్నారు. భూమి, హక్కులు, ఆత్మగౌరవం కోసం ఆమె చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోయిందన్నారు. ఐలమ్మ స్ఫూర్తితో బడుగు, బలహీన వర్గాలు మరియు మహిళలు తమ హక్కుల కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో బీసీ సెల్ నగర మాజీ అధ్యక్షులు మేకల సుగుణ రావు, మాజీ ప్రచార కార్యదర్శి షకీన, బీఆర్‌టీయూ జిల్లా నాయకులు, పాషా, తంగేళ్ల శ్రీను, తోడేటి లింగరాజు, వాంకుడోత్ సురేష్, ముజాహిద్, వాకదాని కోటేశ్వరరావు, ఉస్మాన్, వల్లూరి విజయ్, కందాల వీరేందర్, పోలే పొంగు వెంకట్, మాచర్ల వేలాద్రి, నాగేశ్వరరావు, బురాన్, ఫిరోజ్, మోటే కుమార్, ప్రవీణ్, నయీమ్, శైలజ, తాజముల్లా, సాజీద్ , యాదగిరి, నరేష్, సోహెల్, నేరెళ్ల దరగయ్య, పగిళ్లపల్లి రాజు, వట్టి కోట అప్పారావు, గోకినపల్లి వంశీ, మిట్టపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు. చాకలి ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు, సామాజిక న్యాయం, సమానత్వం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.



# ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం వేడుకలు

- జిల్లా పర్యాటకశాఖ ఆధ్వర్యంలో పులిగుండాల ఎకో టూరిజం ప్రాజెక్టుకు ఒక్కరోజు ప్యాకేజీ టూర్






**ఖమ్మం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** జిల్లా పర్యటన శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆదేశాను సారం ఖమ్మం సోషల్ వెల్ఫేర్ పాఠశాల బాలికలను పులిగుండాల ఎకో ప్రాజెక్టు కు శనివారం టూర్ కు తీసుకొని వెళ్లడం జరిగింది. అక్కడ ఫారెస్ట్ డిపార్ట్మెంట్ వారి ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఎకో టూరిజంలో ఫారెస్ట్ లోకి ట్రాకింగ్ తీసుకెళ్లడం జరిగింది . వారికి పులి గుండాల ఎకో ప్రాజెక్టు విశిష్టతను అక్కడ ఉన్న మొక్కలు జంతువులు గురించి పర్యావరణం గురించి, ప్లాస్టిక్ వంటి వ్యర్థ పదార్థాల వల్ల పర్యావరణం కు అటవీ జంతువులకు జరిగే నష్టాన్ని పిల్లలకు అధికారులు వివరించారు. ఇలాంటి టూర్లు పిల్లలకు మానసిక ప్రశాంత తకు. ఏకాగ్రతకు ఉపయోగపడుతుం దని తెలిపారు. మనం నివసిస్తున్నటువంటి ప్రాంతం నుండి వేరే ప్రాంతంలోకి వెళ్లి అక్కడ ఉన్నటువంటి విశేషాలను తెలుసుకోవడమే టూరిజం అని దీని ద్వారా కొత్త విషయాలు తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా పిల్లలు ట్రెక్కింగ్ మంచిగా ఎంజాయ్ చేశారు . ఈ యొక్క కార్యక్రమంలో జిల్లా పర్యాటక్షక అధికారి సుమన్ చక్రవర్తి, తల్లాడ ఫారెస్ట్ రేంజ్ అధికారి ఉమా, సెక్షన్ ఆఫీసర్ కవిత, బీట్ ఆఫీసర్ కేశవరావు, సోషల్ వెల్ఫేర్ విద్యార్థుల స్టాఫ్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు కెరీర్ ప్రణాళికపై అవగాహన అవసరం



**ఖమ్మం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల, ఖమ్మంలో విద్యార్థినుల భవిష్యత్ విద్యా, ఉద్యోగ, కెరీర్ అవకాశాలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక కౌన్సెలింగ్, కెరీర్ మార్గదర్శక కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పిఎస్ఎన్ మూర్తి, ఐడిఏఎస్, మాజీ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్, యుఐడిఏఐ (Aadhaar) పాల్గొని విద్యార్థినులకు విలువైన సూచనలు, మార ్గ ద ర ్శకాలు అందించారు. మరో ముఖ్య అతిథిగా వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్, ఉస్మానియా యూనివర్సిటీ డెంటల్ కాలేజీ పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థినులకు సబ్జెక్ట్ నాలెడ్జ్, జనరల్ నాలెడ్జ్, అప్లికేషన్ నాలెడ్జ్ ప్రాధాన్యతను వివరించారు. కేవలం పాఠ్యపుస్తక పరిజ్ఞానానికే పరిమితం కాకుండా, నేర్చుకున్న విషయాలను ఆచరణలో అన్వయించుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.అలాగే అకడమిక్ పరీక్షలతో పాటు పోటీ పరీక్షల్లో విజయానికి అవసరమైన ప్రణాళిక, నిరంతర అధ్యయనం, సమయపాలన, లక్ష్య నిర్దేశం, కెరీర్ ప్లానింగ్ వంటి అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. తమ ఆసక్తి, ప్రతిభకు అనుగుణంగా ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలను ముందుగానే గుర్తించి సరైన దిశలో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు.విద్యార్థినులు అతిథులతో తమ సందేహాలను పంచుకొని, విద్య, పోటీ పరీక్షలు, ఉన్నత విద్య, కెరీర్ అవకాశాలకు సంబంధించిన పలు ప్రశ్నలకు సమాధానాలు పొందారు.కార్యక్రమం విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు, భవిష్యత్ లక్ష్యాలపై స్పష్టతను కల్పించే విధంగా సాగింది. కళాశాల ప్రిన్సిపాల్ సునీత, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థినులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం : ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్



**ఖమ్మం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వీరనారి చాకలి ఐలమ్మ గారి 131వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ నిజాం రాచరిక పాలన, గడీల పాలన, దొరల అరాచకత్వం కొనసాగుతున్న రోజుల్లో బలహీన వర్గాల కుటుంబంలో జన్మించినప్పటికీ వెనుకడుగు వేయకుండా విసునూరు దేశ్‌ముఖ్ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ అని కొనియాడారు. దొరల ముందు సామాన్యులు తలెత్తి మాట్లాడలేని పరిస్థితుల్లో సింహంలా గర్జించి, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా, దొరల దోపిడీ పాలనకు వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో స్ఫూర్తిదాయక ఘట్టమని అన్నారు. ఆమె పోరాట స్ఫూర్తితోనే దొడ్డి కొమురయ్య ఆత్మార్పణతో తెలంగాణ సాయుధ పోరాటం మరింత ఉవ్వెత్తున ఎగిసిందని పేర్కొన్నారు. సమైక్య పాలనలో చరిత్రలో మరుగునపడిన తెలంగాణ వీరుల త్యాగాలకు ప్రత్యేక గుర్తింపు, గౌరవం కల్పించిన ఘనత తెలంగాణ రాష్ట్ర సాధన అనంతరం కేసీఆర్ ప్రభుత్వానిదేనని తాతా మధుసూదన్ అన్నారు. చాకలి ఐలమ్మ జయంతిని అధికారికంగా నిర్వహించేలా గుర్తింపు కల్పించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దేనని తెలిపారు. “తెలంగాణ అంటే కేసీఆర్, కేసీఆర్ అంటే తెలంగాణ” అని పేర్కొన్న ఆయన, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 14 ఏళ్ల పాటు గులాబీ జెండా నాయకత్వంలో అలుపెరగని పోరాటం చేసి ఢిల్లీ మెడలు వంచి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఘనత కేసీఆర్ దేనన్నారు.వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని, ఆమె ఆశయాలు, త్యాగాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. చాకలి ఐలమ్మ వారసత్వాన్ని అందిపుచ్చుకొని, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, కేసీఆర్ నాయకత్వాన్ని తిరిగి బలోపేతం చేసే దిశగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పగడాల నాగరాజు, కనగాల వెంకటరావు, నాయకులు బొమ్మెర రామ్మూర్తి, బిచ్చాల తిరుమలరావు, బంక మల్లయ్య, పోగుల శీను, చిత్తారు సింహాద్రి, పగడాల నరేందర్, లింగనబోయిన సతీష్, బలుసు మురళీ కృష్ణ, సద్దాం, యలమద్ది రవి, రఫీ, నరసింహారావు, దరిపెల్లి వీరబాబు, చీకటి రాంబాబు, బురహాన్, పోలెపొంగు వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

# వేడుకగా ఆర్జేసి డిగ్రీకళాశాల ఫ్రెషర్స్ డే







**ఖమ్మం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** స్థానిక ఆర్జేసి డిగ్రీ కళాశాల ఫ్రె షర్స్ డే శనివారం నగరంలోని ఓ ప్రవేట్ ఫంక్షన్ హాల్ లో వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ హాజరయ్యారు. తొలుత ఆయన జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు .ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో లక్ష్యాన్ని ఏర్పరచుకొని ప్రణాళిక ప్రకారం కష్టపడితే దేనినైనా సాధించవచ్చన్నారు. 28 సంవత్సరాల క్రితం ప్రారంభించిన ఆర్జేసి డిగ్రీ కళాశాల తన ప్రస్థానంలో అనేక విజయాలు సాధించిందని తెలిపారు.తమ కళాశాల కు చెందిన అనేక మంది విద్యార్థులు సైంటిస్టు, విద్యా, కళా,క్రీడా,వ్యాపార,రాజకీయ,ప్రభుత్వ ఉద్యోగ రంగాలలో స్థిర పడి ఉన్నారని తెలిపారు.దీనితో పాటు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన ఘనత ఆర్జేసిదేనన్నారు. డిగ్రీ స్థాయి లో బహుళ జాతి కంపెనీల్లో ప్లేస్మెంట్ లు సాధించిన ఘనత కూడా తమ కళాశాలకే దక్కుతుందన్నారు. ఇప్పటి వరకు కళాశాల విద్యార్థులు సాగించిన విజయ పరంపరను ప్రస్తుత సంవత్సరం విద్యార్థులు కూడా కొనసాగించాలని సూచించారు.దీనికి విద్యార్థులు నిరంతరం కళాశాలకు హాజరవుతూ ఉపాధ్యాయులు చెప్పినదాన్ని అర్థం చేసుకుని ప్రణాళిక ప్రకారం కష్టపడితే సాధించ వచ్చన్నారు. నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తు అని,ఆదిశ లోనే ఇప్పటి వరకు తమ విద్యార్థులు నడుచుకున్నారని, ప్రస్తుత సంవత్సరం విద్యార్థులు కూడా ఆవిధంగా ముందుకు సాగుతూ తల్లిదండ్రుల కలల ను నేరవేర్చాలని, తద్వారా మీకు పాఠాలు చెప్పిన అధ్యాపకులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.అనంతరం ఈ విద్యా సంవత్సరం పలు విభాగాలలో,పరీక్షలలో గెలుపొందిన పలువురు విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి అతిథి గా విచ్చేసిన కృష్ణను కళాశాల విద్యార్థులు ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. చివరగా విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన క్లాసికల్, వెస్టన్,బ్రేక్,గ్రూప్, సోలో తదితర డ్యాన్సులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏ.లింగయ్య, ఇన్చార్జి లు ఆంజనేయులు, సునంద తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్) లో ఘనంగా ఎన్ ఎస్ ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ఖమ్మం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఖమ్మం లో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భానోత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ శతజయంతి సందర్భంగా 1969లో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ప్రారంభించబడిందని తెలిపారు. విద్యార్థుల్లో సేవాభావం, సామాజిక బాధ్యత, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే ఎన్ఎస్ఎస్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ – 1 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కే. కవిత మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ 2 ప్రోగ్రాం ఆఫీసర్ రామకుమార స్వామి మాట్లాడుతూ విద్యార్థులు సమాజ సమస్యలను అర్థం చేసుకొని వాటి పరిష్కారంలో చురుకుగా భాగస్వాములు కావాలని సూచించారు. "నాట్ మీ, బట్ యూ" అనే ఎన్ఎస్ఎస్ నినాదానికి అనుగుణంగా సేవా కార్యక్రమాలను కొనసాగించాలని అన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్స్ నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను క్లీన్ అండ్ గ్రీన్, మొక్కలు నాటడం, ర్యాలీలు, మోటివేషన్ ప్రోగ్రామ్స్, స్టూడెంట్స్ అవేర్నెస్ ప్రోగ్రామ్స్, ప్రముఖ వ్యక్తుల జయంతి, వర్ధంతి ఉత్సవాలు, షీ టీం ప్రోగ్రామ్స్, డ్రగ్స్ అవేర్నెస్ ప్రోగ్రామ్స్, రోడ్ సేఫ్టీ లాంటి వివిధ కార్యక్రమాలను విద్యార్థులకు ప్రదర్శించారు. జంతు శాస్త్ర ఆచార్యులు డాక్టర్ రవిశంకర్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కళాశాలను పరిశుభ్రంగా ఉంచడంలో కీలక బాధ్యత వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ సావిత్రి, సూర్యలక్ష్మి , హర్ష , హేమలత , అశోక్ పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాట పటిమ నేటితరానికి స్ఫూర్తిదాయకం : జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

- సమాజంలో వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పోరాడిన ఐలమ్మ చరిత్ర చిరస్మరణీయం
- చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలలో పాల్గొన్ని, ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన జిల్లా కలెక్టర్







**ఖమ్మం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** సమాజంలోని అసమానతలకు ఎదురొడ్డి, వెట్టిచాకిరి, దోపిడీకి వ్యతిరేకంగా నిర్భయంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని శనివారం ఖమ్మం, వైరా రోడ్డులోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సమీపంలో ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి జిల్లా కలెక్టర్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకల్లో కలెక్టర్ పాల్గొని, చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ సామాజిక అసమానతలను ప్రశ్నిస్తూ అణగారిన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ ధైర్యంగా పోరాడారని తెలిపారు. జమీందారుల పాలనలో కొనసాగిన వెట్టిచాకిరి, దోపిడీకి వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం ప్రజల్లో చైతన్యాన్ని నింపిందన్నారు. చాకలి ఐలమ్మ సామాజిక సేవకురాలిగా, భూ పోరాటం, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తనదైన పాత్రను పోషించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని కలెక్టర్ పేర్కొన్నారు. ఆమె పోరాట పటిమ, ధైర్యసాహసాలు మహిళా శక్తికి ప్రతీకగా నిలిచాయని, నేటి తరానికి కూడా ఆమె జీవితం ఆదర్శప్రాయమని అన్నారు.సమాజ హితం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను, వారి సేవలను భవిష్యత్ తరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తోందని కలెక్టర్ తెలిపారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తిగా నిలిచిన చాకలి ఐలమ్మ తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని, మహిళా శక్తిని చాటి చెప్పారని కలెక్టర్ అన్నారు. ఆమె ఆశయాలు, పోరాట విలువలను స్మరించుకుంటూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారిణి జి. జ్యోతి, బిసి సంఘ నాయకులు డాక్టర్ కేవీ కృష్ణారావు, తుపాకుల ఎలగొండ స్వామి, జక్కుల వెంకట రమణ, కొత్తకొండ శ్రీలక్ష్మి , తమ్మారపు బ్రహ్మయ్య, సట్టు వెంకటేశ్వర్లు, తెనాలి వీరబాబు, మాచర్ల వేలాద్రి, పగిడల కృష్ణవేణి, కణతాల నరసింహారావు, హరిప్రసాద్, వట్టికోట అప్పారావు, వల్లపు సోమరాజు, అమరగాని వెంకటేశ్వర్లు, లింగబోయిన పుల్లారావు, వెనుకబడిన తరగతుల అభివృద్ధి కార్యాలయ సిబ్బంది, బిసి కుల సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# తనికెళ్ళ గ్రామంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ ఆకస్మిక తనిఖీ





**ఖమ్మం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. డి. రామారావు బృందం శనివారం తనికెళ్ళ గ్రామంలో విస్తృతంగా పర్యటించి, పల్లె దవాఖానాను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె దవాఖానాలో అందుతున్న వైద్య సేవలు, రికార్డుల నిర్వహణ, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలు, టీకా కార్యక్రమం (యుఐపి) తదితర అంశాలను పరిశీలించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు నిరంతరం అందేలా సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని డీఎంఅండ్‌హెచ్ఓ ఆదేశించారు.అనంతరం ఎస్ సి హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులకు అందుతున్న వసతులు, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ముఖ్యంగా బాలికలకు హెచ్ పి వి టీకా ప్రాధాన్యతను వివరించి, సర్వైకల్ క్యాన్సర్ నివారణలో హెచ్ పి వి వ్యాక్సిన్ ఉపయోగకరంగా ఉంటుందని అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల కిచెన్ రూమ్‌ను పరిశీలించి పరిశుభ్రత, ఆహార తయారీ విధానాలను పరిశీలించారు.ఈ సందర్భంగా మండల ప్రజావాణిలో స్వీకరించిన గ్రీవెన్స్ పిటిషన్లపై ఏ టి ఆర్ ను వెంటనే సమర్పించాలని సిబ్బందిని ఆదేశించారు. కుక్క కాటు, నెలవారి నివేదికలను,నిర్ణీత సమయంలో జిల్లా ఆఫీసులో సమర్పించాలని సూచించారు. అవసరమైన సందర్భాల్లో గర్భిణులను సకాలంలో గవర్నమెంట్ ఆసుపత్రికి రిఫర్ చేయాలని, సూచించారు, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సాధించేందుకు క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేసి, ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డా. డి. రామారావు సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# కొండముచ్చు దాడిలో ఎలక్ట్రిషన్‌కు గాయం



**ఖమ్మం, కల్లూరు, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** కల్లూరు పట్టణంలో కొండముచ్చుల సంచారం ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. తాజాగా కల్లూరు మెయిన్‌రోడ్డులో విద్యుత్ పనులు చేస్తున్న ఓ ఎలక్ట్రిషన్‌పై కొండముచ్చు అకస్మాత్తుగా దాడి చేయడంతో అతడి చేతికి తీవ్ర గాయాలయ్యాయి. ఊహించని విధంగా జరిగిన ఈ ఘటనతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు.పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొండముచ్చులు సంచరిస్తున్నప్పటికీ వాటి నియంత్రణకు సంబంధిత అధికారులు,మున్సిపల్ పాలకవర్గం తగిన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారులు, నివాస ప్రాంతాలు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాల్లోనే కొండముచ్చులు సంచరిస్తుండటంతో ప్రజలు, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు బయటకు రావాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొందని అంటున్నారు.ఇప్పటికే పలువురు కొండముచ్చుల దాడులకు గురవుతున్నప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకపోవడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ఇంకెందరు గాయపడాలి? ఏదైనా ప్రాణనష్టం జరిగే వరకు అధికారులు స్పందించరా? అంటూ కల్లూరు పట్టణ ప్రజలు, మేధావులు, విద్యార్థులు చర్చించుకుంటున్నారు.ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ అధికారులు, అటవీశాఖ అధికారులు సమన్వయంతో కొండముచ్చుల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. సమస్యను నిర్లక్ష్యం చేయకుండా శాశ్వత పరిష్కార మార్గాలను అన్వేషించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# నకిలీ ఎరువులు విక్రయిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయి



**ఖమ్మం, నేలకొండపల్లి, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** నకిలీ ఎరువులను విక్రయిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని మండల వ్యవసాయాధికారి యం.రాధ హెచ్చరించారు. మండల కేంద్రం లోని వివిధ ఎరువుల దుకాణాలను శనివారం ఆకస్మికంగా తనీఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఎరువుల ధరల పట్టిక ను పరిశీలించారు. రికార్డుల ప్రకారం స్టాక్ ఉందా లేదా తెలుసుకోవటానికి గోడౌన్ లను తనీఖీ చేశారు. దుకాణాల యజమానులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. రైతులకు నకిలీ ఎరువులు విక్రయించి ఎవరైనా మోసం చేయాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఎరువుల ధరలను ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే సహించేది లేదన్నారు. రైతులు తీసుకున్న ప్రతీ బస్తాకు రశీదులు "ఇవ్వాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీరణాధికారులు, పెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ డీలర్స్ ఉన్నారు.

# ప్రభుత్వం పెసర పంట ను కొనుగోలు చేసేందుకు కేంద్రాలు ఏర్పాటు చేయాలి : దొండపాటి




**ఖమ్మం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** ప్రభుత్వం పెసర పంట కొనుగోలు చేసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం గిరి ప్రసాద్ భవన్ లో జరిగిన రైతు సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పంటలు చేతికొచ్చిన రైతు వద్ద నుండి కొనుగోలు చేయటంలో నిర్లక్ష్యం తగదని వారన్నారు. దళారీలు చేతిలో బలికాకుండా రైతుల పెసర పంట ను తక్షణమే కొనుగోలు కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం గౌరవ అధ్యక్షులు ఏపూరి రవీంద్రబాబు, రాష్ట్ర రైతు సంఘం నాయకులు మిడి కంటి వెంకటరెడ్డి, నాయకులు పావులూరి మల్లికార్జున్ రావు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం మొండివైఖరివల్లే సమ్మె అనివార్యమైంది

- ప్రజలను, బ్యాంకు ఉద్యోగులను ఇబ్బందిపెట్టే చర్యలు మానుకోవాలి
- న్యాయమైన డిమాండ్లు అంగీకరించి సమ్మెను నివారించండి
- ద్వైపాక్షిక ఒప్పందాలను రక్షించాలి
- బ్యాంక్ ఉద్యోగుల సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నాం
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా



**ఖమ్మం, కొత్తగూడెం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** బ్యాంకింగ్ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి వల్లే సమ్మె అనివార్యమై ప్రజల, బ్యాంకు ఉద్యోగులు ఇబ్బందుల్లోకి నెట్టివేయబడుతున్నారని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంక్ ఉద్యోగుల సమస్యలపై యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ చేపట్టిన దేశవ్యాప్త సమ్మెకు సంఘీభావం తెలిపారు, శనివారం మేయర్ మూడ్ గణేష్ తో కలిసి ఎస్ బి ఐ కొత్తగూడెం బ్రాంచిని సందర్శించి ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలకులు మొండివైఖరి విడనాడి ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించకపోవడంతో ఆర్థిక కార్యకలాపాలు స్తంభించి సామాన్య ప్రజలు, ఖాతాదారులు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోందని మండిపడ్డారు. వారానికి 5 రోజుల పని విధానం అమలుపై ఐబీఏ, యూనియన్ల మధ్య కుదిరిన ఒప్పందాన్ని కేంద్రం గత రెండున్నరేళ్లుగా ఆమోదించకుండా తొక్కిపెట్టడం దుర్మార్గమన్నారు. బ్యాంకింగ్ రంగంలో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ద్వైపాక్షిక ఒప్పందాలను కాపాడాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి చర్చలతో ఖరారైన పీఎల్ఐ విధానాన్ని మార్చి, కేవలం ఉన్నతాధికారులకే లబ్ధి చేకూరుస్తూ ఉద్యోగుల మధ్య అంతరాలు సృష్టించే కుట్రలను ఉపసంహరించుకోవాలన్నారు. కార్పొరేట్ శక్తులకు మేలు చేసేలా బ్యాంకింగ్ రంగాన్ని నిర్వీర్యం చేసే చర్యలను కేంద్రం వెంటనే విరమించుకోవాలని, లేనిపక్షంలో పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# ఖమ్మం జిల్లాలో గల మీ సేవలో అడుగు అడుగున అక్రమాలే

- అధికారుల బదులు అనధికార వ్యక్తుల సంతకాలే అనే అనుమానం
- ఏసీబీ తనిఖీల్లో వెలుగులోకి వస్తున్న సంచలన అంశాలు
- అధిక వసూళ్లు, మధ్యవర్తుల వ్యవహారంపై ఆరా
- తనిఖీ జరిగి నెలలు గడిచినా తదుపరి చర్యలెక్కడ?
- మీ సేవా కేంద్రం సేవలకా? మధ్యవర్తులకా?
- ప్రభుత్వ రుసుం ఎంత? ప్రజల నుంచి వసూలు చేసిందెంత?
- ఖమ్మం కేంద్రంపై ఏసీబీ గుర్తించిన అంశాలపై చర్య ఎక్కడ?
- సంతకాలు ఎవరివి? ధ్రువపత్రాలు ఎవరు తయారు చేశారు?
- ఒక కేంద్రం తనిఖీతో సమస్య ముగిసిందా?
- జర్నలిస్ట్ ల పేరుతో పలు చోట్ల మీ సేవ కేంద్రాలు
- ఖమ్మం నగరంలో ఓ ప్రధాన పత్రిక పేరుతో మీ సేవ కేంద్రం, మరోవైపు ఖమ్మం కార్పొరేషన్ లో భార్య ఉద్యోగం

**ఖమ్మం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** ప్రజలకు ప్రభుత్వ సేవలను సులభంగా, పారదర్శకంగా అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన మీ సేవా కేంద్రాల్లో నిబంధనల ఉల్లంఘనలు చోటుచేసుకుంటున్నాయా? ప్రజల దరఖాస్తులు, ధ్రువపత్రాలు, ప్రభుత్వ రుసుముల చెల్లింపులు, దరఖాస్తుల పరిశీలన వంటి కీలక ప్రక్రియల్లో అనధికార వ్యక్తుల జోక్యం ఉందా? అన్న ప్రశ్నలు ఖమ్మంలో అవినీతి నిరోధక శాఖ నిర్వహించిన ఆకస్మిక తనిఖీలతో మరోసారి తెరపైకి వచ్చాయి. 2026 ఏప్రిల్ 15న తెలంగాణవ్యాప్తంగా 13 మీ సేవా కేంద్రాల్లో ఏసీబీ ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా, ఖమ్మం కేంద్రంలో అధీకృత సిబ్బందికి బదులుగా అనధికార వ్యక్తులు ధ్రువపత్రాలపై సంతకాలు చేస్తున్నట్లు గుర్తించినట్లు ఏసీబీ ఆధారిత నివేదికలు వెల్లడించాయి. ఇది ఇలా ఉండగా ఓ మీ సేవ కేంద్రంలో ఓ ప్రధాన పత్రిక రిపోర్టర్ గా చెలామణి అవుతూ మరోవైపు తన భార్యను ఖమ్మం కార్పొరేషన్ లో ఉద్యోగం ఇప్పించుకొని, ఆ కార్యాలయంలోని విలువైన డాకుమెంట్స్ మొత్తం తన వద్దకు తెప్పించకోవడం జరుగుతుంది అనే ఆరోపణలు చోటు చేసుకున్నాయి. దీనిపై క్షేత్ర స్థాయిలో విచారణ చేపడితే మరిన్ని విషయాలు బయటకు రానున్నాయి. దీనిపై ఖమ్మం కార్పొరేషన్ కమీషనర్ ఏ చర్యలు తీసుకుంటరో వేచి చూడాలి మరి.

**--- అధికారుల బదులు అనధికార వ్యక్తుల సంతకాలా?**
ఖమ్మంలోని మీ సేవా కేంద్రంలో ధ్రువపత్రాలపై అధికారికంగా బాధ్యత కలిగిన వ్యక్తుల స్థానంలో అనధికార వ్యక్తులు సంతకాలు చేస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించినట్లు ఏసీబీ పేర్కొంది. ఒక సాధారణ ధ్రువపత్రం వెనుక ప్రజల వ్యక్తిగత సమాచారం, ఆదాయం, కులం, నివాసం, ఇతర ప్రభుత్వ సేవలకు సంబంధించిన వివరాలు ఉంటాయి. అలాంటి పత్రాల జారీ ప్రక్రియలో అధీకృత వ్యవస్థకు బయట ఉన్న వ్యక్తి జోక్యం చేసుకోవడం నిజమైతే, అది కేవలం కార్యాలయ నిబంధనల ఉల్లంఘనగా మాత్రమే కాకుండా ప్రజల పత్రాల భద్రత, ప్రభుత్వ ధ్రువపత్రాల విశ్వసనీయతకు సంబంధించిన తీవ్రమైన ప్రశ్నగా మారుతుంది.

**--- మీ సేవా కేంద్రం, సేవలకా? మధ్యవర్తులకా?**
మీ సేవా కేంద్రాల ప్రధాన ఉద్దేశం ప్రజలు నేరుగా ప్రభుత్వ సేవలు పొందేలా చేయడం. కానీ ఏసీబీ తనిఖీల్లో రాష్ట్రంలోని పలు కేంద్రాల్లో అనధికార మధ్యవర్తుల ప్రమేయం, నిర్ణీత రుసుం ల కంటే అధిక వసూళ్లు వంటి అంశాలు గుర్తించినట్లు తెలిపింది. కొన్ని కేంద్రాల్లో కేంద్రాల నిర్వాహకులు, అనధికార ఏజెంట్ల మధ్య నగదు రహిత లావాదేవీలు, సందేశాల మార్పిడికి సంబంధించిన వివరాలు కూడా తనిఖీల్లో గుర్తించినట్లు నివేదికలు పేర్కొన్నాయి.

**-- ప్రభుత్వ రుసుము ఎంత?**
ప్రజల నుంచి వసూలు చేసిందెంత?మీ సేవా కేంద్రాల్లో ప్రతి సేవకు ప్రభుత్వం నిర్ణయించిన రుసుం ఉంటుంది. దానికి మించి వసూలు చేయడం నిబంధనలకు విరుద్ధం. ఏసీబీ రాష్ట్రవ్యాప్త తనిఖీల్లో పలు కేంద్రాలు నిర్ణీత రుసుం కంటే అధికంగా వసూలు చేస్తున్నట్లు గుర్తించినట్లు పేర్కొంది. ఖమ్మం కేంద్రానికి సంబంధించి కూడా ఇప్పుడు కీలకంగా తేలాల్సింది. ప్రజల నుంచి ఏ సేవకు ఎంత వసూలు చేశారు? ప్రభుత్వం నిర్ణయించిన రుసుం ఎంత? అదనంగా ఏమైనా వసూలు చేశారా? అదనపు మొత్తానికి రసీదు ఇచ్చారా? అన్నదే తేలాల్సి ఉంది.

**--- ఖమ్మం కేంద్రంపై ఏసీబీ గుర్తించిన అంశాలపై చర్య ఎక్కడ?**
ఏసీబీ తనిఖీలు నిర్వహించడం ఒక దశ మాత్రమే. తనిఖీల్లో గుర్తించిన అంశాలపై శాఖాపరమైన విచారణ జరిగిందా? సంబంధిత కేంద్రానికి వివరణ కోరారా? అనధికార వ్యక్తులు ధ్రువపత్రాలపై సంతకాలు చేసిన అంశంపై బాధ్యులను గుర్తించారా? కేంద్రం నిర్వహణపై ఏదైనా చర్య తీసుకున్నారా? అనే ప్రశ్నలు ఇప్పుడు ముందుకు వస్తున్నాయి. తనిఖీల అనంతరం సంబంధిత కేంద్రాలపై చర్యల కోసం ప్రభుత్వానికి సమగ్ర నివేదిక పంపనున్నట్లు ఏసీబీ అప్పట్లో తెలిపింది.

**--- సంతకాలు ఎవరివి? ధ్రువపత్రాలు ఎవరు తయారు చేశారు?**
ఈ వ్యవహారంలో అసలు దర్యాప్తు ఇక్కడి నుంచే మొదలుకావాలి. ఏసీబీ గుర్తించిన ధ్రువపత్రాలు ఏ తేదీల్లో జారీ అయ్యాయి? వాటిపై సంతకాలు చేసిన వ్యక్తి అధికారికంగా ఆ బాధ్యత కలిగిన వ్యక్తేనా? కాదంటే అతను కేంద్రంలో ఏ హోదాలో ఉన్నాడు? అతనికి సంతకం చేసే అధికారం ఎవరు ఇచ్చారు? ఆ సంతకాల ఆధారంగా ఎన్ని ధ్రువపత్రాలు జారీ అయ్యాయి? అనే ప్రశ్నలకు రికార్డులే సమాధానం చెప్పాలి.

**--- దరఖాస్తు నుంచి ధ్రువపత్రం వరకు, మొత్తం ప్రక్రియను పరిశీలించాలా?**
ప్రజలు మీ సేవా కేంద్రానికి దరఖాస్తు చేసిన క్షణం నుంచి ధ్రువపత్రం అందుకునే వరకు ప్రతి దశకు నమోదు ఉంటుంది. దరఖాస్తు సంఖ్య, దరఖాస్తుదారుడి వివరాలు, సేవ రకం, చెల్లించిన రుసుం, దరఖాస్తు పరిశీలన, ధ్రువపత్రం తయారీ, జారీ చేసిన తేదీ వంటి వివరాలను పరిశీలిస్తే అసలు ప్రక్రియలో ఎక్కడైనా నిబంధనల ఉల్లంఘన జరిగిందా అన్నది గుర్తించవచ్చు. అందుకే ఖమ్మం కేంద్రంలో ఏసీబీ గుర్తించిన అంశాలపై నమూనా ధ్రువపత్రాలను, దరఖాస్తులను, రుసుం ల రసీదులను, సంతకాల నమోదును పరిశీలించడం కీలకంగా మారుతుంది.

**--- అనధికార వ్యక్తులకు దరఖాస్తుదారుల సమాచారం ఎలా చేరింది?**
మీ సేవా కేంద్రాల్లో ప్రజలు తమ వ్యక్తిగత సమాచారాన్ని సమర్పిస్తారు. గుర్తింపు వివరాలు, కుటుంబ వివరాలు, ఆదాయం, కులం, నివాసం, భూములు, విద్య, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారం వంటి వివరాలు అనేక సేవల్లో అవసరం కావచ్చు. ఇలాంటి సమాచారాన్ని అధికారిక బాధ్యత లేని వ్యక్తులు నిర్వహిస్తే, ఆ సమాచార భద్రతపై ప్రశ్నలు తలెత్తుతాయి. అందువల్ల ఖమ్మం కేంద్రంలో అనధికార వ్యక్తుల ప్రమేయం ఏ స్థాయిలో ఉందో, వారికి దరఖాస్తులపై ఎంతవరకు గోప్యత ఉందో కూడా విచారణలో తేలాల్సిన అంశమే.---- మధ్యవర్తుల వ్యవహారం ఎంతవరకు ఉంది? ఏసీబీ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన తనిఖీల్లో అనధికార మధ్యవర్తుల ప్రమేయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించింది. కొన్ని కేంద్రాల్లో కేంద్రాల నిర్వాహకులు, మధ్యవర్తుల మధ్య జరిగినట్లు గుర్తించిన నగదు రహిత లావాదేవీలు, సందేశాల మార్పిడిని కూడా అధికారులు పరిశీలించినట్లు నివేదికలు వెల్లడించాయి. ఖమ్మం కేంద్రానికి సంబంధించి కూడా ఇలాంటి సంబంధాలు ఉన్నాయా? ఉంటే వారి పాత్ర ఏమిటి? ప్రజల నుంచి అదనపు మొత్తాలను ఎవరు వసూలు చేశారు? అనే అంశాలను దర్యాప్తులో స్పష్టీకరించాల్సి ఉంది.--- ఒక కేంద్రం తనిఖీతో సమస్య ముగిసిందా?ఖమ్మంలో ఒక మీ సేవా కేంద్రంలో ఏసీబీ గుర్తించిన అంశాలు నిజమైతే, దాన్ని ఒక్క కేంద్రానికి మాత్రమే పరిమితం చేసి చూడకుండా జిల్లాలోని ఇతర మీ సేవా కేంద్రాల్లో పరిస్థితి ఎలా ఉంది? అన్నదీ పరిశీలించాల్సిన ప్రశ్నగా మారుతుంది. అర్బన్, రూరల్ ప్రాంతాల్లోని కేంద్రాల్లో నిర్ణీత రుసుముల అమలు, ధ్రువపత్రాలపై సంతకాల విధానం, నిర్వాహకుల అధికార పరిధి, అనధికార వ్యక్తుల ప్రవేశం, దరఖాస్తుల నిర్వహణ వంటి అంశాలపై నమూనా తనిఖీలు జరిగితే వ్యవస్థలో ఎక్కడైనా పునరావృత సమస్య ఉందా అన్నది బయటపడే అవకాశం ఉంటుంది.

**--- ఇప్పుడు కావాల్సింది తనిఖీ కాదు, తుది చర్యే**
ఏసీబీ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నిబంధనల ఉల్లంఘనలను గుర్తించడం అవినీతి నిరోధక చర్యల్లో ఒక ముఖ్యమైన దశ. కానీ ప్రజల దృష్టిలో అసలు ప్రశ్న అక్కడితో ముగియదు. తనిఖీలో ఏం బయటపడింది? దానిపై ఎవరు బాధ్యత వహించారు? ప్రభుత్వం ఏ చర్య తీసుకుంది? ప్రజలకు నష్టం జరిగితే దాన్ని ఎలా సరిచేశారు? అన్నదే కీలకం. ఖమ్మం మీ సేవా కేంద్రానికి సంబంధించిన ఏసీబీ తనిఖీపై తదుపరి చర్యలు ఏమిటన్నది అధికార యంత్రాంగం స్పష్టంగా వెల్లడించాల్సిన అవసరం ఎంతైనా ఉంది మరి.

## విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు





**ఖమ్మం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం ఖమ్మం నగరంలోని ఐ.టి.డి.సి లో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వంలో పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా టూరిజం ఆఫీసర్ సుమన్ చక్రవర్తి ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి . ఈ సందర్భంగా సుమన్ చక్రవర్తి మాట్లాడుతూ మన సంస్కృతికి, సంప్రదాయాలకు ,స్మారక కట్టడాలు ,చారిత్రక కట్టడాలు ప్రతిబింబాలని, వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ,అందుకు రేపటి పౌరులైన నేటి బాలలకు అవగాహన కల్పించడానికి, బాధ్యతను తెలియజేయటానికి ఈ పోటీలు నిర్వహించడం జరిగింది అన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ఈనెల 27వ తేదీ ఆదివారం సాయంత్రం లకారం చెరువు , ట్యాంక్ బండ్ వద్ద జిల్లా కలెక్టర్ చేతులు మీదుగా బహుమతి ప్రధానోత్సవం జరుగును అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మార్క్, లక్ష్మి , ఉపాధ్యాయులు సయ్యద్ షఫీ ,రత్నాకర్, మహమ్మద్ షఫీ ఆదిలక్ష్మి ,సుజాత, వివిధ పాఠశాలల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## సామాజిక సేవలో శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల



**ఖమ్మం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాల (ఎస్ సి ఐటి), ఖమ్మం జాతీయ సేవా పథకం (ఎన్ ఎస్ ఎస్) సెల్ ఆధ్వర్యంలో, మ్యాక్స్ విజన్ ఐ హాస్పిటల్ సహకారంతో తల్లంపాడు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.ఈ శిబిరంలో 130 మంది గ్రామస్తులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందించారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని తదుపరి చికిత్స కోసం ఆసుపత్రికి రిఫర్ చేశారు. తల్లంపాడు గ్రామ సర్పంచ్ అంబేద్కర్ ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించడం సామాజిక బాధ్యతలో భాగమని అన్నారు. విద్యార్థులు ఎన్ ఎస్ ఎస్ ద్వారా సేవాభావాన్ని అలవర్చుకుని సమాజ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు.కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక మాట్లాడుతూ, ఎన్ ఎస్ ఎస్ యొక్క “Not Me But You” స్ఫూర్తితో విద్యార్థులు సమాజ సేవలో చురుకుగా పాల్గొంటున్నారని తెలిపారు. ఇలాంటి ఆరోగ్య శిబిరాలు ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించడంతో పాటు విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను మరింత బలపరుస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ వి సుదర్శన్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, డిప్లొమా ఇంచార్జి కృష్ణ ప్రసాద్ ,ప్రోగ్రాం కోఆర్డినేటర్ నరేష్, వాలంటీర్లు, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

## సర్వజ్ఞ సూపర్ కిడ్జ్‌లో ఘనంగా “ఫైర్‌లెస్ కుకింగ్, డాడ్స్ అండ్ కిడ్స్” కార్యక్రమం



**ఖమ్మం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** సర్వజ్ఞ సూపర్ కిడ్జ్‌లో చిన్నారుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించడంతో పాటు తండ్రులు, పిల్లల మధ్య అనుబంధాన్ని మరింత బలపరిచే ఉద్దేశంతో “ఫైర్‌లెస్ కుకింగ్ – డాడ్స్ అండ్ కిడ్స్” కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.మంటను ఉపయోగించకుండా తండ్రులు తమ చిన్నారులతో కలిసి వివిధ రకాల రుచికరమైన, ఆరోగ్యకరమైన వంటకాలను తయారు చేశారు. పిల్లలు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. తండ్రులు, పిల్లలు కలిసి వంట చేయడం ద్వారా సహకారం, పరిశుభ్రత, ఆహారంపై అవగాహన, స్వయం ఆధారితత వంటి విలువలు పిల్లల్లో పెంపొందాయి.తండ్రుల సృజనాత్మకత, పిల్లల ఉత్సాహం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమం తల్లిదండ్రులను పాఠశాల కార్యకలాపాల్లో భాగస్వాములను చేస్తూ, పిల్లల సమగ్ర అభివృద్ధికి పాఠశాల అందిస్తున్న అవకాశాలకు నిదర్శనంగా నిలిచింది.ఈ సందర్భంగా సర్వజ్ఞ చైర్మన్ ఆర్.వి. నాగేంద్ర కుమార్, డైరెక్టర్ నీలిమ కార్యక్రమంలో పాల్గొన్న తండ్రులు, చిన్నారులను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంతో పాటు కుటుంబ విలువలను పెంపొందించడంలో ఎంతో ఉపయోగపడతాయని వారు పేర్కొన్నారు.కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఉపాధ్యాయ బృందాన్ని కూడా వారు అభినందించారు.

# అభివృద్ధిని చూసి ఓర్వలేకే మా ప్రభుత్వం పై కుట్రలు

- అక్రమ కట్టడాల కూల్చివేతలతో మా పార్టీకి ఎలాంటి సంబంధం లేదు
- అట్రాసిటీ కేసు విచారణకు పోలీసులకు పూర్తిగా సహకరిస్తాం
- వినాయక ఉత్సవాల్లో ప్రజల పిలుపు మేరకే హాజరయ్యా
- డ్యాన్స్‌లో కత్తి ఘటనతో నాకు సంబంధం లేదు
- తప్పుడు ఆరోపణలతో మా కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీయాలని చూస్తే చట్టపరమైన చర్యలు తప్పవు : సర్పంచ్ షేక్ సిద్దిక్ హెచ్చరిక



**ఖమ్మం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** తమ ప్రజాపాలన ప్రభుత్వంలో అభివృద్ధిని చూసి ఓడవలేకనే కొందరు కుట్రపన్నుతున్నారని, ఆ కుట్రలో భాగంగానే కొందరు తమపై కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టను దెబ్బతీసేందుకు పన్నాగం పన్నుతూ ఇబ్బందుల గురిచేయాలని చూస్తున్నారని పువ్వాడ ఉదయ నగర్ గ్రామ సర్పంచ్ షేక్ సిద్దిక్ ఆరోపించారు.ఖమ్మం పరిధిలోని పువ్వాడ ఉదయ్ నగర్‌లో అక్రమ కట్టడాల కూల్చివేతల విషయంలో తనకు గానీ, తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీకి గానీ, తన అనుచరులకు గానీ ఎలాంటి సంబంధం లేదని సర్పంచ్ షేక్ సిద్దిక్ స్పష్టం చేశారు. ఈ ఘటనకు సంబంధించి తనపై వస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. అట్రాసిటీకి సంబంధించిన అంశంలో పోలీసులు ఏ విచారణకు పిలిచినా తాను పూర్తిగా సహకరిస్తానని సిద్దిక్ తెలిపారు. చట్టంపై తనకు పూర్తి నమ్మకం ఉందని, విచారణలో వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన వినాయక ఉత్సవాల్లో ప్రజల పిలుపు మేరకు తాను హాజరయ్యానని సిదిక్ తెలిపారు. ఉత్సవాల్లో కొంతమంది డ్యాన్స్ చేస్తూ కత్తి లేదా డూప్లికేట్ కత్తి వంటి వస్తువును చేతబట్టి డ్యాన్స్ చేసినట్లు తన దృష్టికి వచ్చిందని, అయితే ఆ ఘటనతో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ విషయంపై పోలీసులు చేపట్టే విచారణలో అసలు నిజానిజాలు తేలుతాయని ఆయన పేర్కొన్నారు.అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఆరోపణలు గ్రామ పంచాయతీ పరిధిలో తాను చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ చర్యలను చూసి ఓర్వలేని కొంతమంది తనపై, తన పార్టీపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని సర్పంచ్ షేక్ సిద్దిక్ ఆరోపించారు. వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. తనపై గానీ, తన పార్టీపై గానీ నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నాలను వెంటనే మానుకోవాలని ఆయన సూచించారు. ఇలాంటి ప్రయత్నాలు కొనసాగితే చట్టపరమైన మార్గాలను ఆశ్రయించి చర్యలు తీసుకోవాల్సి వస్తుందని సిద్దిక్ హెచ్చరించారు. పోలీసుల విచారణకు పూర్తిగా సహకరిస్తామని, విచారణ అనంతరం వాస్తవాలు ప్రజలకు స్పష్టమవుతాయని సర్పంచ్ షేక్ సిద్దిక్ పేర్కొన్నారు.

# ప్రజా దరఖాస్తులు నిర్ణీత గడువులో పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

- రీసర్వే చేసిన మొలుగుమాడు గ్రామ రెవెన్యూ డేటా ఎంట్రీ వివరాలను పరిశీలన
- మండలంలోని మొదటి విడుతలో ఐదు గ్రామాలలో చేపట్టిన భూ రీసర్వే పారదర్శకంగా నిర్వహించాలి*మ
- ఎర్రుపాలెం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, రీ సర్వే డేటా ఎంట్రీ పక్రియ పరిశీలించిన జిల్లా కలెక్టర్







**ఖమ్మం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** ప్రజలకు ప్రభుత్వ సేవలు పారదర్శకంగా, వేగవంతంగా అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.శనివారం మధిర నియోజకవర్గంలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. ఎర్రుపాలెం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి, కార్యాలయ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డి తో కలిసి మండల పరిధిలోని మొలుగుమాడు గ్రామంలో ఫైలెట్ ప్రాజెక్టు కింద నిర్వహించిన రీసర్వే వివరాలు, డేటా ఎంట్రీ పక్రియను పరిశీలించారు. రీసర్వే అనంతరం రైతులకు నూతన పాసుపుస్తకాల జారీ ప్రక్రియపై అధికారులతో చర్చించి సూచనలు చేశారు.ఎర్రుపాలెం మండలంలో మొదటి విడుదలతో ఐదు గ్రామాలలో చేపడుతున్న భూ సర్వే పంచనామ పత్రాలు, కంప్యూటర్ డెటా ఎంట్రీ విధానంను పరిశీలించారు. రైతులతో నేరుగా మాట్లాడుతూ, భూ రీ-సర్వే ఉద్దేశ్యం, చేపడుతున్న ప్రక్రియపై అవగాహన కల్పించాలని, రైతుల సందేహాలు, అనుమానాలను అడిగి తెలుసుకుని, వాటిని నివృత్తి చేయాలని కలెక్టర్ సూచించారు. సర్వే ప్రక్రియలో ఎలాంటి అపోహలకు తావులేకుండా రైతుల సమక్షంలోనే ప్రతి అంశాన్ని పరిశీలించి నమోదు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమ పురోగతిపై ఆరా తీశారు. ఓటరు జాబితాల సవరణ ప్రక్రియను వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనామిలిస్, మ్యాపింగ్ కాని ఓటర్ల వివరాలను బిఎల్ఓ లు యాప్ లో నమోదు చేసే విధానం, ప్రత్యక్షంగా హియరింగ్ కు హాజరైన ఓటర్ల కు ఎదురై సమస్యలను పరిషార్కంలో ఎలాంటి లోటుపాట్లు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న వివిధ దస్త్రాలు, స్లాట్ బుకింగ్, రిజిస్ట్రేషన్లు, సాదా బైనామా దరఖాస్తులు, భూ భారతి దరఖాస్తుల స్థితిగతులను సమీక్షించారు. ప్రజలకు సంబంధించిన భూ సమస్యలు ఎక్కువకాలం పెండింగ్‌లో ఉండకుండా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించిన కలెక్టర్, కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలు, రేషన్ కార్డులు, ఇతర సేవలకు సంబంధించిన దరఖాస్తుల పరిష్కారంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందించే సేవల విషయంలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ప్రజల సమస్యల సంబంధించిన దరఖాస్తులను సాధ్యమైనంత వరకు మండల స్థాయిలోనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని, ప్రజలు జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే సేవలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. మండల కార్యాలయాలకు వచ్చే ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులో పరిష్కరించి ప్రజల ఇబ్బందులను తగ్గించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.అనంతరం మధిర మండలంలోని దెందుకూరు గ్రామంలో రైల్వే మూడవ లైను వలన పలు రైతులకు పోలాలకు వెళ్ళే రోడ్డు ఇబ్బందుల విషయమై రైల్వే అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి సూచనలు ఇచ్చి, తగువిధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, మధిర మండల తహసీల్దారు రాంబాబు, ఎర్రుపాలెం మండల తహసీలార్ సునీత ఎలిజబెత్, డిప్యూటీ తహసీల్దార్ జ్యోతి, ఆర్ఐ శిరీష, సర్వేయర్ రాజశేఖర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ పోరాట జ్యోతి, వీరనారి చాకలి ఐలమ్మ : మేకల మల్లి బాబు యాదవ్



**ఖమ్మం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** భారతదేశ స్వాతంత్ర్యం కోసం ఝాన్సీ లక్ష్మీబాయి పోరాటం చేస్తే, తెలంగాణ కోసం వీరనారి చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య లాంటి వారు చేసిన అసాధారణ పోరాట ఫలితంగానే నేడు మనం తెలంగాణ ఫలితాలు అనుభవిస్తున్నామని డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ తెలిపారు. కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలో చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా బీసీ కులాల ప్రతినిధుల సమక్షంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ నిజాం నిరంకుశ పరిపాలనలో గ్రామాలలో దొరలు భూస్వాములు దేశముఖ్ లు ప్రజలను, మహిళలను బానిసలుగా చేసి వెట్టి చాకిరి పేరుతో ప్రజల శ్రమను దోపిడీ చేస్తూ, రైతుల భూములను అక్రమంగా లాక్కొని, ఉచితంగా పనులు చేయించు కుంటున్న ఆ రోజులలో అందరూ భయపడి ఊరుకున్నారు కానీ తనకున్న 4ఎకరాల భూమిని ఇవ్వనని చావనైన చస్తాను గాని భూమి ఇవ్వనని, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా దొరల అహంకారానికి వ్యతిరేకంగా ఎదురొడ్డి నిలబడి పోరాటం చేసిన చాకలి ఐలమ్మకు మద్దతుగా చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద ఎత్తున ప్రజలు, ఆంధ్ర మహాసభ కమ్యూనిస్టు పార్టీల సహకారంతో తిరుగుబాటు చేశారు. ఐలమ్మకు చదువు లేకపోయినా ఆత్మ గౌరవం కోసం పోరాటం చేసింది. భూమి మనది, శ్రమ మనది, పంటమన్నది. అనుభవించేది పాలించేది దొరలా అని ప్రశ్నించే మొదటి గొంతుక అయింది చాకలి ఐలమ్మ అని కొనియాడారు. సమాజంలో జరిగే ప్రతి అన్యాయానికి ఒక మహిళగా ఆమె ఒక్కతే ఆదర్శం అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ మేకల మల్లికార్జునరావు, ముదిరాజ్ సంఘం మండల నాయకులు శీలం పుల్లయ్య, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు పాటిబండ్ల ప్రసాద్, వడ్డెర సంఘం నాయకులు తురక బిక్షం చల్ల మల్లయ్య, ఓబీసీ జిల్లా నాయకులు చల్ల మల్లయ్య, చింతలపెద్ద వెంకయ్య,బాధావత్ నాగరాజు, జక్కంపూడి వెంకటేశ్వర్లు, గుగులోత్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పోరాడిన ఐలమ్మ చరిత్ర చిరస్మరణీయం

- చాకలి ఐలమ్మ పోరాట పటిమ నేటితరానికి స్ఫూర్తిదాయకం : జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్





**ఖమ్మం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** సమాజంలోని అసమానతలకు ఎదురొడ్డి, వెట్టిచాకిరి, దోపిడీకి వ్యతిరేకంగా నిర్భయంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని , వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని శనివారం ఖమ్మం , వైరా రోడ్డులోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సమీపంలో ఉన్న చాకలి ఐలమ్మ విగ్రహానికి జిల్లా కలెక్టర్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు . అనంతరం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ 131వ జయంతి వేడుకల్లో కలెక్టర్ పాల్గొని, చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు . ఈ సందర్భంగా డాక్టర్ కేవీ కృష్ణారావు మాట్లాడుతూ ఐలమ్మ విగ్రహాన్ని హైదరాబాదు ట్యాంక్ బండ్ పై పెట్టాలని డిమాండ్ చేశారు . చాకలి ఐలమ్మభూ పోరాటం, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తనదైన పాత్రను పోషించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు . ఆమె పోరాట పటిమ , ధైర్యసాహసాలు మహిళా శక్తికి ప్రతీకగా నిలిచాయని , నేటి తరానికి కూడా ఆమె జీవితం ఆదర్శప్రాయమని అన్నారు . కొత్త కొండ శ్రీలక్ష్మి మాట్లాడుతూ జనగం జిల్లాకు చాకలి ఐలమ్మ పేరు పెట్టాలని డిమాండ్ చేశారు . సమాజ హితం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను , వారి సేవలను భవిష్యత్ తరాలకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వారి జయంతి , వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తోందని తెలిపారు . తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి స్ఫూర్తిగా నిలిచిన చాకలి ఐలమ్మ తెలంగాణ ప్రజల పోరాట స్ఫూర్తిని , మహిళా శక్తిని చాటి చెప్పారని కలెక్టర్ అన్నారు. ఆమె ఆశయాలు , పోరాట విలువలను స్మరించుకుంటూ సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారిణి జి.జ్యోతి , దుంపటి నగేష్ , సట్టు వెంకటేశ్వర్లు , ఎడపల్లి భాస్కర్ , పడిగెల కృష్ణవేణి , కనతాల వెంకన్న , వల్లంకొండ కొండలు , ఎడపల్లి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు .

# చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా నివాళులు





**ఖమ్మం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** భారత ప్రభుత్వ డిజిటల్ భారత్ నిధి( డి వి ఎన్) నిధులతో జిల్లాలో చేపడుతున్న టెలికాం ప్రాజెక్టుల పురోగతి, టెలికాం మౌలిక సదుపాయాలపై జిల్లా కలెక్టర్‌తో టెలికమ్యూనికేషన్స్ శాఖ, బిఎస్ఎన్ఎల్ అధికారులు సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ టెలికమ్యూనికేషన్స్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డి. భాస్కరరావు, ఎన్. సత్యనారాయణ కలెక్టర్‌ను కలిసి ప్రాజెక్టుల వివరాలను వెల్లడించారు.జిల్లాలో 16 చోట్ల 4 జి సాచురేషన్ ప్రాజెక్టులకు భూసేకరణ పెండింగ్‌లో ఉందని అధికారులు తెలిపారు. కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి ఈ ప్రాజెక్టులను పర్యవేక్షిస్తున్నందున భూముల గుర్తింపు, కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు.అలాగే అన్ని శాఖల అధికారులతో ప్రతి నెలా జిల్లా స్థాయి టెలికాం కమిటీ సమావేశం నిర్వహించాలని, తవ్వకం పనులు చేపట్టే ముందు సంబంధిత అధికారులు తప్పనిసరిగా "కాల్ వెల్ఫేర్ యు డిగ్ " యాప్‌ను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఆర్ ఓ డబ్ల్యు నిబంధనలకు అనుగుణంగా పట్టణ స్థానిక సంస్థలు అంతర్గత అనుపాలన ఉత్తర్వులు జారీ చేసేలా ఆదేశించాలని కోరారు.అధికారుల విజ్ఞప్తిపై కలెక్టర్ స్పందిస్తూ అన్ని అంశాల్లో పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఏజీఎం కొత్తగూడెం సుభాష్, జేటీఓలు సందీప్, బాలకృష్ణ, సైదులు, అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ భవన్‌లో ఘనంగా వీరనారి చిట్యాల (చాకలి) ఐలమ్మ జయంతి వేడుకలు



**హైదరాబాద్, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** ( మాధవరావు యెగినాటి, "నేటి శుభోదయ" తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల కో- ఆర్డినేటర్ ) ::: హైదరాబాద్‌లోని బిఆర్ఎస్ రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యాలయం తెలంగాణ భవన్‌లో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చిట్యాల (చాకలి) ఐలమ్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ పాల్గొని, ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు, బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాల ఉపేందర్ రెడ్డి, మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, ఖమ్మం మాజీ జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్, భద్రాచలం నాయకులు మానె రామకృష్ణ, రావులపల్లి రాంప్రసాద్, నాయకులు బండారు వీరబాబుతో పాటు పలువురు బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కలెక్టర్ ఆదేశించినా కదలని మండల అధికారులు

- కూలిన ఇల్లు, అధికారుల నిర్లక్ష్యం
- ఎల్ 3 లో చూపించి వదిలేశారు, ఎల్ 1 కు అర్వ్హత ఉన్నా పట్టించుకోలేదని ఆరోపణలు
- కలెక్టర్ ఆదేశించినా కదలని మండల అధికారులు
- ఇందిరమ్మ ఇంటి కోసం దివ్యాంగురాలి వినతి
- ఎల్ 3 నుంచి ఎల్ 1కు మార్చాలని కలెక్టర్‌కు దరఖాస్తు --- అధికారుల పరిశీలన కోసం ఎదురుచూపులు



**ఖమ్మం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** ఖమ్మం జిల్లా, రఘునాథపాలెం మండలం, బూడిదంపాడుఇందిరమ్మ ఇళ్ల పథకం విషయంలో అర్హులైన పేదలకు న్యాయం జరగడం లేదని బూడిదంపాడు గ్రామంలో ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా దివ్యాంగురాలైన తేజావత్ చంద్రావతి భర్త భాషా (లేటు) కుటుంబానికి ఇందిరమ్మ ఇంటి విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించిన సమయంలో చంద్రావతి నివాసం శిథిలావస్థలో ఉన్నప్పటికీ ఎల్ 3 కేటగిరీలో నమోదు చేశారని, వాస్తవానికి ఆమె ఎల్ 1 కేటగిరీకి అర్హురాలైనా అధికారులు పట్టించుకోలేదని కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. అనంతరం కురిసిన భారీ వర్షాలకు ఆ ఇల్లు పూర్తిగా కూలిపోవడంతో ప్రస్తుతం రేకులు వేసుకుని, చుట్టూ టార్పాలిన్ పట్టాలు కట్టుకుని దుర్భర పరిస్థితుల్లో నివసిస్తున్నట్లు తెలిపారు.ఈ విషయంపై చంద్రావతి కుటుంబ సభ్యులు ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌ను కలిసి, తమ దరఖాస్తును పరిశీలించి ఎల్ 3 నుంచి ఎల్ 1కు మార్చి ఇందిరమ్మ ఇంటి మంజూరుకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్, దరఖాస్తును పరిశీలించి విచారణ నిర్వహించి నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను ఆదేశించినట్లు పేర్కొన్నారు.అయితే కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో అధికారులు ఇప్పటివరకు ఇంటిని పరిశీలించేందుకు కూడా రాలేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. దీంతో జిల్లా కలెక్టర్ ఆదేశాలకే మండల స్థాయి అధికారులు స్పందించకపోవడంపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.--- ఇంటి చుట్టూ మురుగునీరు, పారిశుధ్యంపై పట్టింపు ఏది?మరోవైపు చంద్రావతి నివాసం చుట్టూ మురుగునీరు నిలిచిపోవడంతో పారిశుధ్య సమస్య నెలకొన్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. దోమల వ్యాప్తి నివారణకు కనీసం డ్రై డే కార్యక్రమాలు నిర్వహించాలని గ్రామ సెక్రటరీ నరేష్‌ను సంప్రదించినప్పటికీ స్పందన సరిగా లేదని ఆరోపిస్తున్నారు.గ్రామ సమస్యలపై ఫిర్యాదు చేసినప్పుడు “నువ్వు ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో” అంటూ నిర్లక్ష్యంగా, బాధ్యతారహితంగా మాట్లాడినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత పంచాయతీ కార్యదర్శి వివరణ తీసుకోవాల్సి ఉంది.--- గ్రామ సమస్యలు పట్టించుకోని కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్గ్రామంలోని సమస్యలను పరిష్కరించాల్సిన పంచాయతీ కార్యదర్శి విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామ సమస్యలను పట్టించుకోకుండా పంచాయతీ కార్యాలయంలోనే కాలక్షేపం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.--- ఇలాంటి అధికారి గ్రామపంచాయతీలో ఉన్నా లేకపోయినా ఒకటేఅంటూ గ్రామస్తులు మండిపడుతున్నారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి బూడిదంపాడు గ్రామంలో పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, దివ్యాంగురాలైన చంద్రావతి కుటుంబానికి నిబంధనల ప్రకారం న్యాయం చేయాలని కోరుతున్నారు. అలాగే పంచాయతీ కార్యదర్శిపై వచ్చిన ఆరోపణలపై విచారణ నిర్వహించి, తప్పిదం నిర్ధారణ అయితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# కొత్తపల్లి కి ఘన సన్మానం





**ఖమ్మం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** ప్రపంచ ఫార్మసీ ఆఫీసర్ ల దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఐదుగురు ఉత్తమ ఫార్మసీ ఆఫీసర్ లకు సన్మానం చేయడం జరిగింది.గత 18 సంవత్సరాలుగా 104 సంచార వైద్య సేవలు అందించి ప్రస్తుతం ఆయుష్ శాఖ, వైరా ఏరియా హాస్పిటల్ లో ఫార్మసీ ఆఫీసర్ గా విధులు నిర్వర్తిస్తున్న కొత్తపల్లి కృష్ణారావు ఉత్తమ ఫార్మసీ ఆఫీసర్ గా సన్మానం అందుకోవడం జరిగింది.ముందుగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధి కారి డాక్టర్ దనాల కోట రామారావు కేక్ కట్ చేసి జిల్లా ఫార్మసీ ఆఫీసర్ కోట నాగమణి కి, జిల్లా కేంద్ర మెడికల్ స్టోర్స్ మంగీలాల్, పద్మ లకు తినిపించారు.అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధి కారి డాక్టర్ వేణుమాధవ రావు, జిల్లా వ్యాక్సిన్ సూపర్వైజర్ రమణ ఈ కార్యక్రమంలో పాల్గొని ఫార్మసీ ఆఫీసర్ ల ముఖ్య విధుల గురించి, మారుతున్న కాలంలో సాంకేతికత అలవరచుకోవాలి సూచించారు.కొత్తపల్లి కృష్ణారావు "ఆరోగ్యకరమైన సమాజం కోసం" అన్న కవితను చదివి వినిపించి జిల్లా అధికారుల, ఫార్మసీ ఆఫీసర్ ల ప్రశంశలు అందుకోవడం జరిగింది.

## వందలాది మంది దైవ సేవకులు, కుటుంబ సభ్యులు, బంధువుల మధ్య రెవరెండ్ డాక్టర్ జీ ఎస్ విజయ భూషణం 80వ జన్మదిన వేడుకలు





**రాజేంద్రనగర్, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** గాస్పెల్ ట్రంపెట్స్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు, రంగారెడ్డి జిల్లా పాస్టర్స్ , మినిస్టర్స్ ఫెలోషిప్ చైర్మన్ రెవరెండ్ డాక్టర్ జీ ఎస్ విజయ భూషణం 80వ జన్మదిన వేడుకలు శనివారం పీడీపీ చౌరస్తా సమీపం లో గల రాయల్ హయత్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా జరిగాయి. కుటుంబ సభ్యులు, గాస్పెల్ ట్రంపెట్స్ మినిస్ట్రీస్ పెద్దల ఆధ్వర్యంలో జరిగిన జన్మదిన వేడుకలకు డోనాల్ చర్చ్ సీనియర్ పాస్టర్ బిషప్ మోజెస్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బైబిల్ సందేశాలను బిషప్ జోహాబ్ లోహర అందచేశారు. బైబిల్ లో అనేక మంది భక్తులు దేవుని కృప పొందుకున్నారని గుర్తు చేశారు. మోషే దేవుని కృప పొందుకున్నారని, మరియమ్మ దేవుని కృప పొందుకున్నాదని, ఎస్తేరు దేవుని కృప పొందుకున్నదని, పౌలు దేవుని కృప పొందుకుని ఆయన సేవను బలంగా చేశారని గుర్తు చేశారు. అలాంటి దేవుని కృప ను రెవరెండ్ డాక్టర్ జీ ఎస్ విజయ భూషణం పొందుకుని అనేక సంవత్సరాలుగా దేవుని పరిచర్య చేస్తున్నారన్నారు. చిన్న పిల్లలకు విద్యాబోధన, అవసరత లో ఉన్నవారిని ఆదుకోవడం, సేవకులను ధైర్య పరుస్తూ ముందుకు నడిపించడం లాంటి అనేక మేలు కరమైన పనులను డాక్టర్ విజయ భూషణం చేస్తున్నారని అభినందించారు. ఈ పరిచర్య ఇలానే ముందుకు కొనసాగాలని ప్రార్థించాల్సిన అవసరం ఉందన్నారు. కృప వెంట కృప కలిగే విధంగా ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా వివిధ దేశాల నుంచి డాక్టర్ జీ ఎస్ విజయ భూషణం ద్వారా మేలు పొందిన, బలపరచబడిన వారు శుభాకాంక్షలు తెలియ చేశారు. రంగారెడ్డి జిల్లా పాస్టర్స్, మినిస్టర్స్, రాజేంద్రనగర్ పాస్టర్స్ ఫెలోషిప్, మొయినాబాద్ పాస్టర్స్ ఫెలోషిప్, హ్యాపీ హోమ్స్, గోల్డెన్ హైట్స్ కాలనీల అసోసియేషన్ ప్రతినిధులు, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు డాక్టర్ జీ ఎస్ విజయ భూషణం ను కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ భూషణం సతీమణి సిస్టర్ ఎస్తేర్ మేరీ విజయ, కుమార్తె సిస్టర్ మారనాథ, అల్లుడు రెవరెండ్ డాక్టర్ పాట్రిక్, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు సయ్యద్ హిదాయతుల్లా షఫీ, సుజాత్ పటేల్, సర్ఫరాజ్ సిద్ధిఖీ, ముజాహిద్ సికిందర్, క్రైస్తవ సంఘాల పెద్దలు రెవరెండ్ ప్రియా సాగర్, రెవరెండ్ పి స్వర్ణ కుమార్, రెవరెండ్ కె సుందర్ పాల్, రెవరెండ్ సీ హెచ్ సునీల్ సామ్యూల్, పాస్టర్ బట్టు శ్రీకాంత్, పాస్టర్ ఎస్ యేసుమని, పాస్టర్ బట్టు సుజాత, పాస్టర్ లీనా కుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఆరోపణల వెనుక అసలు ఉద్దేశం ఏమిటి?

- అమరవాదిపై నిరాధార ఆరోపణలు మానుకోవాలి
- ఆర్యవైశ్యుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయొద్దు



**ఖమ్మం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణపై కొందరు చేస్తున్న ఆరోపణలు వాస్తవాలకు విరుద్ధంగా ఉన్నాయని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొదుమూరి జగన్నాథం గుప్తా తీవ్రంగా ఖండించారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తూ ఆర్యవైశ్య సమాజంలో గందరగోళం సృష్టించే ప్రయత్నాలను మానుకోవాలని ఆయన హెచ్చరించారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆర్యవైశ్య మహాసభ బలోపేతానికి అమరవాది లక్ష్మీనారాయణ చేసిన కృషి ఏమిటో సమాజానికి తెలుసన్నారు. సభ్యత్వాల విస్తరణ, న్యాయపరమైన సమస్యల పరిష్కారం, సంఘాన్ని పటిష్టం చేయడం వంటి అనేక కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లారని తెలిపారు. ప్రభుత్వ సహకారంతో 5 ఎకరాల స్థలం సాధించడంలో కూడా ఆయన కృషి ఉందన్నారు."12 సంవత్సరాలు అధికారంలో ఉన్నామని చెప్పుకునే వారు.. ఆ కాలంలో సమాజం కోసం ఏం చేశారో ముందుగా సమాధానం చెప్పాలి. ఇప్పుడు ఆరోపణలు చేయడం సులభం.. కానీ చేసిన పనులకు లెక్క చెప్పడం కూడా అంతే అవసరం" అని జగన్నాథం గుప్తా అన్నారు.దొంగ, డూప్లికేట్ సభ్యత్వాల పేరుతో నిరాధార ఆరోపణలు చేయడం ద్వారా సమాజాన్ని తప్పుదోవ పట్టించవద్దని సూచించారు. సభ్యత్వాలపై ఆరోపణలు చేస్తున్న వారు అందుకు సంబంధించిన ఆధారాలను సమాజం ముందు ఉంచాలని డిమాండ్ చేశారు.ఆర్యవైశ్య ఆత్మీయ భవనం, తిరుమలలో తెలంగాణ భవనం, చింతల్‌బస్తీ భవనం రినోవేషన్, ఉప్పల్ భగాయత్‌లో స్థలం వంటి సమాజ అభివృద్ధి అంశాలపై జరిగిన కృషిని విస్మరించి వ్యక్తిగత విమర్శలకు దిగడం వల్ల ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు.ఇన్ని సంవత్సరాలు అమరవాది కార్యవర్గంలో పనిచేసిన వారు అప్పట్లో ఎందుకు మాట్లాడలేదు? ఇప్పుడు మాత్రమే ఆరోపణలు చేయడం వెనుక కారణం ఏమిటి? అని జగన్నాథం గుప్తా ప్రశ్నించారు.సమాజ కార్యక్రమాలకు దాతలు స్వచ్ఛందంగా అందించిన సహకారాన్ని పదవులతో ముడిపెట్టడం సరికాదన్నారు. పదవులను డబ్బులతో కొనుగోలు చేశారనే ఆరోపణలు చేస్తే అందుకు సంబంధించిన ఆధారాలను చూపాలని స్పష్టం చేశారు.కోర్టు ప్రక్రియకు అనుగుణంగా ఎన్నికలు జరిగి ఫలితాలు వెలువడిన తర్వాత కూడా ఎన్నికల ప్రక్రియపై వివాదాలు సృష్టించడం సమాజ ప్రయోజనాలకు మంచిది కాదన్నారు. ప్రజల తీర్పును గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు."ఆర్యవైశ్య సమాజాన్ని ఎవరు పడితే వారు చెప్పిన మాటలతో నమ్మించే రోజులు పోయాయి. ప్రతి విషయాన్ని పరిశీలించి, ఆలోచించి నిర్ణయం తీసుకునే చైతన్యం మా సమాజానికీ ఉంది" అని జగన్నాథం గుప్తా అన్నారు.తిరిగి అధికారంలోకి రావాలనుకునే వారు వ్యక్తిగత ఆరోపణలు, విమర్శలకు సమయం కేటాయించడం కంటే సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఎన్నికలు మళ్లీ వస్తాయని, అప్పుడు తమ పనితీరును ప్రజల ముందు ఉంచి మద్దతు కోరవచ్చన్నారు.ఆర్యవైశ్య సమాజాన్ని విభజించే ఆరోపణల కంటే.. సమాజాన్ని అభివృద్ధి చేసే కార్యాచరణే అవసరం. వ్యక్తిగత విమర్శలు పక్కనపెట్టి సమాజ ప్రయోజనాల కోసం అందరూ కలిసి పనిచేయాలని కొదుమూరి జగన్నాథం గుప్తా పిలుపునిచ్చారు.

# తెలంగాణ ప్రజల భవిష్యత్తు కోసం ఆమ్ ఆద్మీ పార్టీ పోరాటం

- GHMC ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ 300 స్థానాల్లో పోటీ చేస్తుంది : అంటూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు హేమ సుదర్శన్ జిల్లోజు




**హైదరాబాద్, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** విద్యా, వైద్యం, ఉపాధి కల్పనే ధ్యేయంగా ఆమ్ ఆద్మీ పార్టీ కృషి చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు హేమ సుదర్శన్ జిల్లోజు అన్నారు. శనివారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజలు చెల్లించే పన్నులకు ప్రతిఫలంగా మెరుగైన ప్రజా సేవలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు .ఢిల్లీ, పంజాబ్‌లో విద్య, వైద్యం, విద్యుత్, ఉపాధి, రైతులు, మహిళల భద్రత తదితర అంశాలపై తమ ప్రభుత్వాలు చేపట్టిన కార్యక్రమాలను పార్టీ అధికారంలోకి వస్తే తెలంగాణలోనూ అమలు చేస్తామన్నారు. కార్పొరేటర్ గా పోటీ చేయాలనుకుంటున్నారా : అప్ తరపున కార్పొరేటర్ గా పోటీ చేయాలనుకునే వారు 94922 78787 నెంబర్ లో సంప్రదించాలని హేమ సుదర్శన్ జిల్లోజు కోరారు. మహిళలకు 50 శాతం అవకాశాలు కల్పిస్తామని, యువతకు ప్రాధాన్యత ఇస్తామన్నారు.

# ఘనంగా కనకమామిడి నరేందర్ గౌడ్ జన్మదిన వేడుకలు

- శుభాకాంక్షలు తెలిపిన శంకర్ గౌడ్, రామ కృష్ణ గౌడ్..



**శేరిలింగంపల్లి , సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** ప్రముఖ వ్యాపార వేత్త, సంఘ సేవకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కనక మామిడి నరేందర్ గౌడ్ జన్మదిన వేడుకలు హఫీజ్ పేట్ లోనీ వారి నివాసం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టి పి సి సి జనరల్ సెక్రటరీ జగదీశ్వర్ గౌడ్ హాజరై నరేందర్ గౌడ్ ను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ. శంకర్ గౌడ్, బండి రామకృష్ణ గౌడ్ లు పాల్గొనీ శాలువాలతో సత్కరించి కనకమామిడి నరేందర్ గౌడ్ నిండు నూరేళ్ళు వర్ధిల్లాలనీ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నరేందర్ గౌడ్ స్పందిస్తూ..నా జన్మదిన సందర్భంగా నాకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతీ ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదములు అని తెలిపారు.

# అంబేద్కర్ నగర్ గణేశుని లడ్డు వేలం పాటలో రూ. 1,87,000/- కైవసం చేసుకున్న రాధాకృష్ణ దంపతులు







**శేరి లింగంపల్లి, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** శేరి లింగంపల్లి నియోజక వర్గం హాఫిజ్ పెట్ డివిజన్ అంబేద్కర్ నగర్ లో గణేష్ లడ్డు ని వేలం పాటలో రాధాకృష్ణ దంపతులు రూ 1,87,000/- కైవసం చేసుకున్నారు. రెండవ లడ్డుని మేకల నరేందర్ దంపతులు రూ " 86000/- కైవసం చేసుకున్నారు. అలాగే మూడవ లడ్డు ని ఉప్పరి వినోద్ కుమార్ దంపతులు కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమం అంబేద్కర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పెద్దలు పిల్లలు మహిళలు పాల్గొన్నారు.

# తెలంగాణ సాంకేతిక విద్య శాఖ నిర్వహించే టైపు రైటింగ్ జూనియర్ గ్రేడ్ లో ప్రథమ శ్రేణిలో ప్రతిభ కనబరిచిన కావేటి హాసిని

- అభినందించి ఉత్తీర్ణతా పత్రాన్ని అందించిన జిల్లా బిఆర్ఎస్ నాయకులు తోట రామారావు



**ఖమ్మం, సెప్టెంబర్ 26, నేటి శుభోదయ :** తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ నిర్వహించే టైపు రైటింగ్, షార్ట్ హ్యాండ్ పరీక్షలలో ఖమ్మం నగరానికి చెందిన బాబా టైప్ రైటింగ్ అండ్ షార్ట్ హ్యాండ్ విద్యార్థిని కావేటి హాసిని 7వ తరగతి ఉత్తీర్ణతో హాజరయ్యే టైపు రైటింగ్ జూనియర్ గ్రేడ్ పరీక్షలలో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించింది. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థికి సాంకేతిక విద్యాశాఖ జారీ చేసే ఉత్తీర్ణత పత్రాన్ని ఇన్స్టిట్యూషన్ అధ్యాపకుల ఆహ్వానం మేరకు ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ నాయకులు మాజీ కార్పొరేటర్ తోట రామారావు విచ్చేసి ప్రథమ శ్రేణిలో ప్రతిభ కనబరిచిన కావేటి హాసిని అభినందిస్తూ ఉత్తీర్ణత పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత రంగంలో టైపింగ్ యొక్క ప్రాముఖ్యత ఎంతో అవసరమని ప్రతి రంగంలో దీని యొక్క ఆవశ్యకత పెరిగిందని, సాంకేతిక విద్యాశాఖ 7వ తరగతి ఉత్తీర్ణతతోనే ఈ పరీక్షలు రాయటానికి అవకాశం ఇవ్వడం అభినందనీయమని, కావున తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ప్రత్యేక దృష్టి సారించి ఈ విషయంపై అవగాహన చేసుకుని టైపింగ్ నేర్పించాలని అది వారి భవిష్యత్తు లో అనేక రకాల ఉపాధి అవకాశాలకు నాంది పలుకుతుందని కొనియాడుతూ ఈ విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధతో విద్యార్థులను మోటివేషన్ చేస్తూ ఉత్తీర్ణత దిశగా అహర్నిశలు శ్రమిస్తున్న బాబా టైప్ రైటింగ్ అండ్ షార్ట్ ఇన్స్టిట్యూట్ ప్రిన్సిపల్ బాబా ను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఇన్స్టిట్యూషన్ అధ్యాపకులు బాబా డివిజన్ నాయకులు వంగాల వెంకట్, చేతి కృష్ణ, కిషన్ నాయక్, అబ్దుల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.




FNCC

నమస్కారం...మన ఫిలింనగర్ కల్చర్ సెంటర్ (FNCC) లో మేనేజ్మెంట్ కమిటీ మెంబర్ గా మరియు రెండుసార్లు కల్చరల్ కమిటీ చైర్మన్ గా ప్రస్తుతం అడిషనల్ కల్చరల్ కమిటీ చైర్మన్ అనేక సేవలు కమిటీ మెంబర్స్ మరియు సభ్యుల సహాయ సహకారాలతోటి అనేక కార్యక్రమాలు చేసిన విషయాన్ని మీకు గుర్తు చేస్తున్నాను.ఈసారి ఈనెల 27వ తేదీ ఆదివారం రోజు జరగబోయే ఎన్నికల్లో జాయింట్ సెక్రెటరీ గా పోటీ చేస్తున్నాను. కొండేటి సురేష్ అనే పేరుతో ఉండే నా EVM NO. 3 కి మీరు వేసే ఓటుతో గెలిచిన తర్వాత గతంలో కంటే ఎక్కువగా కష్టపడి FNCC అభివృద్ధికి కృషి చేస్తారని తెలియజేసుకుంటున్నాను. కాబట్టి మీ అమూల్యమైన ఓటును నాకు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించవలసిందిగా కోరుకుంటున్నాను

మరొక్కసారి గుర్తు చేస్తున్నాను నా EVM NO. 3 కి మాత్రం తప్పకుండా మీరు ఓటు వేయాలని అలాగే మన FNCC లో మీకు తెలిసిన ఓటు హక్కు ఉన్న వారి చేత కూడా నాకు ఓటు వేయిస్తారని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

మీ
కొండేటి సురేష్

Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620